PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 146 | విజయవాడ, ఆదివారం 28 డిసెంబర్ 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00
Vol No | Vijayawada, Sunday 28 December 2025 | Rs

మైనార్టీలపై దాడులు దుర్మార్గం

- తీవ్రంగా ఖండించిన సిపిఎం పొలిట్‌బ్యూరో
- ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటం

7



మరో గెలుపుపై టీమిండియా గురి

- నేడు శ్రీలంక మహిళలతో నాల్గో టి20
- రాత్రి 7.00గం||ల నుంచి

3



ఢంకా మోగించి శ్రామిక ఉత్సవ్‌ను ప్రారంభిస్తున్న ప్రకాష్ రాజ్, వేదికపై సిహెచ్ నర్సింగరావు, సత్యానంద్, గపూర్, ఎవి నాగేశ్వరరావు, బేబీరాణి, తెలకపల్లి రవి, రమణమూర్తి, దాడి సత్యనారాయణ తదితరులు

మనువాద భావజాలాన్ని పెకిలించాలి

శ్రామిక ఉత్సవ్ ప్రారంభిస్తూ ప్రముఖ సినీ నటుడు ప్రకాష్‌రాజ్ • సిఐటియు అఖిల భారత మహాసభ నేపథ్యంలో విశాఖలో ఘనంగా వేడుక

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

పాలకులు దేశంలో మనువాదాన్ని అమలు చేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, ఆ భావజాలాన్ని కూకటి వేళ్లతో పెకిలించాలని ప్రముఖ సినీ నటుడు ప్రకాష్ రాజ్ అన్నారు. సమస్యలపై శ్రామిక జనం గొంతెత్తి పోరాడాలని పిలుపునిచ్చారు. విశాఖలో ఈ నెల 31 నుంచి జనవరి నాలుగు వరకూ జరగనున్న సిఐటియు అఖిల భారత మహాసభను పురస్కరించుకుని బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్ వెనుక ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శనివారం నుంచి తలపెట్టిన శ్రామిక ఉత్సవ్ ఘనంగా ఆరంభమైంది. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్ అధ్యక్షత వహించిన ఈ ప్రారంభ వేడుకకు ముఖ్య అతిథిగా ప్రకాష్ రాజ్ హాజరయ్యారు. ఆయనతోపాటు వేదికపైగల అతిథులంతా కలిసి శ్రామికవర్గ సంస్కృతికి దర్పణం పట్టేలా యుద్ధ భేరిని డ్రమ్స్ కొట్టి ప్రారంభించారు. ప్రకాష్ రాజ్ 'లాల్ సలాం.. జై భీమ్' అని అభివాదం చేస్తూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తన మాటలతో సభికుల్లో ఉత్సాహం, ఉత్తేజం నింపారు. అంతా 'లాల్ సలామ్.. జై భీమ్' అనడంతో సభా ప్రాంగణం ఒక్కసారిగా హోరెత్తింది. సిఐటియుకు, తనకూగల బంధం ఈనాటిది కాదని, తన చిన్నప్పటి నుంచీ ఉందని ప్రకాష్ రాజ్ తెలిపారు. 18 ఏళ్ల వయసులోనే వీధి నాటికలు వేస్తూ శ్రమజీవుల చైతన్యం కోసం ఊరూరా తాను తిరిగానని వివరించారు. ఈ వేదికపై కళాకారులు ప్రదర్శించిన నృత్య రూపకాలు చూస్తే తన చిన్ననాటి వీధి నాటికల గురుతులు కళ్లముందు మెదిలాడుతున్నాయన్నారు. గతంలో శ్రామికుల గురించి... చెమట చుక్కకు ఓటమి లేదు అనేవారని, నేడు ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాల కారణంగా శ్రామికులకు బతికే పరిస్థితి లేదని ప్రకాష్ రాజ్ పేర్కొన్నారు. దేశంలో కార్పొరేట్లను పెంచడం వల్లే ఈ స్థితి నెలకొందన్నారు. సంస్కృతి పరిస్థితి చూస్తే.. భారతదేశం సరోవరం అయితే అందులో కనిపించే కమలం బిజెపి కాగా, దాని వేర్లు ఆర్‌ఎస్ఎస్ అని తెలిపారు. బిజెపిపై పోరాడటమే కాకుండా వేళ్లానుకుని ఉన్న ఆర్ఎస్ఎస్‌పైనా పోరాడాలని పిలుపునిచ్చారు. విశాఖ వచ్చాక ఇక్కడ పోరాడేవారిపై ప్రభుత్వ నిర్బంధం గురించి విన్నానని తెలిపారు. బంధించినప్పటికీ హక్కుల కోసం కార్మికుల గొంతు వినిపిస్తూ ఉంటుందన్నారు. తాను సినీ యాక్టర్‌ని అయినా కార్మిక గొంతే వినిపిస్తానని స్పష్టం చేశారు. ప్రవాహంలో కొట్టుకుపోయే చేపల్లా కాకుండా ఎదురీదే చేపలా పోరాడుతానన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు గఫూర్ మాట్లాడుతూ రాజ్యాంగానికి కట్టుబడి ఉన్న సెక్యులరిస్ట్ ప్రకాష్ రాజ్ అని కొనియాడారు.

శ్రమ అవార్డును ప్రకాష్‌రాజ్ నుంచి ప్రముఖ శ్రామిక కవి తెలకపల్లి రవి ఈ వేదికపై స్వీకరించారు. వేదికపై సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, లీడర్ పత్రిక సంపాదకులు వివి.రమణమూర్తి, ఫిల్మ్ మేకర్ సత్యానంద్, ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న, సిఐటియు నాయకులు కందారపు మురళి, బేబీరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, శ్రామిక ఉత్సవ్ కన్వీనర్ కె.రమాప్రభ ఉన్నారు.

సిఐటియు మహాసభ సమాచార మాలిక 8వ పేజీలో

తుది దశకు జిల్లాల పునర్విభజన

- 31న తుది నోటిఫికేషన్
- నెల్లూరు జిల్లాలోకి గూడూరు
- యథాతథంగా పోలవరం జిల్లా
- సిఎం సమీక్షలో వివిధ అంశాలు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జిల్లాల పునర్విభజన కొలిక్కి వచ్చింది. ఇందుకు సంబంధించి తుది నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ఈ నెల 31న విడుదల చేయనుంది. సచివాలయంలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన జిల్లాల పునర్విభజన, ప్రాథమిక నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు, సూచనలపై మంత్రులు, అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల పునర్విభజనపై స్వల్ప మార్పులు, చేర్పులతో ముందుకెళ్లాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజన ప్రాథమిక నోటిఫికేషన్‌పై వ్యక్తమైన సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని తుది నోటిఫికేషన్‌ను ఈ నెల 31న జారీ చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ఈ నెల 29న జరగనున్న కేబినెట్ ముందుకు రానున్నాయి. గత నెల 27న జిల్లాల పునర్విభజనపై ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 26 జిల్లాలకు తోడు కొత్తగా 3 జిల్లాలు, 5 రెవెన్యూ డివిజన్లు ఏర్పాటుతో సహా మార్పులపై నోటిఫికేషన్‌ను విడు దల చేసిన సంగతి పాఠకులకు విదితమే. రాష్ట్ర వ్యాప్తంగా 927 అభ్యంతరాలు, సూచన లు ప్రభుత్వానికి అందాయి. సమీక్షా సమావేశంలో రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోంమంత్రి వంగలపూడి అనిత, మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో స్వల్ప మార్పులు, చేర్పులు

గూడూరు నియోజకవర్గ ప్రజల అభిప్రాయం మేరకు గూడూరు నియోజకవర్గంలోని 5 మండలాలను తిరిగి నెల్లూరు జిల్లాలోనే కలపాలని అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అలాగే రైల్వే కోడూరును, తిరుపతి జిల్లాలోకి, రాయచోటిని మదనపల్లె జిల్లాలో రాజంపేట, సిద్దవటం, ఒంటిమిట్టను కడప జిల్లాలో విలీనం చేయాలనే అంశంపై చర్చ జరిగినప్పటికీ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. విస్తీర్ణ పరంగా పెద్దదైన ఆదోనిని రెండు మండలాలుగా విభజించాలనే అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చింది. మరోవైపు అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లి డివిజన్‌కు బదులుగా అడ్డరోడ్డు జంక్షన్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. మునగపాకను అనకాపల్లి డివిజన్‌లోనూ, అచ్యుతాపురంను అడ్డరోడ్డు జంక్షన్ డివిజన్‌లో చేర్చాలని సమావేశంలో నిర్ణయించారు. రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటు కానున్న పోలవరం జిల్లాలో ఎటువంటి మార్పులు చేయకుండా ప్రాథమిక నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్లుగా యథావిధిగా

మిగతా 7లో

రైతు మృతితో ప్రజాగ్రహం

- మీవల్లే చనిపోయారంటూ మంత్రులపై మండిపాటు
- ఫోన్లో పరామర్శించిన సిఎం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనం : సిపిఎం



కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రైతు రామారావుకు నివాళులర్పిస్తున్న సమయంలో 'మీ సానుభూతి మాకొద్దు' అంటూ బంధువుల నిరసన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోతున్న రైతు దొండపాటి రామారావు మృతి నేపథ్యంలో ప్రభుత్వం, మంత్రుల తీరుపై రైతుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. శుక్రవారం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ఇళ్లు కోల్పోతున్న వారితో సమావేశం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ సమావేశంలో మాట్లాడిన అనంతరం కుర్చీలో కూర్చుంటూ రైతు రామారావు అక్కడికక్కడే గుండెపోటుతో మృతిచెందారు. తన అభిప్రాయం చెప్పిన వెంటనే అక్కడే సమావేశం ఏర్పాటు చేసిన ప్రతినిధులు రైతు చెప్పిన ప్రతిపాదన సాధ్యం కాదని సమాధానం ఇచ్చారని, దీంతో తన బావ ఆవేదనకు గురై చనిపోయారని రామారావు బావమరిది మంత్రులపై మండిపడ్డారు. శనివారం మధ్యాహ్నం తాడేపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి నుండి భౌతికకాయాన్ని మందడం తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ పూలమాలవేసి నివాళి అర్పించేందుకు వెళ్లారు. ఆ సమయంలో మీ వల్లే మా బావ చనిపోయాడంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మనుషులను చంపడానికి వచ్చారా అంటూ మండిపడ్డారు. అన్ని రోడ్లు ఉండగా ఇళ్లు పీకి రోడ్డెందుకు వేయాలంటూ కేకలు వేశారు. ఆయనకు పలువురు మహిళలు కూడా తోడయ్యారు. అయితే పలువురు వారికి సర్దిచెప్పారు. అనంతరం మంత్రి అక్కడ నుండి వెళ్లిపోయారు. అలాగే

మిగతా 7లో

శాస్త్రీయ భావాలు పెంపొందిస్తేనే శాస్త్ర సాంకేతికాభివృద్ధి

- ముఖ్యమంత్రికి సిపిఎం విజ్ఞప్తి

2

ఎంజిఎన్ఆర్ఇజిఎ రద్దుకు వ్యతిరేకంగా 5 నుంచి దేశవ్యాప్త ఆందోళనలు

- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయం
- రాష్ట్రాలు, పేదలపై మోడీ ప్రభుత్వం విధ్వంసకర దాడి

7

విబి జి ఆర్ఎంఎం జి పథకాన్ని రద్దు చేసి

ఎంజి ఎన్ఆర్ఇజిఎను పునరుద్ధరించాలి

పోలీస్ నిర్బంధాల మధ్య ఎస్‌కెఎం ధర్నా



విజయవాడలో ధర్నా చేస్తున్న కార్మిక, కర్షక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలీస్ నిర్బంధాలు, ధర్నా చౌక్ చుట్టూ పోలీసుల భారీ మోహరింపు, సభా స్థలి సమీపంలో మూడంచెల పోలీస్ పహారాలను అధిగమిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, కౌలు రైతు సంఘాల కార్యకర్తలు విజయవాడ అలంకార్ సెంటర్‌లో శనివారం ధర్నా నిర్వహించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం గ్రామీణ పేదలకు అన్యాయం చేస్తూ కొత్తగా తెచ్చిన విబి జి ఆర్ఎంఎం జి పథకాన్ని రద్దు చేసి, దాని స్థానంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలంటూ శనివారం చలో లోక్ భవన్‌కు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు భారీగా సభా స్థలి వద్ద మోహరించారు. వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమంలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. పేదల వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్రానికి రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ వంత పాడుతున్నాయన్నారు. పేదలకు అన్యాయం చేస్తూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంట్‌లో తీర్మానించిన విబి జి ఆర్ఎంఎం జి తీర్మానానికి రాష్ట్ర ఎంపిలు ఆమోదం తెలిపారన్నారు. రైతు సంఘాల ప్రధాన కార్యదర్శులు కె ప్రభాకర్‌రెడ్డి, కెవివి ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వి వెంకటేశ్వర్లు, ఆవుల శేఖర్, సీనియర్ నేత వై కేశవరావు మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టం వల్ల రాష్ట్రంలో 25 లక్షల మంది పేదలు, సన్న, చిన్నకారు రైతుల భూములు అభివృద్ధి అయ్యాయన్నారు. వందలాది గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు, రోడ్ల అభివృద్ధి చెందడంతో పాటు గడిచిన 20 ఏళ్లలో రాష్ట్రానికి సుమారు రూ.80 వేలకోట్లు నిధులు వచ్చాయన్నారు. 2025లో కొత్తగా తెచ్చిన చట్టం వల్ల పని కల్పించాలనే గ్యారెంటీగా ఉండే హక్కును తొలగించారని, ఏడాదిలో 100 రోజులు మనం కోరినప్పుడు పనులు

మిగతా 7లో

అమరావతి వాగ్దానాలు నెరవేర్చాలి

- వైసిపి నాయకులు వేమారెడ్డి, శివశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అమరావతి రైతులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని వైసిపి నాయకులు దొంతిరెడ్డి వేమారెడ్డి, పుత్తా శివశంకర్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. బూటకపు గ్రామసభలు నిర్వహించి రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. భూములిచ్చిన పరిస్థితుల్లో రైతులకు న్యాయం జరగలేదని, తీవ్ర ఆవేదనతో రాజధాని రైతులు ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రైతులకు వాస్తవాలు చెప్పాలని కోరారు. భూములతోపాటు ప్రాణత్యాగం చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. మందడంలో మరణించిన రైతు రామారావుకు వాగులో ప్లాట్లు కేటాయించారని అన్నారు. దీనిపై ఆయన ఆవేదన కూడా వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఏడాదిన్నరకాలంలో రూ.2.81 లక్షల కోట్ల అప్పులు చేశారని, అయినా ప్రజలిచ్చిన హామీలు నెరవేర్చలేదని, వాగ్దానాలు అమలు చేయలేదని తెలిపారు. తక్షణమే రాజధాని రైతులకు న్యాయం చేయాలని కోరారు. పొలాలు తీసుకున్న ప్రభుత్వం.. ఇప్పుడు గ్రామాలు కూడా తీసుకుంటోందని, వాటిల్లోనే రామారావు నివాసం కూడా పోతోందని తెలిపారు. ఒకవేళ తీసుకోవాల్సి వస్తే అందరికీ ఒకేచోట ప్లాట్లు అభివృద్ధి చేసి ఇవ్వాలని కోరారని, సాధ్యం కాదని ప్రభుత్వం చెప్పడంతోనే రామారావు మరణించారని వివరించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

సినిమా టికెట్ ధరలు పెంచొద్దు

- ముఖ్యమంత్రికి సిపిఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అగ్ర హీరోల సినిమాలకు బెనిఫిట్ షోలు, టికెట్ల ధరల పెంపుదలకు స్వస్తి పలుకుతూ ప్రకటన చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య శనివారం లేఖ రాశారు. రాష్ట్రంలోని మల్టీప్లెక్స్ సినీమాల్స్‌లో అధిక ధరల దోపిడీని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అగ్రహీరోల సినిమాల విడుదల సందర్భంగా టికెట్ల ధరలను ఇబ్బడిముబ్బడిగా పెంచుతూ ప్రత్యేక సందర్శనలకు అనుమతినిస్తూ జిఓలు ఇవ్వటం పరిపాటిగా మారిందని అన్నారు. పెద్ద హీరోల సినిమాల కలెక్షన్ల కోసం టికెట్ ధరల పెంపు, ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతి కోరుతూ ప్రభుత్వంపై నిర్మాణ సంస్థలు ఒత్తిడి తెస్తున్నాయని వివరించారు. సినీ రంగానికి తలొగ్గి ప్రభుత్వం అనుమతినిస్తోందన్నారు. ఇది సామాన్య ప్రేక్షకులకు వినోదాన్ని దూరం చేయడమేనని, ఈ విధానాలను తీవ్రంగా తప్పుబడుతున్నామని పేర్కొన్నారు. సంక్రాంతి నేపథ్యంలో పలు సినిమాల ప్రత్యేక ప్రదర్శనలకు, 10 రోజుల పాటు టికెట్ ధరల పెంపుదలకు అనుమతించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవ్వడం ప్రేక్షకుల, ప్రజల జేబులను కొల్లగొట్టడమేనని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం తరహాలో రాష్ట్రంలోనూ ధరలు పెంచబోమని, ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతినివ్వబోమనే ప్రకటన చేయాలని, మల్టీప్లెక్స్‌లో పార్కింగ్ దోపిడీని అరికట్టాలని, తినుబండారాలను సగటు ప్రేక్షకులకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు.

శాస్త్రీయ భావాలు పెంపొందిస్తేనే శాస్త్ర సాంకేతికాభివృద్ధి

- ముఖ్యమంత్రికి సిపిఎం విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రతిరోజూ శాస్త్ర సాంకేతికాభివృద్ధి గురించి మాట్లాడే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం తిరుపతిలో జరిగిన సభలో అశాస్త్రీయ భావాలను వెదజల్లడం విస్మయం కలిగిస్తోందని, దేశాభివృద్ధికి ఆటంకంగా ఉండే ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని ముఖ్యమంత్రి వల్లెవేయడం సరికాదని సిపిఎం రాష్ట్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పురాణాలను చరిత్రగా వక్రీకరించే ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భుజాన వేసుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. లౌకిక పార్టీగా ప్రజలు భావించే తెలుగుదేశం పార్టీ ఇలా వ్యవహరించడం రాష్ట్రానికి ఎనలేని నష్టాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచాలని భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 51ఎ (హెచ్) స్పష్టంగా పేర్కొనగా, ముఖ్యమంత్రి బాధ్యతలో వున్న వ్యక్తి అందుకు భిన్నంగా మాట్లాడటం అభ్యంతరకరమని తెలిపారు.

ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుబంధమైన విజ్ఞాన భారతి కార్యకలాపాలను రాష్ట్ర ప్రభుత్వం స్పాన్సర్ చేయడం సరికాదని పేర్కొన్నారు. మహంజోదరో - హరప్పా సంస్కృతి భారతీయ చరిత్రకు సంబంధించినవి తప్ప పురాణం కాదని తెలిపారు. ఆర్యభట్ట, భాస్కరుడు వంటి వారు శాస్త్ర సాంకేతిక విజ్ఞానము, గణితానికి సంబంధించిన శాస్త్రాలు తప్ప పురాణ పురుషులు కాదని వివరించారు. వారు కనుగొన్న ఖగోళ, గణిత శాస్త్ర విజ్ఞానం ప్రపంచ ప్రజలందరికీ సంబంధించినదేనని, న్యూటన్, డార్విన్, ఆర్కిమెడిస్ వంటి వారు విదేశీయులైనా వారు ప్రతిపాదించి, రుజువు చేసిన భౌతికశాస్త్ర, జీవశాస్త్ర, గణిత సిద్ధాంతాలు విశ్వజనీనమైనవని పేర్కొన్నారు. ఇదే సభలో పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్.. ఫిన్లాండ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పడం విడ్డూరం కాదా? అని ప్రశ్నించారు. ప్రపంచ చరిత్రలో శాస్త్ర విజ్ఞాన పురోగమనానికి మతతత్వ భావాలు ఆటంకంగా ఉంటూ వచ్చాయని, తొలి పారిశ్రామిక విప్లవానికి ముందు పశ్చిమ దేశాల్లో సైంటిస్టులను హత్యచేసిన మతవ మతోన్మాదులనే ముఖ్యమంత్రి గుర్తించాలని పేర్కొన్నారు. సైన్సు వాస్తవాలు, రుజువుల మీద, విశ్వాసాలపై ఆధారపడేది మతమని పేర్కొన్నారు. ఈ రెండింటినీ కలగాపులగం చేయడం ప్రజలను తప్పుదారి పట్టించడమే అవుతుందని వివరించారు. భారత రాజ్యాంగం పేర్కొన్న రీతిన శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపట్టాలని, లౌకికతత్వాన్ని సమాజంలో పాదుకొల్పడానికి కూడా సర్కారు కృషి చేయాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్‌టి రామారావు.. అద్వాని రథయాత్ర చేపడితే లౌకికతత్వానికి నష్టమని ఆనాటి బిజెపి నాయకులను హెచ్చరించిన విషయం అందరికీ తెలుసునని గుర్తు చేశారు. అయినా లౌకికపార్టీగా ముద్ర కలిగిన తెలుగుదేశం పార్టీ.. ఆర్‌ఎస్‌ఎస్ వాదనలను బలపర్చే వైఖరి తీసుకోవడం కేవలం రాష్ట్రానికేగాక ఆ పార్టీకి కూడా నష్టకరమని పేర్కొన్నారు. ఎంతమంది పిల్లలను కనాలన్నది ఆయా కుటుంబాలు, అందులో భార్యాభర్తలకు సంబంధించిన అంశం కాగా, దాన్ని పాలకులో, బహిరంగ వేదికల ద్వారానో ఒత్తిడి చేయడం సరికాదని, వారి వ్యక్తిగత జీవితం, హక్కులలోకి చొరబడడమే అవుతుందని తెలిపారు. స్పైడర్ మ్యాన్, బ్యాట్‌మ్యాన్ వంటి వాటిని మనదేశం, రాష్ట్రంలోకి దిగుమతి చేసిన ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడేనన్నది లోకవిదితమేనని పేర్కొన్నారు. అలాంటి ఊహాజనితమైన ఫిక్షన్ హీరోలను ప్రమోట్ చేయడం ఎంతటి పొరపాటో పురాణ పాత్రలను వాస్తవంలా భ్రమింపజేయడమూ అలాంటిదేనని వివరించారు. ఒకవైపు పెద్దయెత్తున విదేశీ పెట్టుబడులు, విదేశీ విద్యా విధానాన్ని గొప్పగా చేసుకుంటూ, మరోవైపు విదేశీ సంస్కృతికి వ్యతిరేకంగా మాట్లాడడం వారి ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం, ముఖ్యమంత్రి పునరాలోచించుకొని ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతంతో చెట్టాపట్టాలు మాని సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని, లౌకికతత్వాన్ని పెంపొందించే చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతలో శాస్త్రీయ భావాల వ్యాప్తికి తోడ్పడాలన్నారు.

అర్ధరాత్రి వరకు మద్యం షాపులు తెరిచి ఉంచొద్దు

- నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నూతన సంవత్సరం సందర్భంగా కూటమి ప్రభుత్వం మద్యం షాపులను అర్ధరాత్రి వరకూ తెరిచి ఉంచొద్దని ఐద్వా రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. నూతన సంవత్సరం పేరుతో అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె శ్రీదేవి, వి సావిత్రి పేర్కొన్నారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా ఈ నెల 30 నుంచి జనవరి 1వ తేదీ తెల్లవారు జాము వరకు మద్యం అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నట్లు గత అనుభవాలు తెలుపుతున్నాయని వివరించారు. యువత మద్యం అధికంగా సేవించి రోడ్లపై అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నారని వెల్లడించారు. రోడ్ల ప్రమాదాలకు గురై కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని, దీంతో వారి కుటుంబాల్లో విషాద ఛాయలు కమ్ముకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే తాట తీస్తామని ప్రభుత్వం చెబుతూ గ్రామాల్లో మాత్రం బెల్ట్‌షాపుల పేరుతో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుపుతోందని పేర్కొన్నారు. మద్యాన్ని ఆదాయ వనరుగా చూస్తున్న ప్రభుత్వ విధానాన్ని నిలదీస్తేనే కొత్త సంవత్సరం మహిళల జీవితాల్లో వెలుగులు ఉంటాయని చెప్పారు. కోడి పందేల పేరుతో సంక్రాంతిని కూడా క్రాంతి లేకుండా చేసే ప్రయత్నాలను ప్రశ్నించాలని కోరారు. మద్య నియంత్రణ కోసం ప్రయత్నం చేస్తూ కొత్త ఏడాదికి ఆహ్వానం పలకాలని కోరారు. ఈ నెల 30, 31 జనవరి 1వ తేదీల్లో అర్ధరాత్రి వరకు మద్యం షాపులకు అనుమతినివ్వొద్దని, రాత్రి ఏడు గంటలకే మూసివేయాలని డిమాండ్ చేశారు.

జనాభా లెక్కల తరువాతే గ్రేటర్

- విజయవాడ, తిరుపతిపై మంత్రి నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ, తిరుపతి నగరాలను గ్రేటర్ చేయాలని నిర్ణయించామని, అయితే జనాభా లెక్కలు పూర్తయ్యే వరకూ అది సాధ్యం కాదని మంత్రి నారాయణ తెలిపారు. గ్రేటర్ విజయవాడ, తిరుపతి ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యాన శనివారం చర్చ జరిగింది. అనంతరం నిర్ణయాలను మంత్రి నారాయణ మీడియాకు వెల్లడించారు. గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతి చేయడానికి ఇబ్బందులున్నాయని, కేంద్ర ప్రభుత్వ జనాభా లెక్కలు పూర్తయ్యే వరకూ డీలిమిటేషన్స్ చేయొద్దని నిబంధన పెట్టిందని తెలిపారు. సర్వే పూర్తయిన తరువాత డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని చెప్పారు. రాజధాని పరిధిలో భూసేకరణ భూముల్లో ప్లాట్లు వచ్చిన రైతులు 250 మందికి ఫోన్లు చేయించామని, వారిలో 42 మంది మార్చుకునేందుకు సిద్ధపడ్డారని వివరించారు. మిగిలిన వారిలో ఎనిమిది మంది మాత్రమే తీసుకుంటామని చెప్పారని వివరించారు. మిగిలిన వారు వేచి చూస్తామని అన్నారని తెలిపారు. భూసేకరణ భూముల్లో ప్లాట్లు ఉన్నవారు మార్చుకోవాలనుకుంటే ప్రభుత్వాన్ని సంప్రదిస్తే మారుస్తామని అన్నారు. కొంతమంది భూములు జరీబుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారని, దీనిపై కలెక్టరు ఆధ్వర్యాన జిల్లా కమిటీ వేశామని తెలిపారు. ఈ కమిటీ పరిశీలించి చాలా వరకూ తిరస్కరించిందని అన్నారు. రైతులు మరోసారి పరిశీలించాలని కోరారని, దీనిపై స్టేట్‌లెవల్లో కమిటీ వేశామని చెప్పారు. నిర్ధారణ ప్రక్రియను 45 రోజుల్లో పూర్తి చేయాలని సూచించామన్నారు. 2014 డిసెంబరు 8న శాటిలైట్ ఫొటోల ఆధారంగా గుర్తించాలని ఆదేశాలు జారీ చేశామని వివరించారు. రాజధానిలో ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. రైతులకు బ్యాంకులు లోన్లు ఇవ్వాలంటే 30 ఏళ్లనాటి లింకు డాక్యుమెంట్లు అడుగుతున్నారని, అవేమీ లేకుండా లోన్లు ఇచ్చేందుకు బ్యాంకులతో మాట్లాడామని వివరించారు. గన్నవరం భూములపై మూడు ప్రతిపాదనలొచ్చాయని, వాటి గురించి భూయజమానులతో మాట్లాడాలని ఆదేశించామని పేర్కొన్నారు. గ్రామాల్లో కల్పించే మౌలిక సదుపాయాలపై డిజైన్లు పూర్తి చేశామని, వాటిని శాసనసభ్యులకు అందజేయాలని సూచించామని అన్నారు.

అప్పలరాజుపై పీడీ యాక్టును తక్షణమే రద్దు చేయాలి

- అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు వినతి



అనకాపల్లి కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాసరావు, లోకనాథం, అప్పలరాజు భార్య లక్ష్మి, తల్లి లచ్చమ్మ

ప్రజాశక్తి- నర్సీపట్నం రూరల్ (అనకాపల్లి జిల్లా)

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజుపై ప్రభుత్వం పెట్టిన పీడీ యాక్టును తక్షణమే రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నర్సీపట్నంలో శనివారం అప్పలరాజు భార్య ఎం.లక్ష్మి, తల్లి లచ్చమ్మతోపాటు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావుతో కలిసి అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వి.శ్రీనివాసరావు విలేకర్లతో మాట్లాడుతూ ప్రజా ఉద్యమకారులపై పీడీ యాక్టు పెట్టడం ద్వారా పాలకులు ప్రజా ఉద్యమాలను అణచివేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నక్కపల్లి మండలంలో ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు, మత్స్యకారులు చేస్తోన్న ఉద్యమానికి అండగా నిలిచిన అప్పలరాజుపై పీడీ యాక్టు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. గూండాలు, రౌడీలపై మోపాల్సిన పీడీ యాక్టును ప్రజా ఉద్యమకారులపై మోపడం దుర్మార్గమన్నారు. ప్రజా ఉద్యమాలకు ప్రభుత్వాలు భయపడే ఇటువంటి నిరంకుశ చర్యలకు పూనుకుంటుందని పేర్కొన్నారు. బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో స్థానికులు చేసిన ఉద్యమం తీవ్రతరమైన నేపథ్యంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చి ఇక్కడ బల్క్‌డ్రగ్ పార్కును పెట్టబోమని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ, బల్క్ డ్రగ్ పార్కుపై నోటిఫికేషన్ విత్‌డ్రా చేసుకోలేదని గుర్తు చేశారు. అప్పలరాజు వంటి వారిని అరెస్టు చేస్తే ఉద్యమాలు ఆగవని, ప్రజల కోసం పది మంది అప్పలరాజు వస్తారని స్పష్టం చేశారు. అప్పలరాజును తక్షణమే విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజలకే కాదు... పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు కూడా నమ్మకం లేదు

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసి వైద్య వ్యవస్థను నాశనం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వి.శ్రీనివాసరావు వివరించారు. విశాఖలో సమ్మెట్ల పేరుతో కోట్లాది రూపాయలు సముద్రపాలు చేశారని, వాటివల్ల ఒక్కరికైనా ఉపాధి వచ్చిందా? అన్ని ప్రశ్నించారు. ఆ డబ్బులతో పాడేరు, మాకవరపాలెం వైద్య కళాశాలలను పూర్తి చేయొచ్చని తెలిపారు. పిపిపి కింద వైద్య కళాశాలల నిర్మాణానికి టెండర్లు పిలిస్తే ఎవరూ బిడ్ వేయలేదని, కిమ్స్ వారు వేసినట్లు చెప్పినా, తాము వేయలేదని, డాక్టర్ వేశారని కిమ్స్ యాజమాన్యం చెబుతోందని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజలకే కాదు... పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు కూడా నమ్మకం లేదన్నారు. విద్య, వైద్యం ప్రభుత్వ కనీస బాధ్యతగా ఉండాలని, వీటిని ప్రైవేటుపరం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనకాపల్లి జిల్లాలో భూములన్నీ కార్పొరేట్లకు అప్పగిస్తున్నారని, కానీ, వారు అక్కడ పరిశ్రమలు పెట్టడం లేదని, తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. విబి-జిఆర్ఎంఎంపై ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు శ్రీనివాసరావు స్పందిస్తూ, దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వం ముందుగా మొత్తం డబ్బులు ఖర్చు చేసి, తరువాత కేంద్ర వాటా కోసం బిల్లు పెడితే మంజూరు చేస్తుందని వివరించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం విబి-జిఆర్ఎంఎని తీసుకొచ్చిందన్నారు. హరే రామ్ అంటూ గాంధీజీ నిత్యం జపించేవారని, అటువంటి గాంధీని ఆర్ఎస్ఎస్ నేత గాడ్సే హత్య చేస్తే, ఇప్పుడు ఎంజిఎన్ఆర్ఇజిఎకు గాంధీజీ పేరును తొలగించి బిజెపి, మోడీ ప్రభుత్వం రెండోసారి గాంధీని హత్య చేసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, నాయకులు ఈరెల్లి చిరంజీవి, సాపిరెడ్డి నారాయణమూర్తి, ఎల్.గౌరి, కెవి.సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

ఇనుమూరు గిరిజనులపై అక్రమ కేసులు దుర్మార్గం

- ఆదివాసీ గిరిజన, వ్యవసాయ కార్మిక, రైతుసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు
- 29న ఆర్‌డిఒ, 30న కలెక్టరేట్ ఎదుట ధర్నా



రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం ఇనుమూరు గ్రామ గిరిజనులపై దాడులు, నిర్బంధం, అక్రమ కేసులు ఆపాలని, గిరిజన భూ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. ఇనుమూరు గిరిజనులకు అండగా ఈ నెల 29న జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం ముందు, 30న ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సమావేశం నిర్ణయించింది. ఇనుమూరు గిరిజనులకు న్యాయం చేయాలని కోరుతూ ఆదివాసీ గిరిజన, వ్యవసాయ కార్మిక, రైతుసంఘాల ఆధ్వర్యంలో ఏలూరులోని అన్నే భవనంలో ఏపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, సిపిఐ జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు, ఎంసిపిఐ (యు) జిల్లా కార్యదర్శి శావనంపూడి నాగరాజు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా నాయకులు కట్టా సత్యనారాయణ, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు కారం భాస్కర్, ఇనుమూరు గిరిజన భూ బాధితులు పొట్టా రామదుర్గ, తెల్లం బాలాజీ, సిపిఎం నగర కార్యదర్శి పంపన రవికుమార్ మాట్లాడారు. ఇనుమూరులో 57 గిరిజన కుటుంబాలు ఉన్నాయని, వారి జీవనాధారం వ్యవసాయమేనని చెప్పారు. ఏజెన్సీ భూ సమస్యల్లో పోలీసులు జోక్యం చేసుకోకూడదని జిఒ నం.1049/28-7-2007 ఉందని, అందుకు విరుద్ధంగా పోలీసులు జోక్యం చేసుకుని గిరిజనులు, పేదలపై నిర్బంధాన్ని ప్రయోగించి దాడులు చేయడం తగదన్నారు. గిరిజనులపై దాడులు, నిర్బంధాలు, అక్రమ పోలీసు కేసులు ఆపివేయాలని, తప్పుడు ప్రొటెక్షన్ ఆర్డర్లను నిలిపివేయాలని, తక్షణమే ఏజెన్సీ భూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గిరిజనులపై దాడికి పాల్పడ్డ వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కోరారు. ఇనుమూరు గిరిజనులకు న్యాయం చేయకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో కాంగ్రెస్, వామపక్షాలు, ఆదివాసీ గిరిజన, వ్యవసాయ కార్మిక, రైతుసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమతో ప్రజలకు ముప్పు

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మూలం రమేష్


ప్రజాశక్తి - నెల్లూరు

ఇథనాలు పరిశ్రమతో ప్రజల జీవనానికి ముప్పు వాటిల్లుతుందని, ప్రజా ప్రయోజనం...పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించాల్సిన అవసరముందని పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. 'ప్రజారోగ్య పరిరక్షణకు ఇథనాల్ ఫ్యాక్టరీలను వ్యతిరేకించండి.. కాలుష్య భూతం నుంచి ప్రజలను కాపాడండి' అన్న అంశంపై సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్ న్యూ డెమోక్రసీ), సిపిఐ (ఎంఎల్), ఎస్‌యుసిఐ, కాంగ్రెస్, బిఎస్‌పి పార్టీలు, ప్రజాసంఘాలు ఐక్యంగా నెల్లూరు నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించాయి. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి అధ్యక్షత వహించారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ.. ప్రజారోగ్యాన్ని పరిరక్షించాల్సిన కూటమి ప్రభుత్వం నెల్లూరు జిల్లా రాచర్లపాడు ప్రాంతంలో మూడు ఇథనాల్ పరిశ్రమలు స్థాపించేందుకు నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ఈ పరిశ్రమల చుట్టు పక్కల ఉన్న ప్రజలు కేన్సర్, శ్వాసకోశ, చర్మ వ్యాధులు, చిన్నపిల్లలకు, గర్భిణులకు ప్రమాదకరమైన వ్యాధులు వచ్చే ప్రమాదముందన్నారు. పర్యావరణ పరిరక్షణ వేదిక పేరుతో గ్రామాల్లో పర్యటిస్తూ రాబోవు ప్రమాదాన్ని వివరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తామని తెలిపారు. ఈ నెల 30న చేపట్టబోయే ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్ని ఇథనాల్ పరిశ్రమపై తమ వ్యతిరేకతను తెలియజేయాలని ప్రజలను కోరారు. సిపిఐ నగర కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి మాట్లాడుతూ... పరిశ్రమల స్థాపనకు కమ్యూనిస్టు పార్టీలు ఎప్పుడూ వ్యతిరేకం కాదని, వాటిపేరుతో కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసి ప్రజలకు నష్టం చేస్తే సహించేది లేదన్నారు. పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక కన్వీనర్ జాషువ మాట్లాడుతూ.. కిసాన్ సెజ్‌లో ఇథనాల్ పరిశ్రమ స్థాపనకు అనుమతి లేదన్నారు. సిపిఐ (న్యూ డెమోక్రసీ) నాయకులు రాంబాబు మాట్లాడుతూ.. ఇథనాల్ పరిశ్రమ వల్ల నీరు కలుషితమవుతోందని, వ్యవసాయానికి వినియోగించే నీటిని ఈ పరిశ్రమలకు ఉపయోగించడం వల్ల నీటి సమస్య ఉత్పన్నమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఐ (ఎంఎల్ న్యూ డెమోక్రసీ) నాయకులు లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ.. ఇథనాల్ పరిశ్రమ స్థాపన వల్ల నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభించకపోగా ప్రజల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌యుసిఐ నాయకులు బసవరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజయ్, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహన్‌రావు, సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య, మహిళా నాయకులు శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

అప్పలరాజుపై పీడీ యాక్టు ఉపసంహరించి విడుదల చేయాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు లేఖ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం అప్పలరాజుపై పీడీ యాక్టును ప్రయోగించి జైలుకు పంపడం విస్మయం కలిగిస్తోందని, ఆయనపై చట్టాన్ని ఉపసంహరించి వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి శనివారం లేఖ రాశారు. రైతుల కోసం, నిరంతరం సామాన్య ప్రజల జీవితాల మెరుగు కోసం పనిచేస్తున్న నాయకుడిని ఒక నేరస్తుడిగా చిత్రీకరించి అరెస్టు చేయడం ఎవరి ప్రయోజనం కోసం ప్రభుత్వం పూనుకున్నదో ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. రైతుల హక్కుల కోసం పనిచేయడం నేరంగా ప్రభుత్వం పరిగణిస్తున్నదా? అని ప్రశ్నించారు. అనేక అక్రమాలకు, దుర్మార్గాలకు పాల్పడుతున్న నేరస్తులు అందరి కళ్లముందూ దర్జాగా తిరుగుతుంటే పట్టించుకోని ప్రభుత్వం, అప్పలరాజును వేకువజామునే భారీగా పోలీసులను మోహరించి తీసుకెళ్లడం ప్రజాస్వామ్యమేనా? అని ప్రభుత్వం ఆలోచించాలన్నారు. వెంటనే జోక్యం చేసుకుని అప్పలరాజుపై మోపిన అభియోగాలను ఉపసంహరించుకొని, ఆయనను విడుదల చేసేందుకు ఆదేశించాలని ముఖ్యమంత్రిని రాఘవులు కోరారు.



వందేభారత్ రైలును ప్రారంభిస్తున్న కేంద్ర రైల్వే సహాయ శాఖ మంత్రి సోమన్న

రాష్ట్రంలో 73 రైల్వే స్టేషన్ల సుందరీకరణ

- వందే భారత్ రైలు ప్రారంభంలో మంత్రి సోమన్న

ప్రజాశక్తి - హిందూపురం

అమృత్ పథకంలో భాగంగా రాష్ట్రంలో 73 రైల్వేస్టేషన్ల సుందరీకరణ చేసినట్లు కేంద్ర రైల్వే సహాయ శాఖ మంత్రి సోమన్న తెలిపారు. యశ్వంతపురం - కాచిగూడ మధ్య తిరిగే వందే భారత్ రైలును శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో స్టాపింగ్ ఇస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. శనివారం హిందూపురం రైల్వేస్టేషన్‌లో స్థానిక ఎంపి పార్థసారథితో కలిసి మంత్రి జెండా ఊపి రైలును ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో యుపిఎ ప్రభుత్వం ఉన్న సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రూ.886 కోట్లు రైల్వే నిధులు మంజూరు చేశారన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.9470 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,560 కిలోమీటర్ల నూతన రైల్వే మార్గాల నిర్మాణం, 717 ఆర్‌ఒబిలు, ఆర్‌యుబిల నిర్మాణం పూర్తి అయినట్లు తెలిపారు. తిరుపతి, నెల్లూరు, విశాఖపట్నం, రాజమండ్రి వంటి ప్రధాన స్టేషన్లతో పాటు హిందూపురం, పుట్టపర్తి రైల్వేస్టేషన్లకు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, హిందూపురం రైల్వే స్టేషన్ సుందరీకరణ కోసం ఇప్పటికే రూ.23 కోట్లు మంజూరు చేశామని, 2026 జూన్ నాటికి సుందరీకరణ పనులు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని చెప్పారు.

ఐదుగురు ఐఎఎస్‌లకు ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 2010 బ్యాచ్‌కు చెందిన ఐదుగురు ఐఎఎస్ అధికారులకు సూపర్ టైమ్ స్కేల్ (పే మ్యాట్రిక్స్ లెవెల్-14) కేడర్‌కు సమానంగా 2026 జనవరి ఒకటి నుంచి అమల్లోకి వచ్చేలా ప్రభుత్వం శనివారం ప్రభుత్వ కార్యదర్శులుగా ఉద్యోగోన్నతులు కల్పించింది. ఈ మేరకు సిఎస్ విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగోన్నతులు పొందిన వారిలో చదలవాడ నాగరాణి, నారాయణ భరత్‌గుప్తా, ఆమ్రపాలి కట్టా, జె నివాస్, గంధం చంద్రుడు ఉన్నారు. ఉద్యోగోన్నతులు అనంతరం భరత్ గుప్తాను అదే పదవిలో కొనసాగిస్తూ కళాశాల విద్యా కమిషనరు, ఆర్‌యుఎస్‌ఎ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా కొనసాగిస్తున్నారు. ఆమ్రపాలి ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ ఛైర్మన్, ఎండిగా కొనసాగనున్నారు. గంధం చంద్రుడిని కార్మికశాఖ కమిషనరుగా నియమించారు. పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎంవి శేషగిరిబాబును రిలీవ్ చేశారు. చదలవాడ నాగరాణి పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరుగా అదే పదవిలో కొనసాగనున్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రామకృష్ణ, వేదికపై నాయకులు


దేశ రక్షణకు కమ్యూనిస్టుల ఐక్యత అనివార్యం

- సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

దేశ రక్షణకు కమ్యూనిస్టుల ఐక్యత అనివార్యమని, భారత రాజ్యాంగాన్ని మనుస్మృతిగా మార్చాలని చూస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తుల పతనానికి కమ్యూనిస్టుల ఐక్యతే పునాది కావాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. సిపిఐ శతజయంతి ఉత్సవాల సందర్భంగా 'కమ్యూనిస్టుల ఐక్యత - నేటి ఆవశ్యకత' అనే అంశంపై శనివారం నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలోని వివేకానంద ఆడిటోరియంలో సదస్సు నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ... మోడీ అధికారంలోకి వచ్చాక రూపాయి విలువ పాతాళానికి పడిపోయిందని, నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని వివరించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చేలా నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం దుర్మార్గమన్నారు. 2004లో కమ్యూనిస్టుల అండతోనే ఉపాధి హామీ, సమాచార హక్కు వంటి చట్టాలు రూపుదిద్దుకున్నాయని వివరించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కె. రామాంజనేయులు, పి.రామచంద్రయ్య మాట్లాడుతూ.. బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టులను చంపడం హేయమైన చర్య అని ఖండించారు. రాజధాని పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ భూసేకరణ చేస్తోందని, ఆ భూములను తమ సన్నిహితులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. టిడిపి, వైసిపిలకు ప్రత్యామ్నాయంగా మూడవ శక్తిగా కమ్యూనిస్టులు ఎదగాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సదస్సుకు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్, ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు మురళి తదితరులు పాల్గొన్నారు.

అరచేతిలో 2026 క్యాలెండర్



హాయ్ పిల్లలూ,

ప్రతి ఒక్కరికి సులభంగా అర్థమయ్యే రీతిలో అరచేతిలో 2026వ సంవత్సరపు క్యాలెండర్‌ని పోస్టుకార్డు పైన రెండు విధాలుగా ఇలా తయారు చేసుకోవచ్చు.

మొదటి విధానం

ఒక పోస్టుకార్డు పైన నిలువగా ఒక వృత్తం బొమ్మ గీసి, అందులో మరో రెండు చిన్న వృత్తాలు ఒక దానిలో మరొకటి గీయాలి. బయట వృత్తాన్ని 12 భాగాలు చేసి ఒక్కొక్క భాగంలో నెలలు పేర్లు జనవరి నుండి డిసెంబర్ వరకు రాయాలి. వాటికి ఎదురుగా లోపల వృత్తంలో నెలల కోడ్స్ రాయాలి. మధ్యలో ఉన్న చిన్న వృత్తంలో 2026వ సంవత్సరం రాయాలి. దానికింద ఉన్న దీర్ఘ చతురస్ర ఆకారపు పటంలో పైన వారాల పేర్లు ఆదివారం నుండి శనివారం వరకు, వాటికి ఎదురుగా కోడ్స్ 0 నుండి 6 వరకు వరుసగా రాయాలి.

వారం పేరు ఇలా తెలుసుకోవాలి

ఉదాహరణకు : 26.01.2026 ఏ వారం?

వివరణ : వృత్తం పటంలో జనవరి నెల కోడ్ 4ను తేది 26కు కలుపగా 26+4 : 30 వస్తుంది. ఈ 30ను 7 చే భాగించగా శేషం 2 వస్తుంది (భాగఫలంతో పని లేదు). ఈ శేషం 2ను వారం పట్టికలో చూడగా 2కు ఎదురుగా సోమవారం అని ఉంది. అంటే 26.01.2026వ తేదీ సోమవారం అవుతుంది. శేషం మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని గుర్తుంచుకోండి.

గమనిక : నెలల కోడ్, తేదికి కలపగా వచ్చిన మొత్తం 7 కంటే తక్కువగా వస్తే, భాగించకుండా డైరెక్టుగా వారం పట్టికలో చూస్తే సరిపోతుంది.

రెండవ విధానం

పోస్టుకార్డును అడ్డంగా తీసికొని దాని పైన 12 అడ్డ గడులు, 7 నిలువ గడులలో రూపొందించిన ఈ క్యాలెండర్‌లో మొదటి 7 గడులలో 12 నెలల పేర్లు, వాటి కింద వారాల పేర్లు వరుసగా రాయాలి. వాటి ఎదురుగా ఉన్న మిగతా గడులలో 1 నుండి 31 వరకు తేదీలను రాయాలి.

వారం పేరు ఇలా తెలుసుకోవాలి

ఉదాహరణకు : 26.01.2026 ఏ వారం?

వివరణ : జనవరి నెలలో దిగువగా 26వ తేదీకి అడ్డంగా ఎడమ వైపు చూస్తే సోమ అని ఉంది (అడ్డంగా, నిలువగా రెండు ఖండించిన దగ్గర). అంటే 26.01.2026 సోమవారం అవుతుంది.

– మడ్డు తిరుపతిరావు, ఎమ్ఎస్‌సి, ఎంఇడి, గణిత అవధాని, టీచరు, బూరగాం కంచి, శ్రీకాకుళం, 94913 26473.

నేను గీసిన బొమ్మ





నారగాని హేమశ్రీ,
8వ తరగతి,
పెదపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
మొవ్వ మండలం, కృష్ణా జిల్లా.


పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడి: chinnaarips@gmail.com

ప్రణాళికతో చదివితే మేలైన ఫలితాలు!

బాగా చదవాలంటే చేతిలో పుస్తకం మాత్రమే ఉంటే సరిపోదు. చదవాలనే ఆసక్తి, కోరిక, కొత్త విషయాలు నేర్చుకోవాలనే తపన అవసరం. అలాగే పరీక్షలో పాసవ్వడమే ధ్యేయంగా చదవొద్దు. ఇష్టంగా, బాధ్యతతో చదవాలి. అప్పుడు అనుకున్న పరీక్షా ఫలితాలు వస్తాయి. అనుకున్న కొలువును సాధించొచ్చు. పరీక్షల్లో అందరికీ మార్కులు ఒకేలా రావు. కొందరికి ఎక్కువ. మరికొందరికి తక్కువగా వస్తుంటాయి. ఇంకొదరు ఆశించిన మార్కులను సొంతం చేసుకుంటారు.

పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి సరైన వ్యూహాలు, పద్ధతులు పాటించడం ముఖ్యం. చేతిరాత అందంగా ఉండటం, సమాధానాలు స్పష్టంగా రాయడం, ప్రాక్టీస్ పాత ప్రశ్నలు రాయడం వంటి చిట్కాలు ఉపయోగపడతాయి. వచ్చే ఏడాది ప్రారంభం నుంచి వివిధ పరీక్షలు రాబోతున్నాయి. పదో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇతర పోటీపరీక్షలు, ఇంజనీరింగ్, మెడిసిన్ ఇలా అనేక రకాల పరీక్షలు జరుగుతాయి. పరీక్షలు రాయడం అనేది ప్రతి విద్యార్థికి ఒక గొప్ప సవాలు. కొంతమంది విద్యార్థులు సమర్థవంతంగా అద్భుతమైన మార్కులను సాధించగలుగుతారు. మరికొంత మంది మాత్రం మంచి మార్కులు అందుకోలేరు. సరైన వ్యూహాలు, పద్ధతులు పాటించడం ద్వారా, ప్రతి విద్యార్థి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించొచ్చు.





ఇష్టంగా చదవాలి : బలవంతంగా చదివితే ఏదీ అర్థం కాదనేది గుర్తించుకోవాలి. చదవడాన్ని విసుగు తెప్పించే వ్యాపకండా భావించొద్దు. కొత్త విషయాలను నేర్చుకోవటానికి దక్కిన అవకాశంగా భావించారు. చదవడం కోసం ఎంత సమయాన్ని కేటాయించగలిగితే అంత మంచిది. అప్పుడు సమయం వృథా కాదు. ఏకాగ్రతను దెబ్బతీసే వాటికి దూరంగా ఉండాలి. విద్యార్థిగా ప్రతి ఒక్కరి లక్ష్యంగా ఎప్పుడూ కొత్త విషయాలు నేర్చుకోవడమే కావాలి. అదే లక్ష్యంతో ముందుకెళ్తే మనపై మనకు నమ్మకం పెరుగుతుంది.

చేతిరాతను సరిచూసుకోవాలి : ప్రిపేరయ్యే ఏ పరీక్షలోనైనా సమాధానాలు రాయడానికి కష్టపడి చదివినంత మాత్రానే మంచి మార్కులు రావు. పరీక్షలు రాసేటప్పుడు, చేతిరాత చాలా ముఖ్యమైంది. ఎందుకంటే, సమాధాన పత్రాన్ని దిద్దే అధికారులు చేతిరాతను స్పష్టంగా చదివి అర్థం చేసుకోవాలి. చేతిరాత అందంగా లేకపోతే, ఎంత చదివినా మార్కులు రావు. అందువల్ల మంచి చేతిరాతతో పరీక్షలు రాయడం చాలా ముఖ్యం.

పరీక్ష రాసే ముందు చదివినవి గుర్తు పెట్టుకోవడానికి, అక్షర దోషాలు సరిచేయడానికి ఒకసారి రాసి చూసుకోవడం చాలా ఉపయోగ కరం. ఇది చదివిన విషయాలను గుర్తు చేస్తుంది. మీరు సమాధాన పత్రంలో ఎన్ని పదాలు రాస్తున్నారో తెలుసుకోవచ్చు. ఈ విధంగా సమయం ఎలా కేటాయించాలో తెలుసుకో గలుగుతారు.

ముఖ్యంగా పదోతరగతి, ఇంటర్ విద్యార్థులు వారు రాసే సమాధానాల్లో ప్రతి వరుసలో సుమారు 6 నుంచి 7 పదాలు ఉండేలా చూసుకోవాలి. పదాల మధ్య సరైన గ్యాప్ ఇవ్వడం అవసరం. పదాలు కలిసిపోకుండా, కొన్ని స్పేస్ ఇచ్చి రాస్తే మరీ మంచిది. ఇది కరెక్షన్ చేసే వారికి స్పష్టంగా చదవడానికి సహాయపడుతుంది. రాయడంలో ఉపయోగించే పెన్ను కూడా చాలా ముఖ్యం. ఒక మంచి పెన్నుతో రాయడం వల్ల చేతిరాత మృథువుగా, స్పష్టంగా కనిపిస్తుంది.

ప్రాక్టీస్ కూడా కీలకమే : ప్రిపరేషన్‌లో చేతిరాత మెరుగుపర్చుకోవాలంటే ప్రతి రోజూ ప్రాక్టీస్ ముఖ్యం. ప్రత్యేకంగా ముఖ్యమైన పదాలు, వాక్యాలు, అక్షరాలు రాయడం ద్వారా, సాధించాల్సిన స్థాయి చేతిరాతను సాధించొచ్చు. పరీక్ష రాయటానికి సిద్ధపడే ముందు, పాత పరీక్షల ప్రశ్నలను, సూచనలను రాసి ప్రాక్టీస్ చేయాలి. ఇది రాయడంలో వేగాన్ని పెంచుతుంది, చేతిరాతను మరింత మెరుగుపరుస్తుంది. పరీక్ష సమాధానాలను స్పష్టంగా, సూటిగా రాయాలి. చేతిరాత రకరకాలు గా మారకుండా ఒక విధంగా ఉండేలా చూసుకోవాలి.

ప్రణాళికతో చదవాలి : ఎక్కువ మార్కులు సాధించాలంటే స్మార్ట్ వర్క్ పక్కా ప్రణాళిక, క్రమశిక్షణతో కూడిన చదువు అవసరం. సిలబస్‌ను అర్థం చేసుకోవడం, పాత ప్రశ్నపత్రాలు ప్రాక్టీస్ చేయడం, ముఖ్యమైన పాయింట్స్ నోట్స్ రాసుకోవడం, సమయపాలన పాటిస్తూ అన్ని సబ్జెక్టులపై దృష్టి పెట్టడం, చేతిరాతను మెరుగుపరుచుకోవడం వంటివి చేస్తే తప్పకుండా మంచి మార్కులు వస్తాయి.

టైమ్‌టేబుల్ : సిలబస్ పూర్తి చేయడానికి, రివిజన్ చేయడానికి ఒక టైమ్‌టేబుల్ వేసుకోవాలి బట్టీ పట్టడం కాకుండా, కాన్సెప్ట్‌లను అర్థం చేసుకోవాలి. మెదడుకు పని చెప్పేలా చదవాలి. ఇదే స్మార్ట్‌వర్క్. అధ్యయన పద్ధతుల్లో భాగంగా ముఖ్యమైన టాపిక్స్, ఫార్ములాస్, నిర్వచనాలను నోట్ చేసుకోవాలి.

పాత ప్రశ్నపత్రాలు: గత ప్రశ్నపత్రాలను సాధన చేయడం వల్ల ప్రశ్నల సరళి అర్థమై, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.అన్ని సబ్జెక్టులకు సమయం కేటాయించి, ముఖ్యంగా కష్టమైన వాటికి ఎక్కువ శ్రద్ధ పెట్టండి. పరీక్ష సమయంలో స్పష్టంగా, చదవడానికి వీలుగా రాయండి. పదాల మధ్య సరైన గ్యాప్, తేలికైన పెన్ను వాడండి.

సమయపాలన: అనవసరమైన విషయాలు రాయకుండా, అడిగిన ప్రశ్నకు సూటిగా సమాధానం రాయండి. ఇది సమయాన్ని ఆదా చేస్తుంది.

ఏ పరీక్ష అయినా రాసిన తర్వాత సమాధానాలను ఒకసారి పరిశీలించుకోండి.

ఆత్మవిశ్వాసం : 'నేను చేయలేను' అనే భావనను వదిలేసి, నమ్మకంతో ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలి. చదివేటప్పుడు ఏకాగ్రతతో, శ్రద్ధగా వినడం ముఖ్యం. సందేహాలను అప్పటికప్పుడు నివృత్తి చేసుకోండి.



–కవిత నన్నపనేని
ఎంకామ్, బిఈడి,
ఎచీవర్స్ అకాడమీ ఫాకల్టీ,
విజయవాడ.



20 చుక్కలు 10 వరుసలు, 10 వచ్చేవరకు.



టంగుటూరి శ్రీలక్ష్మీ
ప్రకాశం జిల్లా.

మా చిరునామా
రంగవల్లి
మెయిల్ ఐడి :
jeevanapageps@gmail.com,
వాట్సాప్ : 83329 25496



'పతంగ్'పై బంపర్ ఆఫర్

కథానాయకుడు సందీప్ కిషన్ మరోసారి తన ఉదారతను చాటుకున్నాడు. టాలీవుడ్‌లో చిన్న సినిమాగా ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్ అందుకున్న 'పతంగ్' చిత్రంపై భారీ ఆఫర్‌ను ప్రకటించాడు. ఈ చిత్రాన్ని మరింత మంది ప్రేక్షకులకు చేరువ చేసేందుకు సందీప్ కిషన్ ఏకంగా 500 సినిమా టికెట్లను ఉచితంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. సినిమా వినోదంతో పాటు, కడుపునిండా భోజనం చేసేందుకు కూడా సందీప్ అదిరిపోయే ప్లాన్ చేశారు. 'పతంగ్' సినిమా టికెక్ చూపించిన వారికి తెలుగు రాష్ట్రాల్లోని అతడి ప్రసిద్ధ 'వివాహ భోజనంబు' రెస్టారెంట్లలో బిల్లుపై 20 శాతం ఫ్లాట్ డిస్కౌంట్ లభించనున్నట్లు తెలిపాడు. సినిమా చూసిన ప్రేక్షకులు ఫిజికల్ టికెట్ లేదా ఆన్‌లైన్ బుకింగ్ స్క్రీన్ షాట్ చూపిస్తే చాలు.



'కాగితం పడవలు' టీజర్ లాంచ్

కథానాయకుడు శర్వానంద్ 'కాగితం పడవలు' చిత్ర టీజర్‌ను శనివారంనాడు విడుదల చేసి చిత్ర యూనిట్‌కు తన శుభాకాంక్షలు తెలిపారు. ఎంజీఆర్ తుకారాం దర్శకత్వంలో వర్ధన్, కృష్ణప్రియ జంటగా నటించిన ఈ చిత్రాన్ని ఎస్ఎల్ఎస్ సినీ క్రియేషన్స్, ప్రణధి క్రియేషన్స్, నవ నారాయణ సినీ క్రియేషన్స్ బ్యానర్లపై కీర్తన నరేష్, టిఆర్ ప్రసాద్‌రెడ్డి వెంకట్రాజుల, గాయిత్రమ్మ అంజనప్ప నిర్మించారు. టీజర్ విడుదల సందర్భంగా శర్వానంద్ మాట్లాడుతూ ఎలాంటి సినీ నేపథ్యం లేకపోయినా ప్యాషన్‌తో సినిమా తీసిన దర్శకుడు తుకారాంను అభినందించారు. టీజర్ చాలా నిజాయితీగా, ఆసక్తికరంగా ఉందని, హీరో వర్ధన్ తన మొదటి సినిమా అనిపించకుండా అద్భుతంగా నటించాడని ప్రశంసించారు. 'ప్రేమ నిప్పులాంటిది.. అది జీవితానికి వెలుగునిచ్చే దీపం అవ్వచ్చు లేదా దహించే కార్చిచ్చు కావచ్చు' అనే డైలాగ్‌తో సాగిన ఈ టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఎఐఎస్ నౌఫల్ రాజా నేపథ్య సంగీతం, రుద్రసాయి విజువల్స్ బాగా ఆకట్టుకుంటున్నాయి. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎం.హిమబిందు పర్యవేక్షణలో రూపొందిన ఈ చిత్రం త్వరలోనే థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది.

1న వనవీర సినిమా విడుదల




అవినాష్ తిరువీధుల కథానాయకుడిగానూ, దర్శకుడిగా పరిచయమవుతున్న సినిమా 'వనవీర'. ఈ చిత్రంలో సిమ్రాన్ చౌదరి కథానాయికగా నటిస్తోంది. నందు ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని శంతను పత్తి సమర్పణలో సిల్వర్ స్క్రీన్ సినిమాస్ బ్యానర్‌పై అవినాష్ బుయానీ, ఆలపాటి రాజా, సి.అంకిత్‌రెడ్డి నిర్మిస్తున్నారు. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్, వివేక్ సాగర్ మ్యూజిక్ అందిస్తున్నారు. మైథలాజికల్ రూరల్ డ్రామా కథతో తెరకెక్కిన 'వనవీర' సినిమాను నూతన సంవత్సరం సందర్భంగా చిత్ర యూనిట్ విడుదల చేయనుంది. హైదరాబాద్‌లో జరిగిన ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌లో నటుడు హర్ష, బాబీ, డిఒపి ఛోటా కె.ప్రసాద్ తదితరులు మాట్లాడారు.

'బ్యాటిల్ ఆఫ్ గాల్వన్' టీజర్ విడుదల

బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్‌ఖాన్ తన 60వ పుట్టినరోజు సందర్భంగా ఆయన నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గాల్వన్' నుంచి తాజాగా టీజర్‌ను శనివారంనాడు విడుదల చేశారు. ఈ టీజర్‌లో సల్మాన్ ఖాన్ మునుపెన్నడూ లేని విధంగా ఒక సీరియస్ ఆర్మీ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నాడు. గల్వాన్ లోయ ఘర్షణల నేపథ్యంలో సాగే ఈ కథలో ఆయన నటన చాలా ఇంటెన్సివ్‌గా ఉంది. 2020లో భారత్– చైనా సరిహద్దుల్లోని గల్వాన్ లోయలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో సల్మాన్‌ఖాన్ గల్వాన్ పోరాటంలో అసువులు బాసిన తెలంగాణ ముద్దుబిడ్డ కల్నల్ సంతోష్‌బాబు పాత్రలో కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. టీజర్‌లో 'చావుకి భయం ఎందుకు.. అది ఎలాగైనా వస్తుంది' అనే డైలాగు ఉంది.

ఈ సినిమాకు అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తుండగా.. సల్మాన్‌ఖాన్ సరసన చిత్రాంగద సింగ్ కథానాయికగా నటిస్తోంది. హిమేష్ రేషమియా సంగీతం అందించబోతున్నాడు. ఈ చిత్రం ఏప్రిల్ 17, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



మరో గెలుపుపై టీమిండియా గురి

- నేడు శ్రీలంక మహిళలతో నాల్గో టి20
- రాత్రి 7.00గం॥ల నుంచి



తిరువనంతపురం: తొలి మూడు టి20లు నెగ్గి సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత మహిళాజట్టు మరో గెలుపుతో దృష్టి సారించింది. బౌలింగ్‌లో రేణుకా సింగ్ ఠాకూర్, దీప్తి శర్మ రాణించడంతో మూడో టి20లో ఘన విజయం సాధించిన భారతజట్టు తొలి రెండో టి20ల్లో స్పిన్నర్ల అద్భుత ప్రదర్శనతో అదరగట్టింది. మరోవైపు శ్రీలంక మూడు టి20ల్లోనూ ఏ ఒక్క మ్యాచ్‌లోనూ 130కు పైగా పరుగులు రాబట్టిన దాఖలాలు లేవు. దీంతో ఆజట్టు బ్యాటర్లు పరుగులు రాబట్టేందుకు చెమటలు చిందిచాల్సి వస్తోంది. మరోవైపు తెలుగు తేజం శ్రీచరణి తొలి రెండు టి20ల్లో రాణించింది. వైష్ణవి శర్మకి తోడు క్రాంతి గాడ్ కూడా బౌలింగ్‌లో ఫామ్‌లోకి రావడం శుభ పరిణామం. ఇక టీమిండియా ఆల్‌రౌండర్ దీప్తి శర్మ టి20 ఫార్మాట్‌లో అద్భుతంగా రాణిస్తోంది. ముఖ్యంగా ఐసిసి వన్డే ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాను చిత్తుచేయడంలో కీలకపాత్ర పోషించిన దీప్తి.. తిరువనంతపురం వేదికగా జరిగిన మూడో టి20లో 18పరుగులకే 3వికెట్లు పడగొట్టి శ్రీలంకను చేసింది. కెరీర్‌లో 271 అంతర్జాతీయ మ్యాచుల్లో 333 వికెట్లు పడగొట్టిన దీప్తి.. ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన ఆస్ట్రేలియా బౌలర్ ఎలైసా పెర్రీ రికార్డుకు చేరువలో నిలిచింది. ఎలైసా పెర్రీ 275అంతర్జాతీయ మ్యాచ్‌లలో 335 వికెట్లు తీయగా.. దీప్తి ఆ రికార్డును అధిగమించాలంటే మరో రెండు వికెట్లు పడగొడితే సరిపోతుంది. ఆ ఫీట్‌ను ఆదివారం శ్రీలంకతో జరిగే నాల్గో టి20లో సాధించాలని అభిమానులు కోరుకుంటున్నారు. అలాగే టి20ల్లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గానూ దీప్తి శర్మ ఇప్పటికే రికార్డుపుటల్లో కెక్కింది. టీమిండియా తరఫున పురుషుల, మహిళల టి20 ఫార్మాట్‌లో 150 వికెట్లు తీసిన ఏకైక బౌలర్ దీప్తి శర్మ మాత్రమే. ఇక ఈ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు తీసిన రికార్డు ఆస్ట్రేలియా బౌలర్ మేగన్ స్కట్ పేరిట ఉంది. మేగన్ స్కట్ 131మ్యాచుల్లో 151వికెట్లు తీసిన తొలిబౌలర్‌గా రికార్డుపుటల్లోకెక్కగా.. ఈ ఫార్మాట్‌లో ఆమె బెస్ట్ బౌలింగ్ 4/10. ఇక వన్డే ఫార్మాట్‌లో భారత బౌలర్ జులన్ గోస్వామి 121 మ్యాచుల్లో 162వికెట్లు అగ్రస్థానంలో ఉండగా.. తాజాగా దీప్తి ఇప్పటికే ఆ రికార్డును బ్రేక్ చేయగా.. నాల్గో టి20లో మరో రెండు వికెట్లు సాధిస్తే.. మరో రెండు రికార్డులను తన పేర లిఖించుకోనుంది.

జట్లు(అంచనా)...

భారత మహిళలు : హర్మన్‌ప్రీత్(కెప్టెన్), మంధాన, షెఫాలీ వర్మ, రోడ్రిగ్స్, రీచా ఘోష్(వికెట్ కీపర్), దీప్తి శర్మ, అమన్‌జ్యోత్ కౌర్, స్నేహ్ రాణా, వైష్ణవి శర్మ, క్రాంతి గాడ్, శ్రీచరణి.

శ్రీలంక మహిళలు : ఆటపట్టు(కెప్టెన్), గుణరత్నే, పెరీరా, సమరవిక్రమ, నీలాక్షి డి–సిల్వ, కవిషా దిల్హారి, కౌశని సత్యంగణా(వికెట్ కీపర్), ఇనోకా రణవీర, మాధర, కావ్య కావింది, శశినీ గిమ్హా.

రెండ్రోజుల్లోనే ముగిసిన బాక్సింగ్ డే టెస్ట్

నాల్గో టెస్ట్‌లో ఆస్ట్రేలియాపై 4 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ గెలుపు



మెల్‌బోర్న్: బాక్సింగ్ డే టెస్ట్ రెండ్రోజుల్లోనే ముగిసింది. ఈ టెస్టులో తొలిరోజు 20, రెండోరోజు 16వికెట్లు పడ్డాయి. రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 132 పరుగులకే ఆలౌట్ కావడంతో ఇంగ్లండ్ జట్టు 175పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి రాగా.. ఆ జట్టు 32.2ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 178పరుగులు చేసి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో జోష్ టంగ్(5/45) విజృంభణతో ఆసీస్‌ను 152కే ఆలౌట్ చేసింది ఇంగ్లండ్... ఆ తర్వాత ఆసీస్ బౌలర్ మైఖేల్ నెసర్(4/45) ధాటికి 110కే కుప్పకూలింది. దీంతో ఆసీస్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 42పరుగుల ఆధిక్యత లభించింది. అనంతరం బ్రైడన్ కార్సే(4/34), టంగ్(2/44) దెబ్బకు ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ 132కే కుప్పకూలింది. దీంతో ఇంగ్లండ్ జట్టు 175పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చింది. ఛేదనలో ఇంగ్లండ్ ఓపెనర్లు క్రాలే(37), డకెట్(34) తొలి వికెట్‌కు 51పరుగులు జతచేసి గట్టి పునాది వేశారు. ఆ తర్వాత జాకబ్ బెథెల్(40)కి తోడు బ్రూక్(18), జేమీ స్మిత్(3) మరో వికెట్‌పడకుండా మ్యాచ్‌ను ముగించారు. దీంతో ఇంగ్లండ్ 4వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి టెస్ట్ సిరీస్‌లో బోణీ కొట్టింది. అలాగే ఆసీస్ జట్టు వైట్‌వాష్ కలను బెన్ స్టోక్స్ బృందం కల్లలు చేసింది. ఈ క్రమంలో ఆస్ట్రేలియా గడ్డపై 15ఏళ్ల తర్వాత ఇంగ్లండ్‌జట్టు తొలి విజయం నమోదు చేసుకుంది. ఈ గెలుపుతో ఐదు టెస్ట్ మ్యాచ్‌ల యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా 3–1తో ఆధిక్యతలో ఉండగా.. ఐదో, చివరి టెస్ట్ సిడ్నీ వేదికగా జనవరి 4నుంచి జరగనుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జోష్ టంగ్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు...

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 152ఆలౌట్

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ : 110ఆలౌట్

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: బోలండ్ (సి)జేమీ స్మిత్ (బి)అట్కిన్సన్ 6, హెడ్ (బి)కర్సే 46, వేథర్లాండ్ (బి)స్టోక్స్ 5, లబూషేన్ (సి)రూట్ (బి)టంగ్ 8, స్టీవ్ స్మిత్ (నాటౌట్) 24, ఖవాజా (సి)ఓలీ పోప్ (బి)కర్సే 4, గ్రీన్ (సి)బ్రూక్ (బి)స్టోక్స్ 19, నెసెర్ (సి అండ్ బి)కర్సే 0, స్టార్క్ (సి)రూట్ (బి)కర్సే 0, రిచర్డుసన్ (సి)క్రాలే (బి)స్టోక్స్ 7, అదనం 13. (34.3ఓవర్లలో ఆలౌట్) 132పరుగులు.

వికెట్ల పతనం: 1/22, 2/40, 3/61, 4/82, 5/83, 6/88, 7/119, 8/120, 9/121, 10/132.

బౌలింగ్: అట్కిన్సన్ 5–1–20–1, కర్సే 11–3–34–4, టంగ్ 11–2–44–2, స్టోక్స్ 7.3–1–24–3.

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (ఎల్‌బి)బోలండ్ 37, డకెట్ (బి)స్టార్క్ 34, కర్సే (సి)గ్రీన్ (బి)రిచర్డుసన్ 6, బేథెల్ (సి)ఖవాజా (బి)బోలండ్ 40, రూట్ (ఎల్‌బి)రిచర్డుసన్ 15, బ్రూక్ (నాటౌట్) 18, స్టోక్స్ (సి)క్యారీ (బి)స్టార్క్ 2, జేమీ స్మిత్ (నాటౌట్) 3, అదనం 23. (32.2ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 178పరుగులు. **వికెట్ల పతనం:** 1/51, 2/65, 3/112, 4/137, 5/158, 6/165 **బౌలింగ్:** స్టార్క్ 10–0–55–2, నెసెర్ 8–1–54–0, రిచర్డుసన్ 5.2–1–22–2, బోలండ్ 9–0–29–2.

సంపాదకీయం


కుటుంబం

ఆదిమ మానవుని అవతరణ నుంచి నాగరిక మానవుని ఆవిర్భావం వరకు నడిచిన వేల సంవత్సరాల చరిత్రలో కుటుంబ రూపంలో వచ్చిన అనేక మార్పులు, స్వంత ఆస్తి ఏర్పడటం, తల్లి హక్కు పోయి, తండ్రి హక్కు ఏర్పడటం, తత్ఫలితంగా స్త్రీ జాతిపై పురుషాధిపత్యం నెలకొనడం వంటి అనేక విషయాలను 'కుటుంబము-స్వంత ఆస్తి, రాజ్యముల ఆవిర్భావం' అనే గ్రంథంలో వివరిస్తాడు ఏంగెల్స్. నాటి నుంచి నేటి వరకూ ప్రపంచం ఎంత వేగంగా మారుతున్నా, సాంకేతికత ఎంత ఎత్తుకు ఎదుగుతున్నా... మనిషిని మనిషిగా నిలబెట్టే మూలస్తంభం కుటుంబమే. వ్యక్తి మొదట నేర్చుకునే భాష, భావం, విలువలు, బాధ్యత- అన్నీ కుటుంబం నుంచే మొదలవుతాయి. భారతీయ సంస్కృతిలో కుటుంబం అనేది ఒక విలువల పాఠశాల. ఈ భావనలో ప్రపంచాన్నే ఒక కుటుంబంగా చూసే తత్వం దాగి వుంటుంది. 'దేశమంటే మట్టి కాదోయ్/ దేశమంటే మనుషులోయ్' అంటారు గురజాడ. కుటుంబం బాగుంటేనే మనిషి బాగుంటాడు. మనిషి బాగుంటేనే దేశం నిలబడుతుంది. అయితే, నేటి సమాజంలో కుటుంబం కేవలం ఒక చిరునామాగా మారిపోతోంది. ఒకే ఇంట్లో వుంటూ.. ఒకరికొకరు అపరిచితుల్లా ఎవరి ధోరణిలో వారు యాంత్రిక జీవనస్థితి పెరుగుతోంది. 'మాట మానేస్తే మనిషే మిగలడు' అంటారు కాళోజీ. మనిషి చుట్టూ వుండే మొదటి ప్రపంచం... కుటుంబం. ఆ కుటుంబాల్లో మాటలు తగ్గితే, అనుబంధాలు చనిపోతాయి.

తాత, అమ్మమ్మ మొదలు వారి పిల్లలు, వారి పిల్లలు ఇలా మూడు, నాలుగు తరాలు ఒక ఉమ్మడి కుటుంబంలో వుండేవి. ఇంట్లోని పెద్దకు అందరూ గౌరవిస్తూ, ఆయన మాటే వేదంగా భావించేవారు. ఈ పెద్దల సంరక్షణలో పిల్లలు అన్ని విషయాలూ తెలుసుకునే వారు. కుటుంబంలోని అందరూ కష్టసుఖాలను పంచుకుంటూ ఆత్మీయులుగా వుండేవి. కానీ, నేడు ఎన్నో ఉమ్మడి కుటుంబాలు చిన్న కుటుంబాలుగా మారాయి. మరోవైపు దేశానికి జనాభాయే ఆస్తి అని, దంపతులు ముగ్గురు నలుగురు పిల్లలను కనాలని మన నాయకులు ఉపదేశాలిస్తున్నారు. ఎందరిని కనాలనేది ఆ దంపతుల ఇష్టంపై ఆధారపడి వుంటుంది. ముఖ్యంగా మహిళల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. కానీ, కంటెంట్‌ను మార్కెటీకరించినట్లుగా జనాభాను కూడా మార్కెటీకరించి వ్యాపార వస్తువుగా మార్చే ప్రయత్నం జరుగుతోంది. ప్రపంచీకరణ, నయా ఉదారవాద విధానాలు అమలులోకి వచ్చిన తర్వాత వినిమయదారీ తత్వం పెద్దఎత్తున పెరిగింది. అది కుటుంబాలలో విలాసవంతమైన జీవనానికి, విచ్చలవిడితనానికి దారితీస్తోంది. మనకు అవసరం లేకపోయినా, పొరుగువారికి వుంది కాబట్టి, మనకూ వుండాలనే ధోరణి...అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తోంది. ఫలితంగా ఉమ్మడి కుటుంబాలు వృష్టి కుటుంబాలుగా మారుతూ తలోదిక్కూ పోతున్నారు. ఈ క్రమంలో కుటుంబాల్లో వృద్ధుల సంరక్షణ ప్రధాన సమస్యగా మారింది. వృద్ధాప్యంలోకి అడుగుపెడుతున్న కొద్దీ వారిలో ఆందోళన కూడా పెరుగుతోంది. వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు బాసటగా నిలవాల్సిన పిల్లలు.. ఆ బాధ్యత నుంచి తప్పుకుంటున్నారు. తమ జీవితమంతా కుటుంబం కోసం పరితపించిన పెద్దలు...తమ చరమాంకంలో వృద్ధాశ్రమాల్లో అనాథలుగా బతుకులీడ్చే పరిస్థితికి నేటి కుటుంబ వ్యవస్థ నెట్టబడింది. 'మూలాలను మరిచిన వృక్షం ఎక్కువకాలం నిలబడదు' అంటారు శేషేంద్ర శర్మ. వృద్ధులను విస్మరించే కుటుంబమైనా, సమాజమైనా ఎక్కువ కాలం నిలబడదు.

ప్రపంచం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతున్న వేళ, మనిషి మానవ సంబంధాల విషయంలో తిరోగమనంలో వున్నాడు. ఆర్థిక గణాంకాల్లో కనిపిస్తున్న ప్రగతి...కుటుంబ బంధాల్లో మసకబారుతోంది. ఈ పరిణామాల క్రమంలో జనవరి 1న జరుపుకునే 'గ్లోబల్ ఫ్యామిలీ దినోత్సవం' ఒక ఉత్సవంగా కన్నా, ఒక హెచ్చరికగా ఎన్నో ప్రశ్నలను మన ముందుంచుతోంది. మన ఇళ్లలో ప్రేమ వుందా? సంభాషణ వుందా? పరస్పర గౌరవం వుందా? ఇంట్లోని ఒక్కో వ్యక్తి, ఒక్కో దీవిలా మారిపోయారా? ఈ ప్రశ్నలకు సమాధానం వెతక్కపోతే, రేపటి సమాజం మరింత ఒంటరిగా, వృద్ధాప్యం మరింత భారంగా మారుతుంది. బలమైన కుటుంబ వ్యవస్థతోనే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుంది. కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కాకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

మహనీయుల మాట



స్వతంత్రంగా వ్యవహరించే వారినీ,
స్వేచ్ఛగా ఆలోచించే వారినీ,
విధేయతను పాటించని వారినీ
జల్లెడ పట్టి దూరంగా నెట్టడమే
మొత్తం మన విద్యా శిక్షణా సంస్థలు
చేస్తున్న పని. ఎందుకంటే
వీరున్నంతకాలం ఇవి
పని చెయ్యలేవు మరి!

- నోమ్ చోమ్‌స్కీ
అమెరికన్ తత్వవేత్త , భాషా శాస్త్రవేత్త

మనువాదం, మగవాదం, మార్కెట్ తత్వం

ప్రస్తుతం



> తమాషా ఏమంటే ఇవన్నీ సభ్యత, నీతి, మర్యాద వంటి గొప్ప పేర్లతో చలామణి అవుతుంటాయి. వీటిని వ్యతిరేకించే వాళ్లనూ ముందే అపహాస్యం చేస్తుంటారు. మహిళను ఆయుధంగా ప్రయోగించి రాజకీయం చేయడం, వ్యాపారాలు చేయడం తప్ప నిజంగా వారి విముక్తి కోరేవారెవరూ ఈ పోకడలను ఎంతమాత్రం సహించరు. మహిళా కమిషన్లకు నియమితులైనవారు కూడా వారి వారి రాజకీయ అనుబంధాలను బట్టి వ్యవహరించడం ఈ సమస్యను మరింత జటిలం చేస్తుంటుంది. సభ్యసమాజంలో సమానత, సంస్కారం, భద్రత, అభివృద్ధి కోణంలో తప్ప వీటిపై మరో రకంగా స్పందించడానికి ఆస్కారమే లేదు.



తెకపల్లి రవి

ఈ మధ్యన ఒక సీనియర్ నటుడు మహిళల వస్త్రాల గురించి, శరీరాల గురించి చేసిన వ్యాఖ్యలపై తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. తన మాటలపై స్త్రీ స్వాతంత్ర్యవాదులు దాడి చేసినా చేయొచ్చనీ ఆయన ముందే సెటైరు వేశారు. ఆ తర్వాత తను వాడిన రెండు పదాలకు మాత్రం క్షమాపణ చెబుతున్నాననీ, అయితే తన ఉద్దేశం మొత్తం భావం సరైనవేననీ ఇంకా సమర్థించుకున్నారు. అంతేగాక తనపై విమర్శ చేసిన నటీమణి పేరు తీసి మరిన్ని సవాళ్లు విసిరారు. ఆయన ప్రస్తావించిన ఉదాహరణలతో ముడిపడి వున్న మహిళలు ముఖ్యంగా నటీమణులు గట్టిగానే సమాధానమిస్తున్నారు. ఇవన్నీ సంచలనం కోసం కూడా చేస్తుంటారనే వాదనా వుంది. అయితే సరిగ్గా ఈ సమయంలోనే మరికొన్ని పరిణామాలు కూడా దుమారం రేపడం గమనించవచ్చు. ఉత్తర ప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో 2017లో 13 ఏళ్ల మైనర్ బాలికపై ఘోర అత్యాచారానికి పాల్పడటమే గాక ప్రశ్నించిన ఆమె కుటుంబంపైనా హత్యాకాండకు దిగిన బిజెపి మాజీ ఎంఎల్‌ఎ కులదీప్ సెంగార్‌పై శిక్షను నిలిపేసి బెయిల్‌పై విడుదల చేశారు. రాజస్థాన్‌లో జాట్ కులస్తులలో ఒక శాఖకు చెందిన వివాహిత మహిళలు మొబైల్ ఫోన్ వినియోగించరాదనీ, చదువుకునే అమ్మాయిలు కూడా చదువులు, పరీక్షలకు మాత్రమే దాన్ని వాడుకోవాలనీ ఒక కులపంచాయితీ హుకుం జారీ చేసింది.

అసభ్యతల పరంపర

ఇవి గత రెండు మూడు రోజుల సంగతులు మాత్రమే. కాస్త వెనక్కు వెళితే కొద్ది రోజుల కిందట బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఉద్యోగ నియామకం కోసం వచ్చిన యువతి బురఖా లాగారు. ఈ వయసులో మీరు ఇలాంటి బట్టలు వేసుకోవడం సరైందా అని నటిని ప్రశ్నించిన మరో సీనియర్ పాత్రికేయుడు తర్వాత క్షమాపణలు చెప్పారు. ఓ ప్రముఖ బహు భాషా నాయికకూ రాజకీయ నేతకూ సంబంధించి అసభ్య ఆరోపణ చేసిన ఒక రాష్ట్ర మంత్రిణి బాగా ఆలస్యంగా క్షమాపణ చెప్పి బయటపడ్డారు. ఇంకా కొంచెం వెనక్కు వెళితే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమ్మాయి పుట్టాలని ఎవరూ కోరుకోరని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వాలంటీర్ల కారణంగా కుటుంబాల్లో మహిళలు అదృశ్యం అవుతున్నారని అప్పట్లో ఆరోపించారు. సినిమా హీరోలు, నటులు వేడుకల్లో ఉపయోగించిన అవాకులు చవాకులు సరేసరి. అమరావతి వేశ్యల రాజధానిగా మారిందని అలాంటి లెక్కలనే ఉటంకిస్తూ ఒక పాత్రికేయుడు కల్లోల కారకులయ్యారు. ఒక మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషుడు బికినీలు వేసుకోవద్దని ప్రకటించారు. శాసనసభల్లోనే పెద్ద నేతల భార్యల గురించి వెకిలిగా మాట్లాడిన మంత్రులున్నారు. ఇప్పటికీ భార్యలను, కుటుంబ సభ్యులనూ అనవసరంగా చర్చలోకి తెచ్చే ధోరణులు సాగుతూనే వున్నాయి. కీలక పదవుల్లో వున్న మహిళలనూ అగ్రతారలనూ కూడా అవమానకరంగా మాట్లాడిన ఉదంతాలున్నాయి. ఈ వ్యాఖ్యలు చేసిన వారి నేపథ్యాలూ, ముగింపులూ అన్నీ ఒకే తరహాకు చెందినవి కావనేది నిజమే. ఇలాంటి వివాదాలు జరిగినప్పుడల్లా వ్యక్తులు, సంస్థలు వారివారి రాజకీయాలనూ అభిమాన దురభిమానాలను బట్టి స్పందించడం, వ్యాఖ్యానించడం జరిగిపోతుం టుంది. కానీ వీటి వెనక వున్న ఘోరమైన కుసంస్కారం, మహిళా వివక్ష మరుగు పడిపోతుంటాయి. స్త్రీల శరీరాలతో సహా వారి జీవితాల పైన, నైతికతపైన, అసలు వారి పుట్టుకల పైన వారి పిల్లల పుట్టుకల పైనా ఇష్టానుసారం మాట్లాడ్డం, బాధితులైన వారినే నిందితులుగా కారకులుగా చూపించడం వీటిలో ఉమ్మడి లక్షణం.

> ఇలాంటి వివాదాలు జరిగినప్పుడల్లా వ్యక్తులు, సంస్థలు వారివారి రాజకీయాలనూ అభిమాన దురభిమానాలను బట్టి స్పందించడం, వ్యాఖ్యానించడం జరిగిపోతుంటుంది. కానీ వీటి వెనక వున్న ఘోరమైన కుసంస్కారం, మహిళా వివక్ష మరుగు పడిపోతుంటాయి. స్త్రీల శరీరాలతో సహా వారి జీవితాల పైన, నైతికతపైన, అసలు వారి పుట్టుకల పైన వారి పిల్లల పుట్టుకల పైనా ఇష్టానుసారం మాట్లాడ్డం, బాధితులైన వారినే నిందితులుగా కారకులుగా చూపించడం వీటిలో ఉమ్మడి లక్షణం.

ప్రభుత్వాధినేతల మౌనం

తాజాగా ఈ నటుడు కూడా తను మాట్లాడిన దాంట్లో కేవలం రెండు పదాలు మాత్రమే పొరబాటనీ మొత్తం భావం మంచిదేననీ ఆయన ఇంకా వాదిస్తున్నారు. నిధి అగర్వాల్ అనే నటి ఒక సినిమా వేడుకకు వెళ్లిన సమయంలో ఒక మూక ఆమె పట్ల అనుచితంగా వ్యవహరించి ఇబ్బంది పెట్టిన కారణంగానే అలా హితబోధ చేశానంటున్నారు (నిధి అగర్వాల్ ఇటీవలనే పవన్ కల్యాణ్ సినిమా 'హరిహర వీరమల్లు'లో నాయికగా నటించారు. ఆమె సినిమాను బాగా ప్రమోట్ చేశారని, ఆమెను చూసి సిగ్గుపడి తనూ ప్రమోషన్‌కు వచ్చానని ఆయన అప్పట్లో చెప్పుకున్నారు. ఇప్పుడు ఆమె పాల్గొన్న వేడుక కూడా గ్లోబల్ స్థాయి కలెక్షన్లు తెచ్చుకున్న ఒక హీరోకు సంబంధించింది.). అయితే 'బాధితులనే నిందితులను చేయడం' అన్న వాక్యంతో ఆమె ఆయనపై స్పందించారు. వస్త్రాలతో నిమిత్తం లేకుండానే అబ్బాయిలతో సహా చిన్నపిల్లలపై అత్యాచారాలు, జంతువులపై హింస ఎందుకు జరుగుతున్నాయని నిలదీశారు. ఇక సవాళ్లకు గురైన నటి అనసూయా భరద్వాజ్‌తో సహ పరిశ్రమలో క్రియాశీలంగా వున్న అనేకమంది దీటైన సమాధానాలు ఇచ్చారు. పైగా ఆయన అరకొర క్షమాపణను అర్జంటుగా ఆమోదించవలసిన అవసరమేమిటని తెలుగు నటీనటుల సంఘమైన 'మా'ను ప్రశ్నించారు. గతంలో నిధిని మెచ్చుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎందుకు మౌనం పాటిస్తున్నారనే ప్రశ్న కూడా వచ్చింది. మహిళా సంఘాలు శివాజీ మాటలను ఖండించడం తప్ప పాలక కూటమి నుంచి ఎవరూ దీనిపై ఎందుకు మాట్లాడటం లేదు? అలాగే ఇప్పుడు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రధాన ప్రతిపక్ష నాయకులు తమవారి అసభ్య వ్యాఖ్యల తరుణంలో ఎందుకు మాట్లాడలేదు? మహిళలపై కరుడుగట్టిన ద్వంద్వనీతి, మగవాదం, మనువాదం తప్ప ఇందుకు మరో కారణం లేదు. ఇలాంటి విషయాలపై చర్చ అనవసరమనే వాదన కూడా చాలా తప్పు, అనేక ఖండనలు, నిరసనల తర్వాతనే పరిస్థితి ఇలా వుంది. ఇవీ లేకపోతే మనువాదులు మరెంత దారుణంగా వ్యవహరించేవారో ఊహించడం అసాధ్యం.

దొందూ దొందే

మనువాదం, మార్కెట్ వాదం, మగవాదం మహిళలను ఒకేలా చూస్తాయి. కానీ ఒకదాన్ని ఒకదానికి పోటీ నిలిపి మాట్లాడుతూ గందరగోళ పరుస్తుంటాయి. మరీ ఇలా, మరీ అలా అనే మాటలు ప్రయోగిస్తుంటాయి. ఉదాహరణకు వస్త్ర ధారణనే తీసుకుంటే నీతులన్నీ మహిళలకే ఎందుకు చెప్పడం? దేశ ప్రధాన మంత్రి నగ్నసాధువుకు సాష్టాంగపడినప్పుడు, మహిళలను కూడా సమాజం మోకరిల్లజేసినపడు వీరికి సభ్యత గుర్తుకు రాదే? కుంభమేళాలో నగ్నసాధువులు ప్రదర్శనలే చేసినప్పుడు నోరెత్తరే? ఇవన్నీ మాట్లాడేవారే సినిమాలు తీసినప్పుడు వారిని ఎలా చూపిస్తుంటారు? కనుక రెండు చోట్లా బలవుతున్నది మహిళలే. సామాజిక సమస్యగా చూడవలసిన ఈ అంశాన్ని కేవలం రాజకీయ కళ్లద్దాలతో చూడటం కూడా తప్పే. ఈ మధ్య కేరళలో ఎంఎల్‌ఎ ఒకరు తప్పుగా మాట్లాడితే ఆ ప్రభుత్వం వెంటనే కేసు పెట్టింది తప్ప వదిలేయలేదని గమనించాలి.

నాలుగు రకాలుగా మహిళల విషయంలో తప్పుడు మాటలు వస్తుంటాయి. మొదటిది-వారి వస్త్రాల వల్లనే లేక వారు బయటికి రావడం వల్లనే తప్పుగా ప్రవర్తిస్తున్నారని చెప్పడం. ప్రొవోక్ చేసే అంటే రెచ్చగొట్టే బట్టలు వేసుకోవద్దనే మాట ఇందులో సర్వసాధారణం. ఒకరి వస్త్రధారణను బట్టి మరొకరు రెచ్చిపోవడం ఏమిటనే ప్రశ్నకు వీరు జవాబివ్వరు. ఆ మాటకొస్తే నిక్కర్లు వేసుకుని లేదా అంతకంటే తక్కువ పీలికతో యాడ్స్ చేసే కొందరు హీరోల మాటేంటి? రెండవది-స్త్రీలకు ఎవరైనా నీతులు చెప్పే హక్కు వుందని భావించడం. వారిపై ఇష్టానుసారం మాట్లాడితే సరదాగా తీసుకోవాలని సలహాలివ్వడం, వయసు మళ్లిన హీరోలు కూడా చిన్న చిన్న అమ్మాయిలతో అసభ్యమైన పదాలతో, స్టెప్పులతో నటిస్తే కేకలేయడం. నిజానికి సంఘ సంస్కరణోద్యమాలే లేకపోతే మేజువాణిలు సాగుతూనే వుండేవి. ఇప్పటికీ రికార్డింగు డాన్సులు, ఐటం సాంగులు ఆగింది లేదు. డర్టీ పిక్చర్స్ అంటూ వాటినీ సొమ్ము చేసుకుంటున్నారు. మూడు- మహిళలను వస్తువులుగా పరిగణించి నోరు పారేసుకోవడం. సామానులు, సరుకులు అనే పాటలూ మాటలూ అలా వచ్చేవే. ఇక ఆచారం కోసం ఏం చేసినా నోరెత్తకూడదని శాసించడం. స్త్రీని మార్కెట్ వస్తువుగా చూపడమంటే ఇదే. కొంతకాలం కిందట ఒక యాడ్‌లో ఇల్లు, కారుతో స్త్రీని పోలుస్తూ మాట్లాడటం పెద్ద దుమారమైంది. నాల్గవది- సనాతన ఆచారం ప్రకారం ఫలానా విధంగా వుండాలంటూ చరిత్రకు తోచిన నిర్వచనాలు చెప్పడం. మరి అలాగైతే లోదుస్తులే ఆచారానికి విరుద్ధం కదా? కొన్ని ప్రాంతాలలో అసలు పైదుస్తులు వుండవు కదా? పేదలు, ఆదివాసులు వేసుకోవడానికి కూడా శక్తి లేని పరిస్థితి ఇప్పటికీ పూర్తిగా పోలేదు కదా అంటే జవాబుండదు. అత్యాచారాల పెరుగుదలను, ప్రేమోన్మాదులనే కొత్త తరహా హత్యలనూ గురించి మాట్లాడరు. ఇంత మీడియా వున్నా ఈ పరిస్థితి వుందంటే ఒకప్పటి భూస్వామ్య వ్యవస్థలో మరెంత రాక్షసంగా వుండి వుండాలి? ఎన్ని పోరాటాలు చేస్తే ఈ మాత్రం హక్కులైనా వచ్చాయి? ఇప్పుడు పునరుద్ధరణ వాదం, మత చాందసం వాటిని కూడా హరించి వేస్తున్న ఫలితమే కదా ఈ అవాకుల అమానుషాలు? మహిళా స్వాతంత్ర్యం అంటూ వచ్చేస్తారని ఎగతాళి చేసేప్పుడు ఇవన్నీ గుర్తుకు రావద్దా? మత మార్కెట్ తత్వాల గుప్పిట్లో మహిళ పుస్తకం చదివితే ఇలాంటి చాలా వివరాలు దిగ్భ్రాంతి కలిగిస్తాయి. ఆడంగి మాటలు, గాజులు తొడుక్కోవడం, ప్రత్యర్థులకు సారె పంపించడం వంటివి ఇప్పటికీ వాడుక నుంచి పోలేదని తాజాగా అనేకసార్లు చూస్తున్నాం.

ముదిరితే ముప్పే

తమాషా ఏమంటే ఇవన్నీ సభ్యత, నీతి, మర్యాద వంటి గొప్ప పేర్లతో చలామణి అవుతుంటాయి. వీటిని వ్యతిరేకించే వాళ్లనూ ముందే అపహాస్యం చేస్తుంటారు. మహిళను ఆయుధంగా ప్రయోగించి రాజకీయం చేయడం, వ్యాపారాలు చేయడం తప్ప నిజంగా వారి విముక్తి కోరేవారెవరూ ఈ పోకడలను ఎంతమాత్రం సహించరు. మహిళా కమిషన్లకు నియమితులైనవారు కూడా వారి వారి రాజకీయ అనుబంధాలను బట్టి వ్యవహరించడం ఈ సమస్యను మరింత జటిలం చేస్తుంటుంది. సభ్యసమాజంలో సమానత, సంస్కారం, భద్రత, అభివృద్ధి కోణంలో తప్ప వీటిపై మరో రకంగా స్పందించడానికి ఆస్కారమే లేదు. పై తరగతుల మహిళలంటూ వారిని చులకన చేసేవారు కింది వర్గాల కోసం పోరాడతారా అంటే అదీ లేదు. కనుక మూల కారణాన్ని చక్కదిద్దుకోవడం, అవమానాలకు, అత్యాచారాలకు చట్టబద్ధంగా సామాజిక రాజకీయ పరంగా సమాధానం చెప్పడం అనివార్యం. అవసరం కూడా.

★

వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ - ఉన్నత విద్య వ్యాపారీకరణ

విమర్శ



> అక్రెడిటేషన్ ప్రక్రియ 'ఫలితం' ఆధారితంగా ఉంటే కొన్ని సంస్థలు నిజమైన విద్యకు బదులుగా ఫలితాలను మెరుగుపరచడంపైనే దృష్టి పెడతాయి. నియమాలు ఉల్లంఘించిన విద్యాసంస్థలపై విధించే జరిమానాలు రూ.10 లక్షల నుండి రూ.2 కోట్ల వరకు ఉంటాయి. ఈ బిల్లు ప్రతిష్టాత్మక విదేశీ విశ్వవిద్యాలయాలను భారత దేశంలో స్థాపించడానికి అనుమతి ఇస్తామంటుంది. విదేశీ యూనివర్శిటీల్లో ఫీజులను విద్యార్థులు డాలర్ల రూపంలో చెల్లించాలి. మన దేశంలో డాలరుకు రూపాయి విలువ రోజురోజుకూ (నేడు రూ.91) పడిపోతోంది. ఇటువంటి తరుణంలో మనం ఎక్కువ ఫీజులు కట్టాల్సి వస్తుంది. వీటన్నింటి మూలంగా స్వయంపాలనలో విద్యాసంస్థల ఇతర ఆదాయ మార్గాలన్నీ మూసుకుపోతాయి. అంతిమంగా దీని ప్రభావం విద్యార్థులపై పడుతుంది. యాజమాన్యాలు విద్యార్థుల నుండి విపరీతంగా ఫీజులు పెంచేసి 'సేవ' పేరుతో వ్యాపారం చేసుకుంటాయి.



డి.రాము

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 'ఎన్.ఇ.పి-2020'లో ఉన్న ఆలోచనలు, సిఫార్సులను చట్టబద్ధంగా అమలు చేయడానికి ఒక బిల్లును రూపొందించింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) స్థానంలో 2018లో తీసుకువచ్చిన హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పేరును 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్'గా మార్చారు. పేరు మార్చిన ఈ బిల్లును విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 2025 డిసెంబర్ 12న లోక్‌సభలో పరిచయం చేశారు. హెచ్.ఇ.సి.ఐ లో ఉన్న మూడు కౌన్సిళ్ల (ఎన్.ఎ.సి, ఎన్.హెచ్.ఇ.ఆర్.సి, జి.ఇ.సి) పేర్లను కూడా (వికసిత్ భారత్ శిక్షా వినియమన్ పరిషత్, వికసిత్ భారత్ శిక్షా గుణవత్త పరిషత్, వికసిత్ భారత్ శిక్షా మానక్ పరిషత్ గా) మార్చారు. నూతన విద్యా విధానం ద్వారా విద్య కేంద్రీకరణ, వ్యాపారీకరణ, మతతత్వీకరణ చేయడానికి వేసుకున్న ప్రణాళికే ఈ బిల్లు అని మనం గ్రహించాలి.

విద్య కేంద్రీకరణ

వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బహుళ శాస్త్ర సంస్థలను (మల్టీ డిసిప్లినరీ ఇన్‌స్టిట్యూషన్లను) ప్రోత్సహిస్తుంది. బహుళ శాస్త్ర విధానం వలన విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై పట్టు కలిగి భవిష్యత్తులో ఉపాధి విషయంలో ఎక్కువ అవకాశాలు పొందవచ్చని చెబుతుంది. కానీ దీని మూలంగా కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ వంటి కొన్ని సబ్జెక్టులకు విపరీతమైన డిమాండ్ పెరిగి మిగిలిన సబ్జెక్టులు పూర్తిగా మూతబడతాయి. భవిష్యత్తులో ఉపాధి మాట పక్కన వుంచితే ఉన్న అధ్యాపక పోస్టులకే ఎసరు పెడుతుంది. బహుళ శాస్త్ర విధానం అమలు జరపాలంటే ట్రైనీ అధ్యాపకులు, నాణ్యమైన ల్యాబ్, మౌలిక సదుపాయాలు అవసరం. చిన్నచిన్న విద్యాసంస్థలు ఈ భారాన్ని మోయలేక దివాలా తీస్తాయి. అదేవిధంగా ఇది గుణమైన విద్యా సంస్థలకు స్వయం ప్రతిపత్తిని, స్వయం పాలనను ప్రోత్సహిస్తుంది. మంచి అక్రెడిటేషన్లు పొందిన విద్యాసంస్థలకు ఎక్కువ స్వయంప్రతిపత్తి ఇవ్వడం వలన విద్యాసంస్థల మధ్య పోటీ పెరుగుతుంది. ఈ పోటీలో నిలదొక్కుకోలేక కొన్ని విద్యాసంస్థలు మూతబడతాయి. ప్రస్తుతం ఉన్న ఐ.ఐ.టి, ఐ.ఐ.ఎం ల వలె అన్ని ఉన్నత విద్యాసంస్థలను మల్టీ డిసిప్లినరీ విద్యాసంస్థలుగా మార్చడం అసాధ్యం. ఇటువంటి చర్యల వలన దేశవ్యాప్తంగా రూ.45 వేల పైచిలుకుగా ఉన్న ఉన్నత విద్యాసంస్థలు కేవలం రూ.15 వేలకు కుదించబడతాయి. దీనిమూలంగా విద్య గ్రామసీమలకు విస్తరించడానికి భిన్నంగా కేంద్రీకరణ జరిగి...భవిష్యత్తు తరాలకు విద్య అందని ద్రాక్షగా మిగులుతుంది.

విద్య వ్యాపారీకరణ

ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఫ్యాకల్టీ వంటి అంశాలపై యుజిసి దృష్టి పెట్టి, దాని ఆధారంగా అక్రెడిటేషన్ రూపొందించేది. కానీ కొత్త బిల్లు విద్యార్థులకు వస్తున్న ఫలితాలు ఆధారంగా అక్రెడిటేషన్లను రూపొందిస్తుంది. ఎక్కువ ఫలితాలు వచ్చిన విద్యాసంస్థలకు ఎక్కువ అక్రెడిటేషన్, ఎక్కువ స్వయంప్రతిపత్తి అందిస్తుంది. అక్రెడిటేషన్ ప్రక్రియ 'ఫలితం' ఆధారితంగా ఉంటే కొన్ని సంస్థలు నిజమైన విద్యకు బదులుగా ఫలితాలను మెరుగుపరచడంపైనే దృష్టి పెడతాయి. నియమాలు ఉల్లంఘించిన విద్యాసంస్థలపై విధించే జరిమానాలు రూ.10 లక్షల నుండి రూ.2 కోట్ల వరకు ఉంటాయి. ఈ బిల్లు ప్రతిష్టాత్మక విదేశీ విశ్వవిద్యాలయాలను భారత దేశంలో స్థాపించడానికి అనుమతి ఇస్తామంటుంది. విదేశీ యూనివర్శిటీల్లో ఫీజులను విద్యార్థులు డాలర్ల రూపంలో చెల్లించాలి. మన దేశంలో డాలరుకు రూపాయి విలువ రోజురోజుకూ (నేడు రూ.91) పడిపోతోంది. ఇటువంటి తరుణంలో మనం ఎక్కువ ఫీజులు కట్టాల్సి వస్తుంది. వీటన్నింటి మూలంగా స్వయంపాలనలో విద్యాసంస్థల ఇతర ఆదాయ మార్గాలన్నీ మూసుకుపోతాయి. అంతిమంగా దీని ప్రభావం విద్యార్థులపై పడుతుంది. యాజమాన్యాలు విద్యార్థుల నుండి విపరీతంగా ఫీజులు పెంచేసి 'సేవ' పేరుతో వ్యాపారం చేసుకుంటాయి.

విద్య మతతత్వీకరణ

సెక్షన్ 9(సి) ప్రకారం బహుళ శాస్త్ర ఉన్నత విద్యా వ్యవస్థల్లో భారతీయ జ్ఞానం, భాషలు, కళలను ఏకీకృతం చేయడానికి, ప్రోత్సహించడానికి రూట్ మ్యాప్ రూపొందించాలని ఈ బిల్లు చెబుతుంది. ఎన్.ఇ.పి కూడా వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత వంటి గ్రంథాలు...యోగ, ఆయుర్వేదం వంటి వాటిని కరికులంలో చేర్చాలని నొక్కి చెప్పింది. అంతే కాదు. ఈ మధ్య కాలంలో పాఠ్యాంశాల్లో మతతత్వాన్ని చొప్పించే ప్రయత్నం చేసింది. 7వ తరగతిలో ఉన్న మొఘల్, ఢిల్లీ సుల్తానుల అధ్యాయాలను తీసివేసి వాటి స్థానంలో మౌర్య, గుప్త రాజవంశాలపై దృష్టి పెట్టింది. ఎన్.సి.ఇ.ఆర్.టి పుస్తకాల నుండి బాబ్రీ మసీదు ధ్వంసం వివరాలు, 2002లో గుజరాత్‌లో జరిగిన ముస్లింల ఊచకోత తొలగించారు. భూమి పవిత్రమవుతుంది, మహా కుంభమేళా వంటి అంశాలను చేర్చారు. 8వ తరగతిలో మత అసహనం, ఆలయాల ధ్వంసం, శివాజీ ఆలయాలను పునఃనిర్మించడాన్ని ప్రస్తావించడం అనేది మతపరమైన, సాంస్కృతిక ప్రాముఖ్యతను వివరిస్తుంది. జ్యోతిష్యాన్ని, వాస్తును శాస్త్రాలుగా చెప్పాలంటుంది. గోవు మూత్రంపై పరిశోధనలు చెయ్యాలంటుంది. ఇది మునుపటి లౌకిక శాస్త్రీయ దృక్పథం నుండి పూర్తిగా మతతత్వీకరణ వైపుకు దృష్టి మళ్లిస్తుంది.

రాష్ట్రాల హక్కులపై దాడి

బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రల హక్కులపై ముప్పేట దాడికి దిగుతుంది. ఇప్పటి వరకు ఉమ్మడి జాబితాలో ఉన్న విద్య ఈ బిల్లు ద్వారా కేంద్రం చేతుల్లోకి చేర్చడం వలన కేంద్రానికి విద్యపై గుత్తాధిపత్యం వస్తుంది. ఇప్పటివరకు స్వచ్ఛందంగా నడుస్తున్న యు.జి.సి, ఎ.ఐ.సి.టి.ఇ, ఎన్.సి.టి.ఇ లను రద్దు చేసి వాటి స్థానంలో ఏకీకృత నియంత్రణ వ్యవస్థను తీసుకు రావడం దానికి నిదర్శనం. ఈ వ్యవస్థలో మెజారిటీ సభ్యులు కేంద్రప్రభుత్వంచే నియమించబడిన వారే. అది కూడా ఒక్కరు మాత్రమే నామినీగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి రొటేషన్ పద్ధతిలో ఉంటారు. వీరికి ఓటింగ్ హక్కు ఉన్నప్పటికీ వీరి సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ ఇప్పటి వరకు విద్యాసంస్థల అభివృద్ధికి నిధులు మంజూరు చేసేది. కానీ ఈ బిల్లు నిధులు మంజూరు చెయ్యడానికి బదులుగా అప్పులు ఇస్తామంటుంది. రాష్ట్రాల్లో ఈ బిల్లు అమలు అధిక ఖర్చుతో కూడుకున్నది. అక్రెడిటేషన్ ఖర్చులు రూ.50 నుండి రూ.100 కోట్లు, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్లకు రూ.10 నుండి రూ.20 కోట్లు, ఫ్యాకల్టీ శిక్షణకు రూ.5 నుంచి రూ.10 కోట్లు వంటి అదనపు భారాలు రాష్ట్ర బడ్జెట్లపై ఒత్తిడిని పెంచుతాయి. రాష్ట్రల నుండి జి.ఎస్.టి రూపంలో మొత్తం పన్నుల నుండి వస్తున్న ఆదాయాన్ని కేంద్రం తీసుకొని...ఇవ్వాల్సి వచ్చినప్పుడు మాత్రం మొండికేస్తూ రాష్ట్రలపైనే భారాలు మోపడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం.

విద్యార్థులపై ప్రభావం

విద్యార్థులకు నాణ్యమైన, బలమైన ఫిర్యాదు పరిష్కార వ్యవస్థను అందిస్తామని బిల్లు చెప్తుంది. కాని ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ కేంద్రీకృతమై ఉండటం వలన స్థానిక సమస్యలకు తక్షణ పరిష్కారం లభించదు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న గిరిజనులు, దళితులు విద్యలో బాగా వెనుకబడతారు. విద్యార్థులు ఇప్పటికే చేస్తున్న కోర్సులు, డిగ్రీల స్థానంలో కొత్త కోర్సులు, డిగ్రీలు రావడం వలన భవిష్యత్ విద్యా ప్రణాళికలపై అనిశ్చితి ఏర్పడుతుంది. సంస్థలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వడం వలన ఫీజులు పెరిగి, సౌకర్యాలు తగ్గుతాయి. వృత్తి విద్యా ఏకీకరణ జరిగి బలవంతంగా రుద్దబడుతుంది. డిజిటల్ విభజన ఉన్న ప్రాంతాలలో విద్యార్థులు ఆన్‌లైన్ అక్రిడిటేషన్ వ్యవస్థలో వెనుకబడతారు. గతంలో యుజిసి విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు మంజూరు చేసేది. ఈ బిల్లు మాత్రం అటువంటి నిర్ణయాలు ఏమీ చేయలేదు. ఈ బిల్లు ధనిక వర్గాలకు మాత్రమే విద్యను అందుబాటులో ఉంచి, అత్యధిక అణగారిన వర్గాలకు విద్యను దూరం చేస్తుంది. అందుచేత, విద్యార్థులు, మేధావులు, ప్రజలంతా ఐక్యంగా ఈ బిల్లును వ్యతిరేకించాలి.

(వ్యాసకర్త ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, సెల్: 9705545164)

ఖబడ్దార్!

పల్లవి: పీడిత పక్షం గొంతుల
చుట్టూ
పి.డి చట్టం సంకెళ్లా !
గంజాయాంధ్రగా మార్చేస్తున్న
మాఫియాలు మీ చుట్టాలా!
ఖబడ్దార్.. ఖబడ్దార్!
ప్రజల ఆస్తుల బడా చోర్!
చరణం: చెట్టూ, పుట్టా, కొండా,
కోన ను
చుట్టుముట్టాయి మీ అనకొండలు!
మింగేస్తున్నవి వాగులు, వంకలు
తాగేస్తున్నవి నదీ జలాలు!
సముద్రతీరం..గర్భం సైతం
దోచి పెడుతున్న ద్రోహుల్లారా
"ఖబడ్దార్"
రక్తం, చెమటల సారపు భూములు
అధికారంతో స్వాధీనాలు!
ఊపిరి తీసే విష పరిశ్రమల
యజమానులకు సంతర్పణలు!
నిరసిస్తుంటే.. నినదిస్తుంటే
నిలదీస్తుంటే అక్రమ కేసులు
"ఖబడ్దార్"
జారుతున్న ఈ కన్నీరే
జ్వాలా కెరటం ఖబడ్దార్!
ముందుకు సాగే మున్నేరై
ముంచక తప్పదు ఖబడ్దార్!
అమ్ముడుపోయిన నమ్మకద్రోహుల
భరతం పడతాం ఖబడ్దార్!!

- నల్లి ధర్మారావు
(అనకాపల్లి కా॥ ఎం. అప్పలరాజు అరెస్టును నిరసిస్తూ...)

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps@gmail.com



అనంతపురం జిల్లా ఉరవకొండలో ప్రారంభం అవుతున్న సిఐటియు జీపుజాతా

అనంతలో కార్మిక చైతన్యం

అనంతపురం కలెక్టరేట్

కార్మికుల 'మహా' చైతన్యంతో అనంతపురం జిల్లాలో చేపట్టిన అఖిలభారత సిఐటియు మహాసభ జీపుజాతా కొనసాగింది. 2వ రోజు అనంతపురం జిల్లాలోని పలు మండలాల్లో యాత్ర సాగింది. ఉదయం ఉరవకొండ నుంచి ప్రారంభం అయిన జాతా బ్రహ్మసముద్రం, రాయదుర్గం, కళ్యాణదుర్గం, రాప్తాడులో పర్యటించి రాత్రికి అనంతపురం చేరుకుంది. జాతాలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఆలపించిన గేయాలు కార్మికులను చైతన్యం చేశాయి. మహాసభ ఆవశ్యకతను తెలియజేస్తూ నాయకులు చేసిన ప్రసంగాలు ఉత్తేజపరిచాయి. అన్ని ప్రాంతాల్లో కార్మికులు, ప్రజలు జీపుజాతాకు స్వాగతం పలికారు. జనవరి 4న నిర్వహించే బహిరంగ సభలో తామూ పాల్గొంటామంటూ కార్మికులు తెలిపారు.

బౌద్ధం.. వైజ్ఞానిక దృక్పథం

- సాహితీ గోష్టిలో వక్తలు

ప్రజాశక్తి- ప్రత్యేక ప్రతినిధి



సాహితీ గోష్టిలో మాట్లాడుతున్న శ్రీనివాస్, చిత్రంలో తెలకపల్లి రవి తదితరులు

బౌద్ధం ఓ వైజ్ఞానిక దృక్పథం వంటిదని, శాస్త్రీయబద్ధంగా ఉంటుందని పలువురు సాహితీవేత్తలు అభిప్రాయపడ్డారు. అందువల్లే బుద్ధిజం ప్రపంచ దేశాల సాహిత్యాలపై ప్రభావం చూపుతుందన్నారు. సిఐటియు అఖిల భారత 18వ మహాసభ సందర్భంగా విశాఖపట్నంలోని ఎయు కన్వెన్షన్ గ్రౌండ్‌లో నిర్వహించిన శ్రామిక ఉత్సవ్‌లో 'తెలుగు సాహిత్యంపై బౌద్ధ ప్రభావం' అనే అంశంపై చర్చాగోష్టి నిర్వహించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి మాట్లాడుతూ... బుద్ధుడి కాలంలో ప్రజాస్వామ్య సంస్కృతి నేర్చుకోవచ్చన్నారు. నేటి సమాజంలో ఏర్పాటు చేసుకున్న ప్రజాస్వామ్యాన్ని సాక్ష్యాత్తు పాలకులే కాల్చివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నాటి బుద్ధిజానికి, నేడు రాష్ట్ర రాజధానిలో బుద్ధుడి విగ్రహాల ఏర్పాటుకు చాలా తేడా ఉందని చలోక్తులు వేశారు. అనేక చోట్ల ఇప్పటికీ బుద్ధుడి అవశేషాలు ఉన్నాయని, వాటిని పరిరక్షించడం ద్వారా బుద్ధిజంలో మంచిని సమాజానికి అందించవచ్చన్నారు. విశాఖకు చెందిన విశ్రాంత వైద్యులు, సాహితీవేత్త డాక్టర్ మాటూరి శ్రీనివాస్ మాట్లాడుతూ... మన దేశంలోనే కాక 144 దేశాల్లో బౌద్ధ సాహిత్యం ఉందన్నారు. మన ప్రాంతంలోని గురజాడ, బెంగాల్‌లో ఠాగూర్ వంటి వారి రచనల్లో బుద్ధిజం ప్రభావాలు స్పష్టంగా కనిపిస్తాయని చెప్పారు. వీరితోపాటు అనేక మంది అభ్యుదయ కవులు, రచయితలు బౌద్ధానికి పునర్జీవం పోశారని వివరించారు. విశాఖపట్నంలో ప్రతి ఆరు కిలోమీటర్లకు బౌద్ధస్తూపాలు ఇప్పటికీ కనిపిస్తున్నాయని తెలిపారు. సాహితీ స్రవంతి నాయకులు కుమారస్వామి మాట్లాడుతూ... బుద్ధుడు గొప్ప మానవతా వాది అని కొనియాడారు. అందుకే బుద్ధుడిని ఆది కమ్యూనిస్టుగా సంబోధిస్తారని చెప్పారు. సొంత ఆస్తి ఉండకూడదని బుద్ధుడు ప్రభోదిస్తే, భూమి ఇతర సహజ వనరులన్నీ జాతీయం చేయాలని కారల్ మార్క్స్ చెప్పారని అన్నారు. బుద్ధుడు సమానత్వం కోరితే, శ్రమదోపిడీని మార్క్స్ వ్యతిరేకించారని చెప్పారు. సెల్‌ఫోన్ వల్ల దూరమవుతున్న బంధాలపై డి.వెంకట చంద్రశేఖర్ పేరిట కవిత వినిపించారు. పిల్లల్లారా... పాపల్లారా... అనే శతాబ్దపు పౌరుల్లారా... అంటూ మరో కవి తన కవితను వినిపించారు. చర్చాగోష్టిలో పాల్గొన్న శ్రీనివాస్, కుమార స్వామిలకు శ్రామిక జ్ఞాపికలను తెలకపల్లి రవి అందజేశారు. సాహితీ స్రవంతి విశాఖపట్నం జిల్లా నాయకులు వి.చలపతిరావు అధ్యక్షత వహించారు.



కంభంలో ఆర్థిక సహకారం అందజేస్తున్న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

మహాసభల జయప్రదం కోసం మేము సైతం..

- జిల్లాలో రెండో రోజు ప్రచార జాతాకు విస్తృత సంఘీభావం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

సిఐటియు ప్రకాశం జిల్లా ప్రచార జాతాలకు రెండో రోజు శనివారం పలు కార్మిక సంఘాలు మద్దతు ప్రకటిస్తూ జాతాలో చురుకుగా పాల్గొన్నాయి. మహాసభను విజయవంతం చేసేందుకు మేము సైతం వెంట నడుస్తాం అంటూ కార్మిక సంఘాలు ముందుకు రావడం విశేషం. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో మార్కాపురంలో సిఐటియు నాయకులు రఫీ, సోమయ్యలు ప్రచార జాతాను ప్రారంభించారు. కంభంలో ప్రచార జాతాకు ఆహ్వానం పలికిన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మహాసభ కోసం ఆర్థిక, హార్థిక సహకారం అందిస్తామని ప్రకటించడం జాతాకు మరింత ఊతమిచ్చింది. యూనియన్ నాయకులు బి.రోశయ్య, ఎస్‌డి కొత్తూరు, ఎస్‌కె నాజర్ వలి, రహిమాన్‌ల ఆర్థిక సహకారం కార్మికుల ఐక్యతను ప్రతిబింబించింది. గిద్దలూరులో ఆవులయ్య నాయకత్వంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఆటో వర్కర్స్ యూనియన్ కార్మికులు జాతాకు సంఘీభావం ప్రకటించారు. ఈ ప్రచార జాతా తర్లుపాడు, బి.పేట, గిద్దలూరు, రాచర్ల, హనుమంతునిపాడు, వెలిగండ్ల మీదుగా సిఎస్ పురం వరకు సాగింది. రెండో ప్రచార జాతా ఒంగోలు నగరంలో కర్నూల్ రోడ్ బైపాస్‌లోని బిల్డింగ్ వర్కర్స్ కార్మికుల మెట్టు వద్ద ప్రారంభమైంది. సిఐటియు ఒంగోలు నగర కన్వీనర్ టి.మహేష్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి ఎస్‌డి హుస్సేన్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు, ఆర్‌టిసి ఉద్యోగులు జాతాలో పాల్గొన్నారు. ఆటో రవాణా కార్మికులు సంఘీభావం తెలిపారు. సివిల్ సప్లై ముఠా నాయకులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, రిమ్స్ వద్ద రిమ్స్ పారిశుధ్య కార్మికులు, రైల్వే స్టేషన్ వద్ద రైల్వే కూలీలు ప్రచార జాతాకు సంఘీభావం తెలిపారు.

నంద్యాల జిల్లాలో జీపుజాతాల విస్తృత ప్రచారం

అఖిల భారత 18వ మహాసభను జయప్రదం చేయండి

- కార్మిక వ్యతిరేకి మోడీ విధానాలను ప్రతిఘటించండి..

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్




నంద్యాల జిల్లా కేంద్రంలో జీపు జాతాను ప్రారంభిస్తున్న సిఐటియు సీనియర్ నాయకులు తోట మద్దులు

నంద్యాల జిల్లాలో జీపుజాతాలు ప్రారంభమయ్యాయి. నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల జాతా ఈ నెల 26న ప్రారంభం కాగా, 27 వరకు శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో ఆటో జాతా ప్రచారం జరిగింది. రెండోజాతా నంద్యాల జిల్లా కేంద్రలో, శనివారం జీపు జాతా నంద్యాల పట్టణం గాంధీ చౌక్ సెంటర్‌లో సిఐటియు సీనియర్ నాయకులు తోట మద్దులు జెండా ఊపి ప్రారంభించారు. సిఐటియు పట్టణ అధ్యక్షులు కె.మహమ్మద్ గౌస్, కార్యదర్శి పి.వెంకటలింగం, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్‌తో, సిఐటియు నాయకులు పాల్గొన్నారు. శ్రీశైలం, నందికొట్కూరు జాతా ఆటో జాతా వెలుగోడు ఆత్మకూర్, పాములపాడు, కొత్తపల్లి, మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించింది. రెండో రోజు నందికొట్కూరుకు చేరిన జాతాను నందికొట్కూరులో సిఐటియు ఆటో జాతాను జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరావు ప్రారంభించి మాట్లాడారు. రెండోరోజు నందికొట్కూరుతో పాటు పగిడ్యాల, మిడ్తూరు, గడివేముల మండలాల్లోని పలు గ్రామాలను తిరిగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా ఏసురత్నం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం. నాగేశ్వరావు మాట్లాడారు. నంద్యాలలో ప్రారంభమైన జీపు జాతా కార్యక్రమంలో సీనియర్ నాయకులు తోట.మద్దులు, సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మణ్‌లు మాట్లాడారు. మూడు సంవత్సరాల కాలంలో చేసిన పోరాటాలను సమీక్షించుకుని, రాబోయే కాలంలో చేయాల్సిన పోరాటాలకు దిశా నిర్దేశం చేసుకునేందుకు ఈ మహాసభలలో తీర్మానం చేయడం జరుగుతుందన్నారు. అనంతరం సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కె.మహమ్మద్‌గౌస్, పి.వెంకటలింగం మాట్లాడుతూ ఈ జీపుజాతా బండిఆత్మకూరు, సిరివెళ్ల, రుద్రవరం, కోవెలకుంట్ల, సంజామల, దొర్నిపాడు, ఆళ్లగడ్డ మండల, పట్టణ కేంద్రాలలో రెండు రోజులపాటు నిర్వహిస్తామన్నారు. 28న ఆత్మకూరు పట్టణంలో ప్రారంభమయ్యే జీపుజాతా ఆత్మకూరు నియోజకవర్గం నందికొట్కూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలలో ప్రచారం నిర్వహిస్తున్నారు. మరొక జాత ఈనెల 28న ప్రారంభమై డోన్ పట్టణంలో ప్రారంభమై డోను, బనగానపల్లె నియోజకవర్గ మండల కేంద్రాలలో ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పలమనేరులో బైక్‌ర్యాలీ

ప్రజాశక్తి - పలమనేరు (చిత్తూరు జిల్లా)

చిత్తూరు జిల్లా పలమనేరు బస్టాండ్ నుంచి పురవీధుల్లో శనివారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. విశాఖపట్నంలోని 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని, కార్మికులంతా తరలిరావాలని కోరారు. సమస్యల పరిష్కారించాలని కేంద్రానికి వినిపించేలా ఈ మహాసభలో నినదించాలన్నారు. కార్మికవర్గం సుదీర్ఘకాలం పోరాడి సాధించుకున్న చట్టాలను లేబర్ కోడ్‌లను కాపాడుకోవాలని, ఉద్యమ కార్మికులకు దిశనిర్దేశం చేసే సిఐటియును ఆదరించాలని సిఐటియు చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి గిరిధర్‌గుప్తా, జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు పిలుపునిచ్చారు. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలని, ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసే చర్యలను ప్రతిఘటించాలని జీవితబీమా సంస్థ నాయకులు మునిరాజు, వ్యకాసం జిల్లా కార్యదర్శి ఓబుల్‌రాజు పేర్కొన్నారు. ఈ ర్యాలీలో కుమార్‌స్వామి, జయంతి, రాజా, సుధాకర్, శంకర్, ప్రతాప్, ధనమ్మ, ప్రియ, ఆంజనేయులు పాల్గొన్నారు.



పలమనేరు పురవీధుల్లో ర్యాలీ



పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో స్వాగతం పలుకుతున్న మున్సిపల్ కార్మికులు

పల్నాడు జిల్లాలో రెండోరోజు ప్రచార జాతా

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా మాచర్లలో రెండోరోజు ప్రచార జాతా కొనసాగింది. నియోజకవర్గ కేంద్రమైన గురజాలలో ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం తదితర స్కీమ్ వర్కర్లు ఈ జాతాకు ఘన స్వాగతం పలకగా పిడుగురాళ్ల పట్టణంలో మున్సిపల్ కార్మికులు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ దరి గుర్రం జాషువ విగ్రహం వద్ద సభ నిర్వహించారు. మండల కేంద్రమైన క్రోసూరులో బైక్ ర్యాలీగా స్వాగతం పలికారు. రెంటచింతల, దాచేపల్లి, బెల్లంకొండలోనూ జాతా ప్రచారం చేపట్టగా గురజాల, పిడుగురాళ్లలో జాతాకు సంఘీభావంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఎ లక్ష్మీశ్వరరెడ్డి, క్రోసూరులో వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి రవిబాబు మాట్లాడారు. సత్తెనపల్లి పట్టణంలో జాతాకు వివిధ రంగాల కార్మికులు ఘనస్వాగం పలికారు. అనంతరం గార్లపాడు బస్టాండు సెంటర్లో సభ, మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన సభతో జాతా ముగిసింది. జాతాకు సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఆంజనేయులు నాయక్, సహాయ కార్యదర్శి టి శ్రీనివాసరావు నాయకత్వం వహించారు.

కదిలిన ఆశా వర్కర్లు

- సిఐటియు మహాసభ విజయవంతానికి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి జనవరి నాలుగో తేదీ వరకు నిర్వహించే సిఐటియు అఖిల భారత మహాసభకు ఆశా వర్కర్లు ప్రచారం నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా మందస మండలం హరిపురంలో ఆశా వర్కర్స్ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్నో ఉద్యమాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసిన కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మిక వర్గమంతా కదలాలని, మహాసభను, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. రణస్థలం మండలంలోని కోష్టలో ఆశా వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె నాగమణి, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. కొత్తూరు మండలం మెట్టూరులోనూ సమావేశం జరిగింది.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న సిఐటియు కర్నూలు జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు ఇతరనాయకులు

మహాసభ పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

జనవరి 4న విశాఖపట్నంలో జరిగే భారీ బహిరంగ సభకు భారీగా కార్మిక వర్గం కదలి రావాలని కార్మికులకు సిఐటియు కర్నూలు జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు పిలుపునిచ్చారు. కార్మిక కర్షక భవన్‌లో మహాసభ జయ ప్రధానికి పోస్టర్లు, బ్యానర్లు విడుదల చేశారు. ఈనెల 29న కర్నూలు జిల్లాలో జరిగే జీపు జాతాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిఎస్ రాధాకృష్ణ, ఎమ్‌డి అంజిబాబు కార్మిక వర్గాన్ని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గ హక్కులను కాలరాస్తూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మార్పు చేస్తూ యజమానులకు తొత్తులుగా ఈ ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని వారన్నారు. భవన నిర్మాణం, హమాలి, ఆటో, అసంఘటితనంగా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని ఉద్యోగ కార్మిక హక్కులను కాపాడాలని 18వ మహాసభలో చర్చించి రానున్న కాలంలో పోరాటాలు నిర్వహిస్తారన్నారు. సిఐటియు జిల్లా నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సత్యసాయిలో కార్మిక నినాదం

ప్రజాశక్తి - హిందూపురం



శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో జెండా ఊపి జాతాను ప్రారంభిస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు

సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన జీపుయాత్ర సత్యసాయి జిల్లాలో ఉద్యమభరితంగా సాగుతోంది. 2వ రోజు హిందూపురంలో ప్రారంభం అయిన జాతా లేపాక్షి, చిలమత్తూరు, పెనుగొండ, మడకశిర ప్రాంతాల్లో కొనసాగి రాత్రి పరిగి మండలానికి చేరుకుంది. హిందూపురంలో జాతాను సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు ప్రారంభించారు. అసంఘటిత రంగ కార్మికులు ఇందులో పాల్గొని సిఐటియుకు మద్దతుగా నిలిచారు. డప్పు వాయిద్యాలు, కళాకారుల గేయాలతో జాతా కార్మికులను చైతన్యం చేసింది. హక్కులకు అండ.. సిఐటియు జెండా... అంటూ కార్మికులు నినాదాలు చేశారు. బహిరంగ సభలో పాల్గొనేందుకు కార్మికులు స్వచ్ఛందంగా సమాయత్తం అయ్యారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ కార్మికుల హక్కులు... చట్టాల పరిరక్షణ కోసం అన్ని రంగాల కార్మికులు సమరశీల పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులకు అండగా సిఐటియు నిలుస్తుందన్నారు. 4న ర్యాలీ, బహిరంగ సభ జయప్రదం కోసం జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రచార జాతా చేపట్టారు. జాతాను శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోని ఇందిరమ్మ సర్కిల్ వద్ద జి ఓబుల్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యానంతరం ఎన్నడూ లేనంతగా కార్మిక వర్గం తీవ్రమైన కష్టాలను ఎదుర్కొంటోందని, కార్పొరేట్లకు కొమ్ముగాస్తున్న కేంద్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను పూర్తిగా హరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగక కార్మికులు అర్ధాకలితో అలమటిస్తుంటే కార్పొరేట్ల ఆస్తులు వంద రెట్లు పెరుగుతున్నాయని, అసమానతలు, పేదరికం ఎన్నడూ లేని స్థాయికి చేరాయని, కేంద్ర ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణమని విమర్శించారు. ఈ విధానాలకు ప్రత్యామ్నాయాలను సిఐటియు జాతీయ మహాసభలో రూపొందిస్తారని చెప్పారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్పి శ్రీనివాసులు, పట్టు రైతు సంఘం రాష్ట్ర నాయకులు ధనాపురం వెంకట్రామిరెడ్డి, సిఐటియు పట్టణ కన్వీనర్ రాము మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు అయ్యే వరకూ పోరాడతామన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ సహా అన్ని ప్రభుత్వరంగ పరిశ్రమలను కార్పొరేట్లకు కారు చౌకగా కట్టబెడుతూ కార్మిక వర్గాన్ని రోడ్డుకు లాగుతుందన్నారు. బ్రిటిష్ కాలం నాటి నుండి సాధించుకున్న హక్కులను లేబర్ కోడ్‌ల పేరుతో కాలరాస్తున్నారని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాటంలో భాగంగా జరిగే సిఐటియు జాతీయ మహాసభ జయప్రదానికి కార్మికవర్గమంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం హిందూపురంలో ప్రారంభమైన జీపుజాతా కేంద్రంలో ముగుస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులతో పాటు అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

'కార్మిక ఉత్సవ్' ఉత్తేజభరితం..



మహిళల కోలాట ప్రదర్శన

- అలరించిన కళా ప్రదర్శనలు
- విశాఖ తరలిరావాలని పిలుపు

ప్రజాశక్తి - నెల్లూరు

ఉత్సాహం... ఉత్తేజం... ఎటు చూసినా సిఐటియు ఆల్ ఇండియా మహాసభ సందడి... నెల్లూరు నగరంలోని బొల్లినేని సెంటర్‌లో సిఐటియు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో శ్రామిక ఉత్సవ్ కార్యక్రమం రెండోరోజూ శనివారం కూడా ఉత్తేజభరితంగా జరిగింది. కళాకారులు నిర్వహించి న ప్రదర్శనలు ఉర్రూతలూగిం చాయి. ప్రజానాట్య మండలి కళాకారులు, ఆలపించిన విప్లవగీతాలు అలరించాయి. ఎర్రచీరలు ధరించిన మహిళల కోలాట నృత్యం ఆకట్టుకుంది. లయబద్ధంగా సాగిన కోలాటం ప్రేక్షకులకు కనువిందు చేసింది. జిల్లాలో జరిగి న కార్మిక పోరాటాలు సాధించిన విజయాలను సిఐటియు నాయకులు వివరించారు. సిఐటియు కార్మికుల నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కర్రసాము అబ్బురపరిచింది. సిఐటియు జిందాబాద్.. కార్మికు ల ఐక్యత వర్ధిల్లాలి.. అంటూ నినదించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం హరించేలా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చి పారిశ్రామికవేత్తల కు, పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తుందని విమర్శించారు.

భీమవరం మున్సిపల్ కార్పొరేషన్

కమిషనరుకు భారీ జరిమానా

- నిర్మాణ అనుమతులు ఉల్లంఘించిన భవన యజమానులకూ 2.5 లక్షల జరిమానా

ప్రజాశక్తి-అమరావతి

నివాస భవన నిర్మాణ అనుమతులు తీసుకున్నాక దానిని వాణిజ్య సముదాయ నిర్మాణం చేస్తుంటే భీమవరం మున్సిపల్ కమిషనరు కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అది నివాస భవనమేనంటూ కోర్టును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారంటూ వ్యాఖ్యానించారు. న్యాయమూర్తులకు గంతలు కట్టే ప్రయత్నం చేయొద్దని హెచ్చరించింది. పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం అప్పటి మున్సిపల్ కమిషనరుకు రూ.2.50 లక్షలను కోర్టు ఖర్చుల కింద భారీ జరిమానా విధించింది. ఈ మొత్తం కమిషనరు తన సొంత డబ్బు చెల్లించాలని ఆదేశించింది. అనుమతులకు భిన్నంగా వాణిజ్య భవన నిర్మాణదారులకు కూడా రూ.2.5 లక్షల జరిమానా విధించింది. ఇరువురూ ఆ మొత్తాన్ని రెండు వారాల్లోగా హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) వద్ద జమ చేయాలంది. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఆ మొత్తాన్ని మూగ, అంధుల సంక్షేమం కోసం వినియోగించాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. భీమవరానికి చెందిన మణి మంజరి, నరసింహారావు వార్డు నెంబర్ 34లోని సర్వే నెంబర్ 99/5, 99/6లో నివాస గృహ నిర్మాణం కోసం మున్సిపల్ కార్పొరేషన్ అనుమతులు తీసుకున్నారు. వాణిజ్య భవనాన్ని నిర్మిస్తున్నారని దండు శ్రీనివాస్ కుమార్ వర్మ 2023లో హైకోర్టులో పిటిషన్ వేశారు. తమ భవనానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఒసి) జారీ చేసేలా అధికారులను ఆదేశించాలంటూ మణి మంజరీ, నరసింహారావు పిటిషన్ దాఖలు చేశారు. వీటిని గతంలో సింగిల్ జడ్జి విచారించి నిర్మాణం పూర్తయినందున నివాసం నిర్మాణానికి బదులు వాణిజ్య నిర్మాణంగా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయాలని కమిషనరును ఆదేశిస్తూ తీర్పు చెప్పారు. మణిమంజరీ, నరసింహారావుకు రూ.50 వేలు ఖర్చులు విధించారు. ఈ తీర్పును శ్రీనివాస్ వర్మ సవాల్ చేస్తూ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌పై డివిజన్ బెంచ్ పై విధంగా తీర్పు వెలువరించింది. వాణిజ్య భవనం ఫొటోలను పరిశీలించింది. అది వాణిజ్య సముదాయం కాదన్న అప్పటి కమిషనరు కౌంటర్ కూడా పరిశీలించింది. అనుమతులకు భిన్నంగా నిర్మాణం చేసిన యజమానులకు, కార్పొరేషన్ కమిషనరుకు భారీ జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

నేరాల నియంత్రణకు కార్యాచరణ

- హోంమంత్రి అనిత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నేరాల నియంత్రణకు సమన్వయంతో కూడిన కార్యాచరణ అవసరమని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. నేరాల నివారణపై రాష్ట్ర స్థాయి క్రైమ్ రివ్యూ సమావేశం తాడేపల్లిలో శనివారం నిర్వహించారు. ఈ ఏడాదిలో నమోదైన నేరాలు, వాటిపై విధించిన శిక్షలు, కేసుల పురోగతిపై సమీక్షించారు. సైబర్‌క్రైమ్, క్రిప్టో కరెన్సీ దుర్వినియోగం, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, డీప్ ఫేక్ టెక్నాలజీ వంటి ఆధునిక సవాళ్లను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన నివారణ చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో కేసుల పరిష్కారానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగించి, నిందితులకు త్వరగా శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆమె ఆదేశించారు. రివ్యూ సందర్భంగా నేర పరిశోధనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 12 మంది అధికారులను సన్మానించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు, నిపుణులు, ప్రొఫెసర్లు పాల్గొని పలు సూచనలు చేశారు. వీరితోపాటు సిఐడి డిజి రవిశంకర్, లీగల్ అడ్వైజరు లక్ష్మణరావు, సిఐడి ఎస్‌పిలు పాల్గొన్నారు.

రాజకీయ ముసుగులో వైసిపి రౌడీయిజం

రాజకీయ ముసుగులో కొత్త తరహా రౌడీయిజాన్ని పురికొల్పుతూ రాష్ట్రాభివృద్ధికి వైసిపి ఆటంకం కలిగిస్తోందని హోంమంత్రి అనిత విమర్శించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పుట్టినరోజు వేడుకల పేరుతో సమాజానికి హానికరమైన సంప్రదాయాలను ప్రోత్సహించడం గర్హనీయమని తెలిపారు. గర్భిణిపై దాడి చేసిన వ్యక్తిని కాపాడటానికి అతను జనసేన కార్యకర్త అని వైసిపి నేతలు అబద్ధాలు ప్రచారం చేయడం సిగ్గుచేటని అన్నారు. రప్పా రప్పా అని గీత దాటితే జైల్లో పెడతామని హెచ్చరించారు.

డిజిగా విశాఖ సిపి

- జీఓ ఆర్‌టి నెంబరు 2467 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖపట్టణం సిపి శంఖబ్రతబాగ్చీ (1996 బ్యాచ్)కు సూపర్ టైమ్ స్కేల్ కల్పిస్తూ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించింది. ఈ మేరకు శనివారం జీఓఆర్‌టి నెంబరు 2467ని విడుదల చేసింది.

సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో చార్జిషీట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో నాంపల్లి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసినట్టు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ శనివారం హైదరాబాద్‌లో తెలిపారు. ఈ కేసులో మొత్తం 23 మందిపై పోలీసులు అభియోగాలు మోపారు. సుమారు వంద పేజీల ఛార్జిషీట్‌లో ఎ-11గా సినీ నటుడు అల్లు అర్జున్ పేరు చేర్చారు. గతేడాది డిసెంబర్ 4న రాత్రి 9.30 గంటల సమయంలో పుష్ప-2 బెనిఫిట్ షో కోసం హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్దకు వచ్చిన చిత్ర కథానాయకుడు అల్లు అర్జున్‌ను చూసేందుకు అభిమానులు ఎగబడటంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో వారిని నిలువరించేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయడంతో రేవతి (35) అనే మహిళతోపాటు ఆమె కుమారుడు శ్రీతేజ కింద పడిపోయి జనం కాళ్ల మధ్య నలిగిపోయారు. ఇద్దరూ తీవ్ర గాయాలతో స్పృహ తప్పారు. పోలీసులు ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి వారిని తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రేవతి మృతి చెందారు. కుమారుడి పరిస్థితి విషమంగా ఉండడంతో నిమ్స్‌కు తరలించారు. తొక్కిసలాటలో మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటనపై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యా రంగంలో కేంద్ర ప్రభుత్వ మితిమీరిన జోక్యం

అప్రజాస్వామికం

'ద హిందూ' ఛైర్మన్ ఎన్ రామ్



చెన్నై : రాష్ట్రాల పరిధిలోని విద్యారంగంపై కేంద్ర ప్రభుత్వం మితిమీరి జోక్యం చేసుకోవడం అప్రజాస్వామికం అని ద హిందూ పబ్లికేషన్ ఛైర్మన్ ఎన్ రామ్ అన్నారు. చెన్నైలో ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ (ఏఐపిఎస్ఎన్) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నేషనల్ ఎడ్యుకేషన్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలకు హాజరైన ఎన్ రామ్ మాట్లాడుతూ విద్యార్థి ఏ భాషనైనా నేర్చుకునే ఆప్షన్ ఉంటుందని అయితే హిందీ భాషను బలవంతంగా రుద్దాలని కేంద్ర ప్రభుత్వం చూడడం ఆక్షేపణీయమన్నారు. రాజ్యాంగంలో రాష్ట్రాల విధుల్లో విద్యారంగం ఉందని, గవర్నర్లు జోక్యం చేసుకోరాదని, రాష్ట్రాల హక్కులను భంగపరచరాదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపుతుందన్నారు. ఇది సమాఖ్య స్ఫూర్తికి మంచి పరిణామం కాదన్నారు. కేంద్రం అనేక ఆటంకాలు కల్పించినప్పటికీ కేరళలోని వామపక్ష ప్రభుత్వం విద్యారంగంలో అద్భుతమైన ఫలితాలను సాధించిందని, దేశానికి తలమానికంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. విద్యారంగ నిపుణులు, జన విజ్ఞాన వేదిక ఎపి రాష్ట్ర సలహాదారులు, మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నూతన విద్యా విధానం పేరిట ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలలను వాటంతట అవే మూతపడే విధంగా రాష్ట్ర ప్రభుత్వ చర్యలున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేద, దళిత మధ్య తరగతి, గ్రామీణ ప్రజలు పాఠశాల విద్యకు దూరమయ్యే దుష్పరిమాణాలు చోటు చేసుకున్నాయని, విద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి ఉద్యమించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నుండి ఏఐపిఎస్ఎన్ ఈసి సభ్యులు కె శ్రీనివాస్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు వైఎస్ నాగేశ్వరరావు, ఎన్‌టి వెంకటేష్, బిర్లా నాయిడు, శ్వేత, కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు..



5న బొమ్మల కొలువు

- పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మహిళా సంస్థల ఆధ్వర్యాన జనవరి ఐదున విజయవాడలో నిర్వహించే బొమ్మల కొలువు, సాంస్కృతిక ప్రదర్శనల వాల్‌పోస్టర్‌ను విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో శనివారం ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ కన్వీనర్ కె.స్వరూపరాణి మీడియాతో మాట్లాడుతూ... సంక్రాంతి సంబరాల్లో భాగంగా 'భిన్నత్వంలో ఏకత్వం' థీమ్‌తో బొమ్మల కొలువులు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిధ సంస్కృతులు - ఆచారాలకు సంబంధించి తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి లేదా పొంగల్, ఉత్తరాయణ ఆచారాలను సూచించే బొమ్మలు (గంగిరెద్దులు, హరిదాసు, ఎడ్లబండి, రైతు కుటుంబం, పంటలు, పశువులు వగైరా), మహిళా సాధికారితకు సంబంధించి విద్యావంతులుగా, ఉద్యోగులుగా, మహిళా రైతులుగా కనిపించే బొమ్మలు, స్వయం సహాయ సంఘాలు తయారు చేసే వస్తువులు, పిండి వంటలు ప్రదర్శించనున్నట్లు చెప్పారు. బొమ్మల కొలువులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. బహుమతి ప్రదానోత్సవ సభలో రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్వీ ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో పి.విజయ, ఒ.పావని (ఎంబివికె), వి.సత్యవతి (తరుణీ తరంగాలు), వి.భారతి (స్పృహాప్తి ఆర్గనైజేషన్), ఉషా రాజా (సేఫ్), ఎ.సంధ్యారాణి (ఫోరంఫర్ ఆర్టిస్టు), ఇ.లీలాకుమారి (వన్‌ఎర్త్-వన్ లైఫ్), టి.ఎస్.కె.సుజాత (ఇన్నర్ వీల్ (మిడ్‌ఆన్)- సన్ షైన్), ఎ.రత్నలక్ష్మి (నిర్భయ మహిళా మండలి), శ్యామల (రాయల్ క్లబ్), దివ్యవాణి, అక్కినేని లక్ష్మి (లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ-సామరస్య) పాల్గొన్నారు.

డ్రగ్స్ కేసులో నటి సోదరుడు అమన్‌ప్రీత్ పరారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డ్రగ్స్ కేసులో పరారీలో ఉన్న ప్రముఖ నటి సోదరుడు అమన్‌ప్రీత్ కోసం హైదరాబాద్ ఈగల్ టీమ్, పోలీసులు గాలిస్తున్నారు. ఈ కేసులో ఈ నెల 17న ట్రూప్ బజార్‌కు చెందిన నితిన్ సింఘానియా, శ్రనిక్ సింఘ్విని పోలీసులు అరెస్టు చేశారు. వారిని విచారించగా అమన్‌ప్రీత్ పేరు బయటకు వచ్చింది. ఈ ఇద్దరు వ్యాపారుల నుంచి అతడు డ్రగ్స్ కొన్నట్లు ఈగల్ టీమ్ గుర్తించింది. ఇద్దరు వ్యాపారుల నుంచి 43 గ్రాముల కొకైన్, ఎండిఎంఎ స్వాధీనం చేసుకుంది. గతేడాది కూడా అమన్‌ప్రీత్‌ను సైబరాబాద్ పోలీసులకు పట్టుబడ్డాడు. మరోవైపు నితిన్ సింఘానియా, శ్రనిక్ సింఘ్వికి మరో నలుగురు వ్యక్తులు డ్రగ్స్ సరఫరా చేసినట్లు పోలీసులు తెలిపారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

- సిఎంకు జనవిజ్ఞాన వేదిక సూచన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలందరిలో శాస్త్రీయ దృక్పథం పెంపుదలకు కృషి చేయాల్సిన ముఖ్యమంత్రి అందుకు విరుద్ధంగా తిరుపతిలో జరిగిన భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో మాట్లాడటం విచారకరమని జనవిజ్ఞాన వేదిక అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పైడర్ మ్యాన్లు, బ్యాట్ మ్యాన్, అర్జునుడు, హనుమంతుడు వంటి పాత్రలు గల కల్పానిక కథలు, పురాణాలు ఫాంటసీ సినిమాలను వాస్తవాలనే విధంగా ప్రచారం చేయడం ఆక్షేపణీయ మని వేదిక అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెఎస్ లక్ష్మణరావు, తవ్వా సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచమంతాటికీ సంబంధించిన శాస్త్రవే త్తలు ఆర్యభట్ట, భాస్కరుడు, న్యూటన్, డార్విన్ కనుగొన్న సిద్ధాంతాలు ఎల్లలు లేకుండా, సరిహద్దులు లేకుండా విశ్వ మానవులందరికీ ప్రయోజనకరంగా ఉంటాయనేది ఒక వాస్తవమని వివరించారు. ఇదిలా ఉండగా శాస్త్రజ్ఞులను, విజ్ఞానాన్ని, సైన్స్‌ను దేశ సరిహద్దులకు పరిమితం చేసి కలగాపులగంగా మాట్లాడడం సరైన పద్ధతి కాదని తెలిపారు. సైన్స్, శాస్త్రీయ దృక్పథం, పరిశోధనలు, హేతుబద్ధ విధానాలు మానవ సమాజం అభివృద్ధికి కీలకమైన ఈ విషయా లను ప్రభుత్వాలు విస్మరించొద్దని కోరారు. రాజ్యాంగం లోని ఆర్టికల్ 51ఎహెచ్ ప్రకారం పౌరులందరిలో శాస్త్రీయ దృక్పథం పెంపుదలకు కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు కట్టుబడి ఉండాలని వివరించారు. విద్యార్థులు, యువతలో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు.

భీమడోలులో హిట్ అండ్ రన్

గుర్తు తెలీని వాహనం ఢీకొని ముగ్గురు యువకులు మృతి



ప్రజాశక్తి- భీమడోలు

గుండుగొలను-రాజమండ్రి జాతీయ రహదారిపై సూరప్పగూడెం వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. వీరు పల్సర్ మోటార్ సైకిల్‌పై రాంగ్ రూట్లో వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలకు చెందిన సయ్యద్ రఫీ (20), కొయ్యగూర శ్రీరామ్ (22), తిమ్మాపురానికి చెందిన మాంద్రాజు చరణ్ (బన్ని) (26) ఫంక్షన్లకు పూల డెకరేషన్ పనులను చేస్తుంటారు. పూల కొనుగోలు కోసం శనివారం తెల్లవారుజామున వీరు ముగ్గురూ పల్సర్ మోటార్ సైకిల్‌పై ద్వారకాతిరుమల నుంచి ఏలూరు బయల్దేరారు. సూరప్పగూడెం వద్ద హైవేపైకి చేరే క్రమంలో రాంగ్ రూట్లో వెళ్తుండగా ఎదురుగా రాజమండ్రి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలతో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ సందర్శించి వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం కోసం గాలిస్తున్నట్లు భీమడోలు సిఐ విల్సన్, ఎస్ఐ మదీనా భాషా తెలిపారు. మృతదేహాలకు ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

జగన్ ఫ్లెక్సీ ముందు మూగజీవి బలి ఘటనలో ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి- నల్లజర్ల

తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం చోడవరంలో శుక్రవారం రాత్రి వైఎస్‌జగన్ ఫ్లెక్సీ ముందు మేకపోతును బలి ఇచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన కేసులో ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వైద్య పరీక్షల నిమిత్తం నిందితులను నల్లజర్ల పోలీస్‌స్టేషన్ నుంచి బస్టాండ్ మీదుగా పురవీధుల గుండా నడిపించుకుంటూ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం స్టేషన్‌కు తరలించారు. జగన్ ఫ్లెక్సీ ముందు మేకపోతును బలి ఇచ్చి..ఆ రక్తంతో ఫ్లెక్సీకి అభిషేకం చేశారు. ఈ తంతూ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చోడవరం గ్రామానికి పోలీసులు చేరుకుని నిందితులను శనివారం అరెస్టు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

పిన్నెల్లితో వైసిపి నేతల ములాఖత్

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

ప్రభుత్వం దిగజారిపోతోందని, వైసిపి నేతలను అకారణంగా అరెస్ట్ చేస్తున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న మాజీ ఎంఎల్ఎ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డితో తాడిపత్రి మాజీ ఎంఎల్ఎ కేతిరెడ్డి పెద్దారెడ్డి, ధర్మవరం మాజీ ఎంఎల్ఎ కేతిరెడ్డి వెంకటరామిరెడ్డితో కలిసి ములాఖాత్ అయ్యారు. అనంతరం జైలు బయట మీడియాతో కాకాణి మాట్లాడారు. పిన్నెల్లి సోదరులను ఆధారం లేని కేసులో ఇరికించి, చంద్రబాబు ఆనందం పొందుతున్నారని విమర్శించారు. జగన్‌మోహన్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక ఆయనను నమ్మిన వ్యక్తులపై, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించి, చంద్రబాబు భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పిన్నెల్లి సోదరులు న్యాయస్థానాలపై నమ్మకంతో ధైర్యంగా న్యాయపోరాడేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, పెద్దారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం వైసిపి నాయకులను జైలుకు పంపడం తప్ప, మరేమీ చేయలేదని పేర్కొన్నారు. 18 నెలల టిడిపి కూటమి పాలనంతా అక్రమ కేసులు, అక్రమ నిబంధనలతో నడుస్తోందని విమర్శించారు.

క్షమాపణ కోరిన నటుడు శివాజీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహిళా కమిషన్ ఎదుట నటుడు శివాజీ క్షమాపణ చెప్పారు. దండోరా సినిమా ప్రమోషన్ సందర్భంగా నటీమణులపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో శనివారం మహిళా కమిషన్ విచారణకు పిలిచింది. ఈ క్రమంలో శనివారం ఉదయం 11 గంటలకు కమిషన్ ఎదుట శివాజీ హాజరయ్యారు. విచారణ సందర్భంగా ఆయన తన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పారు. తన తప్పును అంగీకరించారు. ఈ సందర్భంగా మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ నేరెళ్ళ శారద అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక పోయారు. తన వ్యాఖ్యలను పూర్తిగా వెనక్కి తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇక నుంచి మహిళల గురించి మాట్లాడేటప్పుడు మర్యాదగా మాట్లాడుతానని, కమిషన్ సూచనల మేరకు నడుచుకుంటానని హామీ ఇచ్చారు. మహిళల దుస్తులే కారణమని చెబితే, చిన్నారులు, వృద్ధ మహిళలపై జరుగుతున్న వేధింపులకు కారణమేంటని కమిషన్ ఛైర్ పర్సన్ ప్రశ్నించినట్టు సమాచారం. కాస్టింగ్ కౌచ్ గురించి స్పందించాల్సిన బాధ్యత మీకు లేదా? అని ప్రశ్నించారు. సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షిస్తూ, మహిళల గౌరవం , హక్కులను కాపాడేందుకు మహిళా కమిషన్ కట్టుబడి ఉందని తెలిపారు.

పదకొండేళ్ల మనోవేదన

- రైతు రామారావు మరణం వెనుక ఆవేదన, ఆందోళన
- ఒత్తిడి మరింత పెంచిన రెండోదశ పూలింగు
- మందడం మధ్యలో రోడ్డుపై ఆగ్రహం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతుల్లో ఇప్పటికీ ఆవేదన, ఆందోళన వ్యక్తమవుతూనే ఉన్నాయి. మందడంలో రోడ్డు నిర్మాణం కోసం జరిగిన చర్చ సందర్భంగా అక్కడి రైతు దొండపాటి రామారావు మరణం ఇదే విషయాన్ని వ్యక్తం చేస్తోంది. రైతులు బయటకు చెప్పకపోయినా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. 11 ఏళ్లుగా ఎటువంటి అభివృద్ధి జరగలేదని, ఇచ్చిన ప్లాట్లు కూడా ఎక్కడున్నాయో తెలియదని రైతులు చెబుతున్నారు. శుక్రవారం గుండెపోటుతో మరణించిన రామారావు ప్లాట్లు వాగులో ఉన్నాయని ఆయన తెలిపారు. సిఆర్‌డిఎ అధికారులు మాత్రం లోతట్టులో ఉండవని తెలిపారు. దీంతోపాటు వాస్తవంగా మందడం గ్రామానికి నాలుగువైపులా విశాలమైన రోడ్లు మాస్టర్‌ప్లాను ప్రకారం వేస్తున్నారు. ఇప్పటికీ జనాభా లేకపోయినా మాస్టర్‌ప్లాను ప్రకారం గ్రామం మధ్యలో నుండి వెళ్లే రోడ్డును కూడా వేయాలని నిర్ణయించారు. దీనిపై గతంలో రూపొందించిన ప్లానులో నాలుగు ఆలయాలు తొలగించాల్సి వస్తుంది. దీనిపై తొలుత అభ్యంతరం రావడంతో రెండోప్లానులో ఆలయాలను మినహాయించారు. దీనిలో మరణించిన రామారావుకు చెందిన రెండు నివాసాలూ పోతాయి. కొద్దికాలంగా దీనిపై ఆయన మనోవేదనకు గురవుతున్నారు. ఒకవేళ ఇళ్లు తీసుకోవాలనుకుంటే తమ గ్రామ పరిధిలోనే నీటి సదుపాయం ఉన్న ప్రాంతంలో ప్లాట్లు వేసి ఇస్తే అందరం ఒకేసారి అక్కడకు వెళ్లి ఇళ్లు నిర్మించుకుంటామని తెలిపారు. ప్రభుత్వం రెండుచోట్ల ప్లాట్లు చూపించింది. అవి రెండు కూడా లోతట్టు ప్రాంతంలో ఉన్నాయి. ఒకటి మెట్ట ప్రాంతంలో ఉంది. ఇదే అంశాన్ని రామారావు ప్రస్తావించారు. తమకు తాళ్లాయపాలెం పరిధిలో ఇవ్వాలని కోరారు. వేదికపై తన అభిప్రాయం చెప్పి వచ్చి కూర్చుని అక్కడే కుప్పకూలిపోయారు.

ప్రభుత్వం తీరుపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. రైతు సమస్యలపై ఏర్పాటు చేసిన త్రీమెన్ కమిటీ ఇప్పటికీ ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదని ఆగ్రహంతో ఉన్నారు. 11 ఏళ్ల నుండి కనీస అభివృద్ధి కనిపించలేదు. నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం లేదు. లోన్లు మంజూరు చేయడం లేదు. గ్రామాల్లో కనీస సదుపాయాల కల్పన లేదు. ప్రభుత్వ పనులు తప్ప రైతులకు సంబంధించిన ప్లాట్ల సమస్యగానీ, లంక భూముల సమస్యగానీ పరిష్కారానికి నోచలేదు. రెండురోజుల క్రితమే దీనిపై రైతు జెఎసి చర్చించింది. అమరావతి రైతుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే భావన మరింత బలపడుతోంది. మందడం గ్రామం చుట్టూ పెద్దపెద్ద రోడ్లను నిర్మిస్తున్నా ఇళ్లను తొలగించి మరో రోడ్డు వేయాల్సిన అవసరం ఏమిటనేది వారి ప్రశ్నగా ఉంది. ఆ రోడ్డును వినియోగించుకునే జనాభా ఇప్పుడే రారని, అంత తొందర ఎందుకనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు రాజధాని కోసం రెండోదశ పూలింగుకు వెళతామని ప్రభుత్వం ప్రకటించినప్పటి నుండి రైతుల్లో ఆందోళన తీవ్రమైంది.

రసవత్తరంగా జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు



బండ లాగుతున్న వృషభరాజులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతులను, ఒంగోలు జాతి పశు పోషకులను ప్రోత్సహించేందుకే అఖిల భారత స్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నామని నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు శనివారం మూడవ రోజుకు చేరుకున్నాయి. నాలుగు పళ్ల విభాగంలో పోటీలను ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జాన్‌సైదా ప్రారంభించారు. ఆద్యంతం రసవత్తరంగా సాగిన పోటీలను తిలకించేందుకు పలు ప్రాంతాల రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. విజేతగా బాపట్ల జిల్లా జె.పంగులూరు గ్రామానికి చెందిన గొట్టిపాటి రవికుమార్-చిలుకూరి నాగేశ్వరరావు, జవ్వాజి మేఘనాథ్ నాయుడు కంబైన్డ్ విజేతగా నిలవగా, రెండో స్థానాన్ని కడప జిల్లా చెన్నూరుకు చెందిన గుమ్మల సాయికుమార్‌రెడ్డి ఎడ్లు దక్కించుకున్నాయి. ఆరుపళ్ల విభాగంలో కృష్ణాజిల్లా పెనమలూరు మండలం యనమలకుదురుకు చెందిన అనంతనేని శ్రీకావ్య, శ్రీమధుకి చెందిన ఎడ్లు విజయం సాధించగా, రెండో స్థానంలో పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య జత నిలిచాయి. విజయం సాధించిన ఎడ్ల జతల యజమానులకు బహుమతులు ప్రదానం చేయడంతోపాటు సత్కరించారు.

సెకండరీ, బోధన ఆస్పత్రులకు 784 మంది వైద్యులు

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సెకండరీ, బోధన ఆస్పత్రులకు కొత్తగా 784 మంది పిజి వైద్యులు(సీనియర్ రెసిడెంట్సు) జనవరి 1 నుంచి రాబోతున్నారని వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. వీరి రాకతో పేదలకు వైద్య సేవలు మరింత చేరువ కాబోతున్నాయని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 విద్యాసంవత్సరంలో పిజి వైద్య విద్యలో కన్వీనర్ కోటా కింద చేరి చదువు పూర్తిచేసిన వారికి ప్రాంతీయ, సామాజిక, జిల్లా, బోధనాస్పత్రుల్లో పోస్టింగులు ఇవ్వబోతున్నామని పేర్కొన్నారు.ఆప్షన్ల నమోదు ప్రారంభమైందని, ఈ నెల 29వ తేది సాయంత్రం 5 గంటలకు వరకు ఇది కొనసాగుతోందని వెల్లడించారు. పోస్టింగులు పొందిన వారు జనవరి 5వ తేదిలోపు విధుల్లో చేరాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. స్పెషాల్టీల వారీగా వీరి సేవలను సదరు ఆస్పత్రుల్లో అవసరాలకు తగ్గట్లు పొందేందుకు వీలుగా జాబితాలు రూపొందించామని తెలిపారు. ఖాళీలతో సంబంధం లేకుండా ఇకపై ప్రతి ఏటా సీనియర్ రెసిడెంట్సు సేవలు ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. 784 మంది పిజి వైద్యులు ఆరు నెలలు బోధనాస్పత్రుల్లో, మరో ఆరు నెలలు సెకండరీ ఆస్పత్రుల్లో తప్పకుండా పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఏడాదిపాటు సర్వీస్ చేయకపోతే రూ.40లక్షల వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని వైద్య విద్య డైరెక్టర్ రఘునందన్ తెలిపారు.

అండర్-19 కెప్టెన్‌గా వైభవ్ సూర్యవంశీ

దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్, ప్రపంచకప్‌లకు జట్లను ప్రకటించిన బిసిసిఐ



ముంబయి: వచ్చే ఏడాది జరిగే ఐసిసి అండర్-19 వన్డే ప్రపంచకప్‌తోపాటు దక్షిణాఫ్రికాతో జరిగే మూడు వన్డేల సిరీస్‌లకు జట్టును భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) ప్రకటించింది. వన్డే ప్రపంచకప్‌కు ముందు భారత అండర్-19 జట్టు దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌కు 14ఏళ్ల వైభవ్ రఘువంశీ సారథ్యం వహించనున్నట్లు బిసిసిఐ ప్రకటించింది. రెగ్యులర్ కెప్టెన్ ఆయుష్ మాత్రే భుజం నొప్పి కారణంగా ఈ సిరీస్‌కు దూరంగా కావడంతో అతనికి సారథ్య బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తాజా ప్రకటనలో పేర్కొంది. ఇక ఐసిసి అండర్-19 వన్డే ప్రపంచకప్‌కు ఆయుష్ మాత్రేతోపాటు విహాన్ మల్హోత్రా కూడా ఎంపిక చేసిన బిసిసిఐ వారిద్దరూ ఫిట్‌నెస్ సాధిస్తేనే జట్టుతో కలవనున్నట్లు తెలిపింది. వీరిద్దరూ ప్రస్తుతం బిసిసిఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ కోసం కసరత్తు చేస్తున్నారు. వీరు ఫిట్‌నెస్ సాధించిన వెంటనే భారతజట్టుతో కలవనున్నారు. ఇక ఐసిసి అండర్-19 వన్డే ప్రపంచకప్ జనవరి 15నుంచి దక్షిణాఫ్రికా వేదికగా ప్రారంభం కానుంది. ఈ టోర్నీకి ముందు భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య విల్లోమూర్ పార్క్‌లో 3, 5, 7 తేదీల్లో మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్‌లో తలపడనుంది. అండర్-19 వన్డే ప్రపంచకప్‌కు ముందు భారతజట్టుకు ఇది సన్నాహకంగా ఉపయోగపడనున్నట్లు బిసిసిఐ ఆ ప్రకటనలో తెలిపింది.

దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు భారత అండర్-19 జట్టు: వైభవ్ సూర్యవంశీ(కెప్టెన్), ఆరోన్ జార్జ్(వైస్ కెప్టెన్, త్రివేది, అభిజ్ఞాన్ కుందు, హర్‌వర్ష్ సింగ్(వికెట్ కీపర్లు), అంబ్రీష్, కౌశిక్ చౌహాన్, కిలాన్ పటేల్, మహ్మద్ ఇనాన్, హేనిల్ పటేల్, దీపేశ్, కిషన్ కుమార్ సింగ్, ఉధాన్ మోహన్, యువ్‌రాజ్ గోహిల్, రాహుల్ కుమార్.

వన్డే ప్రపంచకప్‌కు భారత అండర్-19 జట్టు: ఆయుష్ మాత్రే(కెప్టెన్), విహాన్ మల్హోత్రా(వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, ఆరోన్ జార్జ్, వేదాంత్ త్రివేది, అభిజ్ఞాన్ కుందు, హర్వాన్ష్ సింగ్, ఆర్.ఎస్. అంబరీశ్, కాన్షిక్ చౌహాన్, ఖిలాన్ పటేల్, మహ్మద్ ఎనాన్, హెనిల్ పటేల్, దీపేశ్ దేవేంద్రన్, కిషన్ కుమార్ సింగ్, ఉదవ్ మోహన్.

మైదానంలోనే ప్రాణాలు విడిచిన బంగ్లాదేశ్ సహాయ కోచ్ మృతి



ఢాకా: క్రికెట్ మైదానంలో పెను విషాదం చోటు చేసుకుంది. బంగ్లాదేశ్ ప్రిమియర్ లీగ్(బిపిఎల్)లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు అసిస్టెంట్ కోచ్ మహబూబ్ అలీ జకీ(50) మైదానంలో ఉన్నట్టుండి కుప్పకూలి మృతిచెందారు. శనివారం ఢాకా క్యాపిటల్స్‌కు ఇది తొలి మ్యాచ్. సిల్హెట్ అంతర్జాతీయ మైదానంలో మ్యాచ్‌కు ముందు మహబూబ్ అలీ జకీ పిచ్ వద్దకు వెళ్లి పరిశీలించిన ఆయన.. మ్యాచ్ చూస్తూ కిందపడిపోయారు. అలీ అలా పడిపోవడం చూసిన సహాయ సిబ్బంది, వైద్య బృందం వెంటనే కార్డియోపల్మోనరీ రిసాసిటేషన్ (సిపిఆర్) ఆయన ప్రాణాలను కాపాడేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. అయినా ఆయన శరీరంలో చలనలేకపోవడంతో హుడాహుటిన అంబులెన్స్‌లో సమీపం లోని ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అలీ చనిపోయాడని వైద్యులు తెలిపారు. ఈ వార్తను బంగ్లాదేశ్ క్రికెట్‌బోర్డు చీఫ్ ఫిజీషియన్ డెబాశిష్ చౌదరి తెలిపారు. గతంలో అలీకి ఎటువంటి అనారోగ్య సమస్యలు లేవని, ఆయన మరణం అందరినీ షాక్‌కు గురి చేసిందని దేబశిష్ తెలిపారు. మాజీ పేసర్ అయిన మహబూబ్ అలీ అంతర్జాతీయ క్రికెట్ కు వీడ్కోలు పలికిన అనంతరం 2008నుంచి హై పెర్ఫార్మెన్స్ కోచ్‌గా బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డులో సేవలందిస్తున్నారు. ఆయన మృతికి బంగ్లాదేశ్ క్రికెట్‌బోర్డు సంతాపం తెలిపింది.

మైనార్టీలపై దాడులు దుర్మార్గం

- తీవ్రంగా ఖండించిన సిపిఎం పొలిట్‌బ్యూరో
- ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటం

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ – న్యూఢిల్లీ

దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకలను అడ్డుకొని బజరంగ్ దళ్ వంటి హిందుత్వ మతోన్మాద సంస్థలు క్రైస్తవులపై క్రూరమైన దాడులకు పాల్పడటాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. మైనార్టీలపై జరుగుతున్న ఈ దాడులను ప్రభుత్వ యంత్రాంగం ఉద్దేశ్యపూర్వకంగానే చూసీచూడనట్లు వదిలేసి దాడులను ప్రోత్సహించిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. లౌకిక దేశాన్ని నాశనం చేసి దాని స్థానంలో 'హిందూ రాష్ట్ర' ఏర్పాటు చేయాలనే కుట్రతో ఆర్‌ఎస్‌ఎస్ – బిజెపి కొనసాగిస్తున్న దుర్మార్గమైన విధానాల్లో భాగంగానే ఈ దాడులు జరుగుతున్నాయని సిపిఎం పేర్కొంది. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రభుత్వ యంత్రాంగం ఆ రాజ్యాంగ విలువలను పాటించాలని హితవు పలికింది. మైనార్టీలపై దాడులకు పాల్పడినవారిని తక్షణమే చట్టం ముందు నిలబెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. న్యూఢిల్లీలో ఈ నెల 26న సిపిఎం పొలిట్‌బ్యూరో సమావేశమైంది. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై ఒక ప్రకటన విడుదల చేసింది. ఆ వివరాలు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) స్థానంలో అందులోని ఉపాధి భరోసాను పూర్తిగా తొలగించేలా చాలా బలహీనమైన వికసిత భారత్ గ్రామీణ ఉపాధి, జీవనోపాధుల హామీ పథకం (విబి జి ఆర్‌ఎంజి) తీసుకొచ్చిందని సిపిఎం విమర్శించింది. ఉపాధి హామీ పథకంలో అత్యంత ప్రాథమికమైన డిమాండ్, హక్కుల ఆధారిత లక్షణాన్ని విబిజి ఆర్‌ఎంజి తొలగించిందని పేర్కొంది. కొత్త పథకం అమలు విషయంలో రాష్ట్రాల అభిప్రాయాలను కేంద్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించిందని, పైగా ఆర్థిక భారాన్ని మొత్తం రాష్ట్రాలపైకి నెట్టేసిందని సిపిఎం తెలిపింది. పార్లమెంటులో సంఖ్యాబలంతో బిల్లును ఆమోదింపజేసుకొని..దేశవ్యాప్తంగా కోట్లాది మంది నిరుపేద గ్రామీణ కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసిందని విమర్శించింది. పేదల ఉపాధిని దెబ్బతీస్తున్న ఈ దుర్మార్గమైన మార్పులను వ్యతిరేకిస్తూ అనేక సంఘాలు చేస్తున్న పోరాటాలకు తమ సంపూర్ణ మద్దతు కొనసాగించడమే గాక రాబోయే రోజుల్లో ఈ పోరాటాలను మరింత బలోపేతం చేసేందుకు కలిసి కృషి చేస్తామని తెలిపింది.

క్రోనీ పెట్టుబడిదారులకు బహుమతిగా లేబర్ కోడ్‌లు

శ్రామిక వర్గ వ్యతిరేక విధానాల్లో భాగంగా బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌ల రూపంలో మరో వినాశకర దాడికి పాల్పడిందని సిపిఎం ఆగ్రహం వ్యక్తం చేసింది. కార్మికుల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వచ్చినా కూడా అదేమీ పట్టించుకోకుండా లేబర్ కోడ్‌లను అమల్లోకి తీసుకొస్తూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసిందని పేర్కొంది. కార్మిక చట్టాల సంస్కరణలుగా చెబుతున్న ఈ లేబర్ కోడ్‌లు వాస్తవానికి ప్రస్తుత ప్రభుత్వానికి సన్నిహితంగా ఉన్న క్రోనీ పెట్టుబడిదారులకు బహుమతి అని విమర్శించింది. ఈ మార్పులను వ్యతిరేకిస్తూ దేశంలోని కార్మిక వర్గం ఇప్పటికే నిరసనలను కొనసాగిస్తోందని, ఈ పోరాటాలకు సిపిఎం మద్దతు ఇవ్వడంతో పాటు క్రియాశీలకంగా పాల్గొంటోందని తెలిపింది.

న్యాయ వ్యవస్థకు మాయని మచ్చ

ఉన్నావో అత్యాచారం కేసు : అభంశుభం తెలియని బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన బిజెపి మాజీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్‌కు ఢిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరు చేయడం న్యాయవ్యవస్థకు మాయని మచ్చగా నిలిచిపోతుందని సిపిఎం పేర్కొంది. ఈ కేసులో సాక్ష్యాలను ప్రభావితం చేసేందుకు బాధిత బాలికతో పాటు సాక్షులపై ఇప్పటికే అనేక రకాలుగా హింసాత్మక దాడులు, బెదిరింపు ప్రయత్నాలు జరిగాయని పేర్కొంది. బాధిత బాలిక తండ్రి కస్టోడియల్ డెత్ కేసులోనూ సెంగార్ నిందితుడిగా ఉన్నాడని సిపిఎం గుర్తు చేసింది. అత్యంత తీవ్రమైన ఈ నేరాలకు సంబంధించిన వాస్తవాలను.. బెయిల్ మంజూరు సమయంలో పరిగణనలోకి తీసుకోకపోవడంలో న్యాయస్థానం విఫలం కావడం దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. సాంకేతిక కారణాల వల్ల ప్రస్తుతానికి అతడు విడుదల కాకపోయినా...కోర్టు ఇచ్చిన ఈ ఉత్తర్వులు న్యాయవ్యవస్థపై మాయని మచ్చగా నిలిచిపోతాయని పేర్కొంది. న్యాయం కోసం పోరాడే బాధితులకు న్యాయవ్యవస్థపై విశ్వాసం సన్నగిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు, దళితులు, ఆదివాసీలకు వ్యతిరేకంగా హింసాత్మక దాడులు ఏటికేడు పెరుగుతూవస్తున్నాయని, ప్రత్యేకించి బిజెపి పాలిత రాష్ట్రాల్లో మరింత దారుణ పరిస్థితులు నెలకొన్నాయని సిపిఎం పేర్కొంది. దాడులకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలం కావడం నేరగాళ్లకు పరోక్షంగా మద్దతు ఇచ్చినట్టేనని, బిజెపి ప్రభుత్వాలు అనుసరిస్తున్న దుర్మార్గమైన ఈ వైఖరి కారణంగానే అణగారిన ప్రజల పట్ల దాడులకు పాల్పడుతున్న దుండగులు మరింతగా రెచ్చిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుత పాలకవర్గం యొక్క మహిళా వ్యతిరేక, దళిత వ్యతిరేక మనువాద మనస్తత్వానికి ఈ దాడులు అద్దం పడుతున్నాయని పేర్కొంది.

బంగ్లాదేశ్‌లో ఆందోళనకర పరిస్థితులు

బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితుల పట్ల సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మత మైనార్టీలపై జరుగుతున్న దాడులను నిలువరించడంలో అక్కడి తాత్కాలిక ప్రభుత్వం విఫలమవుతోందని, ఛాందసవాద శక్తులను అదుపు చేయలేకపోయిందని పేర్కొంది. హిందూ యువకుడిని సజీవ దహనం చేయడంతో సహా ఇటీవలి హింసాత్మక ఘటనలు, సాంస్కృతిక సంస్థలపైనా, మీడియాపైనా దాడులు తీవ్ర ఖండనార్హమని సిపిఎం తెలిపింది. దేశ ఐక్యత, భద్రతకు ఇలాంటి పరిణామాలు ఏమాత్రం శ్రేయస్కరం కాబోవని పేర్కొంది. బంగ్లాదేశ్ ప్రజానీకం మత ఛాందస శక్తుల వ్యూహంలో చిక్కుకోకుండా 1971 నాటి విముక్తి పోరాట విలువలను పరిరక్షించుకునేందుకు ఐక్యంగా నిలబడాలని సిపిఎం ఆశాభావం వ్యక్తం చేసింది. విద్వేషక శక్తులను తక్షణమే అణిచివేసి మైనార్టీల హక్కులను బంగ్లాదేశ్ ప్రభుత్వం పరిరక్షించాలని డిమాండ్ చేసింది.

వెనిజులాపై అమెరికా దాడి

వెనిజులాకు వ్యతిరేకంగా అమెరికా సాగిస్తున్న బెదిరింపులను, సైనిక దాడులు చేపట్టేందుకు చేస్తున్న కుట్రలను సిపిఎం ఖండించింది. అమెరికా నూతన జాతీయ భద్రత వ్యూహం (యుఎస్ ఎన్‌ఎస్‌ఎస్)...గతంలో లాటిన్ అమెరికా ప్రాంతంపై జేమ్స్ మన్రో అనుసరించిన వినాశకర విధానాలను (మన్రో డాక్టరిన్) అమలుచేస్తామని సంకేతాలను ఇచ్చిందని తెలిపింది. వెనిజులా వంటి దేశాల సార్వభౌమాధికారంపై దాడి చేయడం, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం అమెరికా ఆధిపత్య ధోరణిని బహిర్గతం చేస్తోందని, ఇది ఐక్యరాజ్యసమితి ఒడంబడికను ఉల్లంఘించడమేనని పేర్కొంది. వెనిజులాతో పాటు లాటిన్ అమెరికా ప్రాంతంపై మొత్తంగా అమెరికా సాగిస్తున్న అధిపత్య విధానాలకు వ్యతిరేకంగా అన్ని ప్రగతిశీల, ప్రజాతంత్ర, దేశభక్తియుత శక్తులన్నీ ఐక్యంగా గళం వినిపించాలని సిపిఎం పిలుపునిచ్చింది.

నూతన సంవత్సర శుభాకాంక్షలు

దేశ ప్రజలకు సిపిఎం పొలిట్‌బ్యూరో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసింది. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, భారతదేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చేందుకు చేస్తున్న కుట్రలను ప్రజానీకం ఐక్య కృషితో తిప్పికొట్టాలని పిలుపునిచ్చింది.

త్రివేండ్రంలో కేంద్ర కమిటీ సమావేశం

సిపిఎం కేంద్ర కమిటీ తదుపరి సమావేశం 2026 జనవరి 16 నుంచి 18 వరకు కేరళలోని త్రివేండ్రంలో నిర్వహించనున్నట్లు తెలిపింది.

ఆరావళి విధ్వంసం



బిజెపి ప్రభుత్వం ఇటీవల ఆరావళి పర్వతశ్రేణులకు కొత్త నిర్వచనం ఇవ్వడం, దానిని సుప్రీంకోర్టు ఆమోదించడం ఈ పర్వతశ్రేణుల విధ్వంసాన్ని మరింత పెంచే విధంగా ఉందని ఆందోళనలు పెరుగుతున్నాయని సిపిఎం పేర్కొంది. ఇది అంతిమంగా ఆరావళి పర్వతాల్లో జీవావరణ సున్నితత్వాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఆరావళిలో ఖనిజ తవ్వకాలను చట్టబద్ధం చేయడం, రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు తీవ్రం చేయడం లక్ష్యంగా కేంద్రం తీసుకొచ్చిన మార్పులు ఈ పర్వత శ్రేణులను నాశనం చేయడమేగాక పర్వత సానువుల జీవావరణ వ్యవస్థ మొత్తాన్ని కకావికలం చేస్తాయని సిపిఎం ఆందోళన వ్యక్తం చేసింది. పర్యావరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం చేసిన వక్రీకరణ ఏమాత్రం విశ్వసనీయమైనది కాదని, ఆరావళి వాస్తవిక నిర్వచనాన్ని పునరుద్ధరించి.. కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ విధానంలో ప్రాథమిక మార్పులు చేయాల్సిందేనని, అప్పటి వరకు ఆరావళి పర్వతాలకు రక్షణ ఉండదని సిపిఎం పేర్కొంది.

అస్సాంలో దాడులు ఆందోళనకరం



అస్సాంలోని కర్బీ ఆంగ్లాంగ్ జిల్లాలో హింస చెలరేగి ఇద్దరు చనిపోవడం, ఆస్తులు ధ్వంసం కావడం పట్ల సిపిఎం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. స్థానిక తెగల మధ్య వైషమ్యాలు రాజేయడం వల్లే హింసాత్మక పరిస్థితులకు కారణమని పేర్కొంది. కేంద్రంలోనూ, అస్సాంలోనూ అధికారంలో ఉన్న 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం జాతుల మధ్య వైషమ్యాలను పెంచిపోషించి రాజకీయంగా లబ్ధి పొందేందుకు ప్రయత్నించిన ఫలితంగానే అక్కడ అభివృద్ధి తిరోగమన పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించింది. పర్యవసానంగా భూములను ఖాళీ చేయించి వెళ్లగొట్టడం వంటి వినాశకర విధానాలకు ఈ పరిణామాలు దారితీశాయని తెలిపింది.



ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ రద్దుకు వ్యతిరేకంగా 5 నుంచి దేశవ్యాప్త ఆందోళనలు

- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయం

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

గ్రామీణ ప్రజల జీవనోపాధిలో కీలక పాత్ర పోషించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) రద్దుకు వ్యతిరేకంగా జనవరి 5 నుంచి కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహించనుంది. ఈ మేరకు శనివారం నాడిక్కడ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం (ఇందిరా భవన్)లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ, తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రులు ఎ రేవంత్ రెడ్డి, సిద్ధా రామయ్య, సుఖ్‌వీందర్ సింగ్ సుఖ్, ప్రధాన కార్యదర్శులు కెసి వేణుగోపాల్, జైరాం రమేష్, సిడబ్ల్యుసి సభ్యులు పాల్గొన్నారు. కేరళ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపికి మద్దతుగా పని చేశారని విమర్శలు ఎదుర్కొంటున్న శశిథరూర్ కూడా ఈ సమావేశంలో పాల్గొనడం గమనార్హం. సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లికార్జున్ ఖర్గే మాట్లాడారు. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ రద్దుపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, దాని పరిణామాలను మోడీ ప్రభుత్వం ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా 'ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ బచావో అభియాన్'ను నిర్వహిస్తామని అన్నారు. విబి–జి ఆర్‌ఎఎం జి చట్టంతో రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని, రాష్ట్రాలు, రాజకీయ పార్టీలతో ఎలాంటి సంప్రదింపులు లేకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు.. 2015లో భూ సేకరణ చట్టానికి చేసిన సవరణలను వెనక్కి తీసుకున్నారని గుర్తు చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) తీవ్రమైన సమస్య అని, దేశ ప్రజల ప్రజాస్వామ్య హక్కులను పరిమితం చేయడానికి మోడీ ప్రభుత్వం నిర్ణయించిన ప్రణాళికాబద్ధమైన కుట్ర అని విమర్శించారు. బిజెపి, ఎన్నికల కమిషన్ కలిసి పన్నిన కుట్ర అని ధ్వజమెత్తారు. అత్యంత వెనుకబడిన తరగతులు, దళితులు, గిరిజనులు, మైనార్టీల పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించకుండా, ఇతర బూత్‌లకు బదిలీ చేయకూడదని సూచించారు. దీనికి కోసం బూత్ స్థాయి ఏజెంట్లు ఇంటింటికీ వెళ్లాలన్నారు. ఇడి, ఐటి, సిబిఐల దుర్వినియోగం జరుగుతోందని, నేషనల్ హెరాల్డ్ కేసులో న్యాయ పోరాటం కొనసాగుతోందన్నారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై జరుగుతున్న దాడులను ఆయన ఖండించారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధం ఉన్న సంస్థలు క్రిస్మస్ వేడుకలపై చేసిన దాడులు మత సామరస్యాన్ని దెబ్బతీశాయని, ప్రపంచ వ్యాప్తంగా దేశ ప్రతిష్టని దిగజార్చాయని విమర్శించారు.

రాష్ట్రాలు, పేదలపై విధ్వంసకర దాడి

మోడీ ప్రభుత్వం రాష్ట్రాలు, పేద ప్రజలపై నోట్ల రద్దు మాదిరిగానే విధ్వంసకర దాడికి పాల్పడిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రభుత్వ చర్యను కాంగ్రెస్ ప్రతిఘటిస్తుందని, ప్రతిపక్షాలు దీనికి మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. ప్రధాన మంత్రి తన మంత్రివర్గాన్ని సంప్రదించకుండా, ఎటువంటి అధ్యయనం చేయకుండానే సొంతంగా ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే నిర్ణయాన్ని తీసుకున్నారని విమర్శించారు. దేశంలో పాలన వన్ మ్యాన్ షోగా మారిపోయిందనడానికి ఇదే ఉదాహరణ అని స్పష్టం చేశారు.

క్రిస్మస్ వేడుకలపై విహెచ్‌పి దాడులు

- ఖండించిన అస్సాం క్రిస్టియన్ ఫోరమ్ (ఎసిఎఫ్)
- రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన బిజెపి ఎంపి దిలీప్ సైకియా

గౌహతి : క్రిస్మస్ వేడుకలపై విహెచ్‌పి దాడులను అస్సాం క్రిస్టియన్ ఫోరమ్ (ఎసిఎఫ్) ఖండిస్తూ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ దాడిలో ప్రమేయం ఉన్న నలుగురిని అరెస్టు చేసినందుకు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది. అయితే, భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఈ అన్యాయమైన చర్యను సమర్థించడాన్ని తీవ్రం గా వ్యతిరేకించింది. బుధవారం నాడు గౌహతికి 65 కిలోమీటర్ల దూరంలో ఉన్న నల్బరిలోని సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ స్కూల్‌లో విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్‌కు చెందిన సభ్యులు క్రిస్మస్ ఈవ్ వేడుకలకు అంతరాయం కలిగించి, అలంకరణలను ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే.. ఈ సంఘటన రాష్ట్రంలోని మైనారిటీ వర్గాలలో భయం, అభద్రతా భావాన్ని సృష్టించిందని ఎసిఎఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. మిగిలిన నిందితులను త్వరగా అరెస్టు చేయాలని కోరుతున్నామని ఫోరమ్ ప్రతినిధి అలెన్ బ్రూక్స్ ప్రకటనలో తెలిపారు. అయితే, అస్సాం బిజెపి అధ్యక్షుడు, లోక్‌సభ సభ్యుడు దిలీప్ సైకియా చేసిన వ్యాఖ్యలపై ఈ సంస్థ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. క్రైస్తవ సమాజం నిరంతర రెచ్చగొట్టే చర్యలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ మత మార్పిడుల గురించి నిరాధారమైన వాదనలు చేస్తూ, ఆయన ఈ విధ్వంసాన్ని సమర్థించడానికి ప్రయత్నిస్తున్నారని బ్రూక్స్ విమర్శించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 25, 26 పౌరులందరికీ మత స్వేచ్ఛను కల్పిస్తున్నాయని ఆయన గుర్తుచేసారు. సాంస్కృతిక పరిరక్షణ పేరుతో "మైనారిటీ వర్గాలను రెచ్చగొట్టేవారిగా చిత్రీకరించే, హింసను సమర్థించే" ఎలాంటి చర్యనైనా తిరస్కరిస్తున్నామని ఆ సంస్థ ప్రకటనలో తెలిపింది.

వెరీపూర్ కేటగిరీలోనే గాలి నాణ్యతలు

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యతలు క్షీణించాయి. శనివారం ఉదయం ఢిల్లీలో ఎక్యూఐ స్థాయిలు 300 వద్ద నమోదైంది. దీంతో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి 'వెరీ పూర్' కేటగిరీలో నమోదుచేసింది. శనివారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కమ్మేయ డంతో రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిం ది.. మరోవైపు వాయుకాలుష్యం తీవ్రమైన స్థాయిలో ఉండడంతో ఢిల్లీ వాసులు శ్వాసకోశ సమస్యలతో అనారోగ్యం పాలవుతున్నారు. ఆనంద్ విహార్ ప్రాంతంలో తీవ్ర ప్రమాదకర స్థాయిలోనే ఎక్యూఐ స్థాయిలు నమోదయ్యాయి. ఈ ప్రాంతంలో 314 వద్ద ఎక్యూఐ స్థాయిలు నమోదైనట్లు సిపిసిబి పేర్కొంది.

మోడీని, ఆర్‌ఎస్‌ఎస్‌ని ప్రశంసించిన కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్

న్యూఢిల్లీ : వాయినాడ్ ఎంపి ప్రియాంకా గాంధీ పార్లమెంట్ సమావేశాల అనంతరం ప్రధాని మోడితో టీ పార్టీకి హాజరుకావడం పెద్ద దుమారం రేపిన సంగతి తెలిసిందే. తాజాగా కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ ప్రధాని మోడీని, ఆయన వెనుకున్న ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రశంసిస్తూ శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సమావేశం జరుగుతున్న వేళ దిగ్విజయ్ సింగ్ చేసిన ఈ పోస్టు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. దిగ్విజయ్ పోస్టు చేసిన ఫోటోలో.. బీజేపీ నేత ఎల్కే అద్వానీతో పాటు మోడీ కూడా ఉన్నారు. అద్వానీ కుర్చీలో కూర్చుంటే.. ఆయన ముందు నేలపై మోడీ కూర్చున్నారు. బ్లాక్ అండ్ వైట్‌లో ఉన్న ఆ ఫోటోను దిగ్విజయ్ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌లో తాను ఖోరా సైట్‌లో ఆసక్తికరమైన ఫోటోని కనుగొన్నానని, అట్టడుగు స్థాయిలో పనిచేసే ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, జన్ సంఘ్ నేతలు ఫోటోలో ఉన్నారని, నేలపై కూర్చున్న వ్యక్తి ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి అయ్యారని ఇది ఆ సంస్థ శక్తి అని, జై సియా రామ్ అంటూ దిగ్విజయ్ సింగ్ పోస్టు చేశారు. అయితే ఆ ఫోటోను 1996లో తీసినట్లు తెలుస్తోంది. గుజరాత్ సీఎంగా శంకర్ సింఘ్ వాఘేలా ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో ఆ ఫోటో తీసినట్లు భావిస్తున్నారు.

ఢిల్లీ పోలీసులు భారీ ఆపరేషన్ 900 మందికి పైగా అరెస్టు

- న్యూఇయర్ వేడుకలకు ముందు అదుపులోకి
- ఆయుధాలు, మాదకద్రవ్యాలు స్వాధీనం

న్యూఢిల్లీ : నూతన సంవత్సర వేడుకలకు ముందు ఢిల్లీలో ఆఘాట్ 3.0 పేరుతో నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో ఢిల్లీ పోలీసులు 966 మందిని అరెస్టు చేశారు. వారి నుండి ఆయుధాలు, మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం, వాహనాలను స్వాధీనం చేసుకున్నామని శనివారం పోలీసులు వెల్లడించారు. న్యూఇయర్ వేడుకల సందర్భంగా నేరాలు, నేరస్తుల కార్యకలాపాలను అరికట్టడానికి ముందస్తు చర్యగా పోలీసులు ఈ ఆపరేషన్‌ను నిర్వహించారు. ఢిల్లీ ఎక్సైజ్ చట్టం, ఎన్‌డిపిఎస్ చట్టం కింద మొత్తం 331 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రజా జూదం చట్టం ప్రకారం, వివిధ నివారణ నిబంధనల కింద 504 మందిని, చెడుప్రవర్తన కలిగిన 116 మందిని, ఐదుగురు ఆటో లిఫ్టర్లను, నలుగురు ప్రకటిత నేరస్తులను అరెస్టు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. కాగా, ఆఘాట్ ఆపరేషన్‌లో ఆయుధ చట్టం కింద 21 దేశీయంగా తయారు చేసిన తుపాకులు, 20 లైవ్ కార్ట్రిడ్జ్‌లు, 27 కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 12,258 క్వార్టర్ల అక్రమ మద్యాన్ని కూడా స్వాధీనం చేసుకు న్నారు. 6.01 కేజీల గంజాయి, జూదగాళ్ల నుండి 2.36 లక్షల డబ్బును, 310 మొబైల్ ఫోన్లను, ఆరు ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు ప్రకటించారు. అదనంగా ఢిల్లీ పోలీసు చట్టం కింద 1,306 మందిపై చర్యలు తీసుకున్నారు. నిబంధనల్ని అతిక్రమించిన 231 ద్విచక్రవాహా నాలను సైతం స్వాధీనం చేసుకున్నా రు.

తీవ్రంగా చలిగాలులు... దట్టమైన పొగమంచు

- ఉత్తర భారతానికి ఐఎండీ హెచ్చరిక

న్యూఢిల్లీ : దేశంలోని ఉత్తర, తూర్పు, మధ్య ప్రాంతాలలోని అనేక రాష్ట్రాలలో చలిగాలుల ప్రభావం అధికంగా ఉంటుందని, పొగమంచు దట్టంగా కమ్ముకుంటుందని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) శనివారం హెచ్చరికలు జారీ చేసింది. దీని ఫలితంగా రోడ్డు, రైలు, విమాన ప్రయాణాలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. జార్ఖండ్, బీహార్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో పగటి వేళలలో కూడా చలిగాలులు వీస్తాయి. ఉత్తరద్రేశ్‌లోని తూర్పు ప్రాంతాలలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుంది. దట్టమైన పొగమంచు, మబ్బుల కారణంగా పగటి వేళ కూడా చల్లగా ఉంటుంది. తూర్పు ఉత్తరప్రదేశ్, బీహార్‌కు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. పశ్చిమ ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా, చండీఘర్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్‌కు ఆరంజ్ అలర్ట్ జారీ చేశారు. హిమాలయ పర్వత శ్రేణికి సమీపంలో ఉన్న ప్రాంతాలైన పశ్చిమ బెంగాల్, సిక్కిం, ఒడిషా సహా ఈశాన్య భారతంలోని కొన్ని ప్రాంతాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర, ఒడిషా, పశ్చిమ బెంగాల్, ఉత్తరాఖండ్‌లో దట్టమైన పొగమంచు అలముకుంటుందని ఐఎండి ప్రకటించింది.

సరిహద్దు నిబంధనలు కఠినతరం

- పౌరులు కాని వారందరికీ బయోమెట్రిక్ తప్పనిసరి చేసిన అమెరికా

వాషింగ్టన్ : గ్రీన్ కార్డులు ఉన్న వారు సహా అమెరికా పౌరులు కాని వారందరికీ సరిహద్దు నిబంధనలను ట్రంప్ ప్రభుత్వం కఠినతరం చేసింది. శుక్రవారం అమలులోకి వచ్చిన నూతన ఇమ్మిగ్రేషన్–పర్యాటక నిబంధనల ప్రకారం సరిహద్దును దాటే ప్రతి చోటా విదేశీయులు విధిగా బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుంది. విమానాశ్రయాలు, భూ సరిహద్దులు, ఓడరేవుల ద్వారా అమెరికాలో ప్రవేశించే లేదా అక్కడి నుంచి నిష్క్రమించే పర్యాటకులందరికీ ఈ నిబంధన వర్తిస్తుంది. అంటే ప్రతి ప్రవేశ, నిష్క్రమణ పాయింట్ వద్ద ప్రభుత్వ బయోమెట్రిక్ పర్యవేక్షణ ఉంటుంది.

ఏం చేస్తారు?

నూతన నిబంధనల ప్రకారం అమెరికా పౌరులు కాని వారు ఎవరైనా దేశంలో ప్రవేశించినా లేదా దేశం విడిచి వెళ్లినా ఆయా పాయింట్ల వద్ద కస్టమ్స్–సరిహద్దు రక్షణ అధికారులు వారి ఫొటోలు తీస్తారు. అన్ని వయసుల వారికీ...అంటే 14 సంవత్సరాల లోపు వారికి, అలాగే 79 సంవత్సరాల దాటిన వారికి...ఈ నిబంధన వర్తిస్తుంది. గతంలో వీరిని బయోమెట్రిక్ నిబంధనల నుంచి మినహాయించారు. పర్యాటకుల పరిశీలన సేవలో భాగంగా అధికారులు వేలిముద్రలు, ఐరిస్ స్కాన్ కూడా తీసుకుంటారు. వాటిని పర్యాటక–ఇమ్మిగ్రేషన్ రికార్డులతో సరిపోల్చుతారు.

గ్రీన్ కార్డులు ఉంటే...

గ్రీన్ కార్డులు ఉన్న వారికి ప్రతి సరిహద్దు క్రాసింగ్ వద్ద బయోమెట్రిక్ తనిఖీలు ఉంటాయి. ఇమ్మిగ్రేషన్ అధికారులు వారిపై ప్రశ్నల వర్షం కురిపిస్తారు. గతంలో జరిపిన పర్యటనల చరిత్రలను నిశితంగా పరిశీలిస్తారు. ప్రాసెసింగ్ ప్రక్రియకు చాలా సమయం పడుతుందని అధికారులు హెచ్చరించారు. పర్యాటకులు తమ వద్ద అవసరమైన అన్ని పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఆఫ్ఘనిస్తాన్, హైతీ, ఇరాన్, సోమాలియా, సూడాన్, వెనిజులా, యెమన్ సహా 19 దేశాల పౌరులకు జారీ చేసిన గ్రీన్ కార్డులను నఖశిఖపర్యంతం తనిఖీ చేస్తారు. ఈ దేశాల వారికి అదనపు ప్రశ్నలు సంధిస్తారు. కాబట్టి మరింత జాప్యం జరగవచ్చు. ముఖ్యంగా ఇమ్మిగ్రేషన్ లేదా పర్యటనకు సంబంధించిన దరఖాస్తులు పెండింగులో ఉంటే తీవ్ర జాప్యం ఏర్పడుతుంది.

ఏం చేయాలంటే...

అమెరికా పౌరులు కాని వారు సరిహద్దు ప్రక్రియల నిమిత్తం అదనపు సమయం అందుబాటులో ఉండేలా చూసుకోవాల్సి ఉంటుందని అధికారులు సూచించారు. ఇమ్మిగ్రేషన్ అధికారులు ఇచ్చే సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. ఏదైనా సమస్య ఉంటే న్యాయ సలహా తీసుకోవాలి.

గ్రీన్ కార్డులు ఉన్న వారు...ముఖ్యంగా పైన తెలిపిన దేశాల వారు...తమ పత్రాలను తాజా పరచుకోవాల్సి ఉంటుంది. అదనపు తనిఖీలకు వారు సిద్ధంగా ఉండాలి. మూడు నుంచి ఐదు సంవత్సరాల వరకూ బయోమెట్రిక్ పద్ధతి అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు. ముందుగా విమానాశ్రయాలలో, ఆ తర్వాత భూ సరిహద్దులు, ఓడరేవుల వద్ద దీనిని అమలు చేస్తారు.

జబల్‌పూర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అత్యాచారం

- ఉద్యోగం పేరుతో క్యాంపస్‌లో మహిళపై ఘాతుకం

జబల్‌పూర్ : బిజెపి ఏలుబడిలోని రాష్ట్రాల్లో మహిళలపై నేరాలకు అదుపు లేకుండా పోతుంది. తాజాగా మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ ప్రభుత్వ విశ్వవిద్యాలయంలో క్యాంపస్‌లోనే 22 ఏళ్ల మహిళపై దుండగులు అత్యాచారం చేశారని అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జితేంద్ర కుమార్ విలేకరులకు శనివారం తెలిపారు.

దీనికి సంబంధించిన నిందితులు దుర్గా శంకర్ సింఘేర్వా (58), ముఖేష్ సేన్‌లను అరెస్టు చేశామని పోలీసులు ప్రకటించారు. తిల్వారా ప్రాంతానికి చెందిన బాధితురాలు విశ్వవిద్యాలయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన ఖాళీల గురించి సోషల్ మీడియాలో తెలుసుకుంది. ఆ వివరాల కోసం వైస్–ఛాన్సలర్ కార్యాలయంకు ఫోన్ చేయగా ఆ కాల్‌ను రిసీవ్ చేసుకున్న శంకర్ ఆమెను విశ్వవిద్యాలయానికి రప్పించి తన స్నేహితుడితో కలిసి అత్యాచారం చేసాడు. ఆమెకు వైస్–ఛాన్సలర్‌తో మాట్లాడి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో అత్యాచారం చేశాడని ఎఎస్పి తెలిపారు. బాధితురాలు శంకర్ సింఘేర్వా తనపై అత్యాచారం చేశాడని ఫిర్యాదు చేసిందన్నారు.

విబి జిఆర్‌ఎంఎం జి పథకాన్ని రద్దు చేసి ఎంజి ఎన్‌ఆర్‌ఇజిఎను పునరుద్ధరించాలి

(మొదటిపేజి తరువాయి)

చేసుకోవడానికి వీలు లేకుండా పోయిందన్నారు. కేంద్రం గతంలో 90 శాతం నిధులు కేటాయిస్తుండగా, నేడు 60 శాతం మాత్రమే నిధులు కేటాయిస్తుందని, మిగిలిన 40 శాతం రాష్ట్రాలు భరించాల్సి ఉంటుందన్నారు.

ధర్నా అనంతరం గవర్నరును కలిసేందుకు రైతు సంఘాల నేతలు బయలుదేరగానే పోలీసులు అడ్డుకున్నారు. కొంతసేపు చర్చలు జరిపిన అనంతరం 15 మందితో కూడిన ప్రతినిధి బృందాన్ని గవర్నరును కలిసేందుకు అనుమతినిచ్చారు. గవర్నరు అబ్దుల్ నజీర్‌ను కలిసిన ప్రతినిధి బృందంలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, రైతు, వ్యవసాయ కార్మిక, కౌలురైతు సంఘాల నాయకులు కె ప్రభాకరరెడ్డి, ఎం హరిబాబు, దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు, ఎ శేఖర్, కెవివి ప్రసాద్, సింహాద్రి ఝాన్సీ, కోటేశ్వరరావు, శివనాగరాణి, పి రామకృష్ణ, ఎం వెంకటరెడ్డి, పి జమలయ్య ఉన్నారు.

రైతు మృతితో ప్రజాగ్రహం

(మొదటిపేజి తరువాయి)

మంత్రి నారాయణ కూడా పూలమాలవేసి నివాళులర్పించాక సిఎం చంద్రబాబుతో కుటుంబ సభ్యులను ఫోన్లో మాట్లాడించారు.

అధైర్యపడకండి అండగా ఉంటా కుటుంబ సభ్యులకు సిఎం హామీ మృతిచెందిన రైతు దొండపాటి రామారావు కుటుంబ సభ్యులతో సిఎం చంద్రబాబు ఫోన్లో మాట్లాడి ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీనిచ్చారు. వారికి అవసరమైన సాయం అందించాలని మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌కు సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ, రాజధాని ప్రాంత కన్వీనర్ ఎం రవి తదితరులు మందడంలో రామారావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం బాబూరావు మీడియాతో మాట్లాడారు. రాజధాని విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి నిర్లక్ష్యం చేశాయని, దీంతో రైతుల్లో ఆవేదన పెరిగిందని తెలిపారు. రామారావు కూడా తన భూములు ఇచ్చి, ఇల్లు కూడా పోతుందనే ఆవేదనతో చనిపోయారని అన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించకుండా, కేంద్రం నుండి రావాల్సిన నిధులు రాబట్టకుండా రాజధాని విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. గతంలో టిడిపి, అనంతరం వైసిపి, ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వాలు రాజధాని రైతుల విషయంలో అనుసరిస్తున్న నిర్లక్ష్యం రామారావు మరణం రూపంలో బయటపడిందని అన్నారు.

రూ.50 లక్షల పరిహారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

మందడం రైతు రామారావు కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. భౌతికకాయానికి నివాళులర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రాజధాని విషయంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు.

నమాజ్ చేసుకుంటున్న వ్యక్తిపై ఇజ్రాయెల్ సైనికుడి క్రూరత్వం

జెరుసలేం : నమాజ్ చేసుకుంటున్న పాలస్తీనా వ్యక్తిపై ఇజ్రాయెల్ సైనికుడి క్రూరంగా ప్రవర్తించాడు. రోడ్డు పక్కన నమాజ్ చేసుకుంటున్న వ్యక్తిని ఏటీవీ వాహనంతో ఉద్దేశపూర్వకంగా ఢీకొట్టాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో అంతర్జాతీయంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వెస్ట్ బ్యాంక్‌లోని దేర్ జరీర్ గ్రామ సమీపంలో ఒక పాలస్తీనియన్ శు క్రవారం రోడ్డు పక్కన నమాజ్ చేసుకుంటుండగా సివిల్ డ్రెస్‌లో ఉన్న ఇజ్రాయెల్ సైనికుడు, తన వాహనంతో ఆ వ్యక్తిని ఢీకొట్టడమే కాకుండా.. కిందపడిపోయిన బాధితుడిపై అరుస్తూ, అక్కడి నుండి వెళ్లిపోవాలని బెదిరించాడు. ఈ దాడిలో బాధితుడి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి.

సైనికుడిపై ఇజ్రాయెల్ సైన్యం చర్యలు

ఈ ఘటనపై తీవ్ర విమర్శలు రావడంతో ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడీఎఫ్) స్పందించింది. నిందితుడైన సైనికుడు తన అధికార పరిధిని అతిక్రమించి, అత్యంత దారుణంగా ప్రవర్తించాడని పేర్కొంది. అతడిని విధుల్లో నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించింది. అలాగే అతడి వద్ద ఉన్న ఆయుధాన్ని స్వాధీనం చేసుకుని, ప్రస్తుతం అతడిని గృహనిర్బంధంలో ఉంచినట్లు సైనిక అధికారులు తెలిపారు.


తుది దశకు జిల్లాల పునర్విభజన

(మొదటిపేజి తరువాయి)

కొనసాగించాలని సిఎం సూచించారు. గిరిజన ప్రాంతాలన్నింటినీ కలిపి ఒకే జిల్లాగా ఏర్పాటు చేయాలని గిరిజన సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు డిమాండ్ చేసినా ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయలేదు. మార్కాపురానికి సమీపంలోని దొనకొండ, కురిచేడు మండలాలను కొత్తగా ఏర్పాటు చేసే మార్కాపురం జిల్లాలో కలపనున్నారు.

నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్లు యథావిధిగా ఉండే ప్రాంతాలు

- శ్రీకాకుళం జిల్లాలోని నందిగాం మండలాన్ని పలాస డివిజన్ నుంచి టెక్కలి డివిజన్‌కు మార్చడం
- అనకాపల్లి జిల్లాలోని చీడికాడ మండలాన్ని నర్సీపట్నం డివిజన్ నుంచి అనకాపల్లి డివిజన్‌కు మార్చడం
- కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలాన్ని కాకినాడ డివిజన్ నుంచి పెద్దాపురం డివిజన్‌కు మార్చడం
- అద్దంకి రెవెన్యూ డివిజన్‌లోని అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, జె.పంగులూరు, కొరిశపాడును ప్రకాశం జిల్లాలోకి మార్పు చేయడం
- కనిగిరి రెవెన్యూ డివిజన్‌లోని మర్రిపూడి, పొన్నలూరు మండలాల్ని కందుకూరు రెవెన్యూ డివిజన్‌లోకి మార్చడంతో పాటు కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపడం. మిగిలిన రెండు మండలాలైన వరికుంటపాడు, కొండాపురాన్ని కావలి డివిజన్‌లోకి మార్చడం
- పలమనేరు డివిజన్‌లోని బంగారుపాలెం మండలాన్ని చిత్తూరు డివిజన్‌కు మార్పు
- చిత్తూరు జిల్లా పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని చౌడేపల్లి, పుంగనూరును మదనపల్లె రెవెన్యూ డివిజన్‌కు మార్చడం
- పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని సదుం, సోమలను పలమనేరులను మదనపల్లె జిల్లాలోని పీలేరు రెవెన్యూ డివిజన్‌కు మార్పు
- శ్రీసత్యసాయి జిల్లాలో కొత్తగా మడకశిర రెవెన్యూ డివిజన్ ఏర్పాటు
- కదిరి రెవెన్యూ డివిజన్‌లోని ఆమదగురు మండలాన్ని పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో విలీనం
- పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లోని గోరంట్ల మండలాన్ని పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లో చేర్చాలని నిర్ణయం



పద పద విశాఖ... శ్రామిక జన పతాక

ఉత్తేజంగా ప్రారంభమైన శ్రామిక ఉత్సవ్

ప్రారంభమైన కళా, విజ్ఞాన, సాహిత్య వేదికలు







ఆకట్టుకున్న కళారూపాలు కదలి వచ్చిన ప్రజలు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ, అనకాపల్లి రూరల్, భీమునిపట్నం విలేకరులు

'పద పద విశాఖ ... శ్రామిక జన పతాక' అంటూ శనివారం రాత్రి విశాఖపట్నంలో శ్రామిక ఉత్సవ్ ఘనంగా ఆరంభమైంది. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి కళాకారులు ఆలపించిన విప్లవ గీతాలు, చేసిన నృత్యాలు సభికుల్లో ఉత్సాహం నింపాయి. ప్రముఖ రచయిత నల్లి ధర్మారావు రచించిన 'పద పద విశాఖ' గేయాన్ని 15 మంది ప్రజానాట్యమండలి కళాకారుల బృందం ఆలాపించింది. 'లేబర్ కోడ్ల ఉచ్చు, కార్మిక భవితకు చిచ్చు' అన్న పాట కార్మికుల హక్కులను పాలకులు ఎలా హరిస్తున్నదీ వివరించింది. మత్స్యకారుల జీవన విధానాన్ని స్ఫురింపజేసేలా భీమిలికి చెందిన కళాకారుడు పోతురాజు ఆధ్వర్యంలో కళాకారులు ప్రదర్శించిన 'జాలారి నృత్యం' లయబద్ధంగా సాగింది. 'అజాదీ..అజాదీ' అంటూ సాగిన పాట కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది. గుజరాత్ రాష్ట్రానికి చెందిన మహిళా కళాకారులు నయీం కైలాస్, సంగీత, చేతన, పాయల్, భావన, రంజన్, రీటా తదితరుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి భారీగా కార్మికులు, మేధావులు, కళాకారులు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. ప్రముఖ సినీ నటుడు ప్రకాష్ రాజ్ డప్పు కొట్టి ఉత్సవ్‌ను ప్రారంభించారు.

విజ్ఞాన, సాహిత్య వేదికల సందడి

పుస్తక ప్రియులు, కళాకారుల కోసం ఏర్పాటు చేసిన పలు ప్రదర్శనలను ప్రముఖులు ప్రారంభించారు. పుస్తక మహోత్సవాన్ని ఆచార్య వెలమల సిమ్మన్న ప్రారంభించారు. సాహిత్య వేదికను సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి, షార్ట్ ఫిలిం ప్రదర్శనను స్టార్ మేకర్ సత్యానంద్, సైన్స్ ఎగ్జిబిషన్‌ను డాక్టర్ ఆర్‌విఎస్.సుబ్రహ్మణ్యం, కార్టూన్ ప్రదర్శనను సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఫొటో ప్రదర్శనను సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు ప్రారంభించారు.

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

'వందేళ్ల ఉత్సవాలు ఆర్‌ఎస్ఎస్ చేసుకోవడానికి ఏం సాధించింది. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో వారు పాల్గొన్నట్టు ఒక్క పేరునైనా ఎవరైనా చెప్పగలరా?. ఈ వందేళ్లలో వారు చెడ్డీల నుంచి ప్యాంటులకు వచ్చారు. మీకు కమలం పువ్వు పైకి కనిపిస్తోంది. నేను దాని కింద ఉన్న విషపు వేళ్లను చూసి చెబుతున్నాను. ఆర్‌ఎస్ఎస్, బిజెపి ఈ దేశానికి పట్టిన విషం' అని ప్రగతిశీలవాది, ప్రముఖ సినీ నటుడు ప్రకాష్ రాజ్ అన్నారు. భారతదేశం సరోవరం అయితే, అందులో బ్రహ్మ రాక్షసుడు ఆర్‌ఎస్ఎస్ అని ఆయన వ్యాఖ్యానించారు. సిఐటియు అఖిల భారత మహాసభ సందర్భంగా శనివారం నుంచి వారం రోజులపాటు విశాఖలో తలపెట్టిన శ్రామిక ఉత్సవ్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన సిఐటియు ఆధ్వర్యంలో విశాఖలోని దసపల్లా హోటల్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. తొలుత మీడియా వారు 'ఎలా ఉన్నారు సార్' అనగానే 'ఏముందన్నా కార్మికులు, వారికోసం పోరాడే వారంటే నాకెంతో ఇష్టం. సిఐటియు పిలవగానే విశాఖపట్నం వచ్చేశాను' అనడంతో అందరూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ రోజు నుంచి వారంపాటు సాంస్కృతిక ఉత్సవాలు, ఆటాపాట, కవులు, రచయితలతో సందడిగా విశాఖ ఉంటుందని, సినిమా నటులను పిలవడం సహజం కదా అని ప్రకాష్ రాజ్ అంటూనే... 'అయితే నేను నటుడిని మాత్రమే కాదు.. అభ్యుదయ ఆలోచనలు, ఆందోళనలకు అండగా ఉండే వ్యక్తిని' అని వివరించారు. సిఐటియు వంటి గొప్ప పోరాట సంఘాలు పిలిస్తే రావడం తన బాధ్యతన్నారు. చెమట చుక్కకి ఓటమి ఉండదని పేర్కొన్నారు.

విశాఖ ఉక్కుపై ....

వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటుపరం చేస్తున్నాయి, మీరేమంటారు అని మీడియా ప్రతినిధులు అడగ్గా.. 'అమ్మేవాడు ఒకడు.. కొనేవాడు ఒకడు. కళ్లముందే వ్యాపారం జరుగుతోంది. ఎందుకంటే ప్రభుత్వాన్ని నడిపేవారే అమ్ముడు పోయారు' అని ప్రకాష్‌రాజ్ పేర్కొన్నారు. పదేళ్లుగా విమానయాన రంగం పెద్దోళ్ల చేతుల్లో ఉండడం, వారికి ప్రభుత్వాలు అమ్ముడుపోవడం కళ్లారా చూశామని ఉదాహరించారు. ఒకవేళ ప్రశ్నిస్తే పోలీసులు, రాజ్యాంగ యంత్రం వారి చేతిలో ఉన్నాయి కదా... పీడీ యాక్ట్ పెడతారు, స్టాన్ స్వామి విషయంలో అన్యాయంగా వ్యవహరించారు, గౌరీ లంకేశ్‌ని చంపిన వారు బెయిల్‌పై బయటకి వచ్చేస్తారు అని ప్రకాష్‌రాజ్ అన్నారు.

ప్రశ్నించడమే మార్గం...

పాలకులకు ప్రశ్నించే వారంటే గిట్టదని తెలిపారు. కానీ, ప్రజలకు నిరంతరం ప్రశ్నించడమే మార్గమని, లేదంటే మార్పు రాదని అన్నారు. మెడికల్ కాలేజీలను ఎపిలో పిపిపి పేరుతో అమ్మడం ప్రజలకు నష్టమని తెలిపారు. అసలు ప్రజలు ఎన్నికల్లో ఎవరిని బలపరచాలో నేర్చుకోవాలన్నారు. కర్ణాటకలోని బెంగళూరులో 1,007 ఎకరాల వ్యవసాయ భూమిని ఇది వరకు ఒకసారి ప్రభుత్వం ప్రైవేట్ వాళ్ల చేతుల్లో పెట్టాలనుకున్నప్పుడు ప్రజలంతా కలిసి పోరాడి ఆపగలిగారని గుర్తుచేశారు. మీడియా కూడా అమ్ముడుపోయిందని, ఎంతోకొంత ఇండిపెండెంట్ మీడియా సక్రమంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. సినిమాలు, మీడియా ద్వారా 90 శాతం చెత్తను పాలకులు ఎక్కిస్తున్నారని, కేరళ ఫైల్స్ అనే సినిమా తీయించి స్వయంగా మోడీయే రూ.కోట్లు ఖర్చు చేసి సినిమా చూడాలనే క్యాంపెయిన్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. అబద్ధాలతో భయాన్ని కలిగించే సామ్రాజ్యాన్ని దేశంలో పాలక శక్తులు నిర్మిస్తున్నాయని అన్నారు.

ప్రజలు నిత్యం పోరాడాలని, ఈ వ్యవస్థను అర్థం చేసుకుని పోరాడేలా సిఐటియు వంటి సంస్థలు చేస్తున్నాయని అభినందించారు. మీడియా సమావేశంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎంఎ.గఫూర్, కందారపు మురళి పాల్గొన్నారు.

శివాజీ చెత్తగా మాట్లాడారు

మహిళల వస్త్రధారణపై సినీనటుడు శివాజీ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ 'ఆడవారి డ్రెస్‌లపై శివాజీ చెత్తగా మాట్లాడారు' అని ప్రకాశ్ రాజ్ అన్నారు. 'ఆడవాళ్లంటే ఏమనుకుంటున్నారు? ఆ భాష ఏంటి?' అని అన్నారు. 'ఆడవారి మీద ఆయన మాటలు అహంకారంతో కూడినవి. వేదికల మీద మాట్లాడేప్పుడు ఒళ్లు, భాష జాగ్రత్తగా ఉండాలి. అనసూయకే నా మద్దతు' అని చెప్పారు. 'ఒక వేదిక మీద నుండి మాట్లాడుతున్నప్పుడు సంస్కారం ఉండాలి. కు సంస్కారంతో చేసే వాళ్ళకు అవయవాలు మాత్రమే కనిపిస్తాయి. మీలో ఉన్నదేగా బయటకు వస్తుంది.' అని అన్నారు. శివాజీ మాటలను ఎవ్వరూ సమర్థించరని అన్నారు. ఐ బొమ్మ రవి వ్యవహారంపై అడిగిన ప్రశ్నకు 'రవి దొంగతనం చేశాడు. దొంగ దొంగే..' అని అన్నారు మావోయిస్టులతో చర్చలు జరపాలని, టెర్రరిస్టుల మాదిరి కాల్చివేయడం ఏమిటని మరో ప్రశ్నకు జవాబుగా ప్రశ్నించారు.

ఆర్‌ఎస్ఎస్ దేశానికి పట్టిన విషం



కార్పొరేట్ల దోపిడీ ఆగాలంటే నిరంతర పోరాటాలు జరగాలి

విలేకరుల సమావేశంలో సినీ నటుడు ప్రకాష్ రాజ్

18 మీటర్ల జెండాతో ఊరేగింపు

సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ఏలూరు జిల్లా చింతలపూడి పట్టణంలో 18 మీటర్ల జెండాతో కార్మికుల ప్రదర్శనకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్ నారాయణ జెండా ఊపి ప్రారంభించారు. కార్మికులు ఎర్రచీరలు, ఎర్ర చొక్కాలు ధరించి ప్రదర్శనలో పాల్గొనడం ఆకర్షణీయంగా నిలిచింది. ముందుభాగాన తీన్మార్ డప్పులతో సాగిన ప్రదర్శనం అందరినీ ఆకట్టుకుంది

CITU
18th ALL INDIA CONFERENCE
2025 DEC 31 - 2026 JAN 4, VISAKHAPATNAM





బాపట్లలో ప్రారంభమైన జాతా శనివారం నిజాంపట్నం, రేపల్లే, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల పరిధిలో ప్రచారం సాగించింది.



విజయవాడలో సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ప్రభాస్ కళాశాల ఆటో స్టాండ్ కార్మికులు ఏర్పాటు చేసిన హోర్డింగ్

సమాయత్తమౌతున్న ఊరూ వాడ

ప్రజాశక్తి - విజయనగరం, పార్వతీపురం మన్యం

సిఐటియు జాతీయ మహాసభకు తరలివెళ్లేందుకు ఊరువాడ సమాయత్తమవుతోంది. అన్ని రంగాల కార్మికులు విశాఖలో జరిగే మహాసభకు తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం సిఐటియు నాయకులు రైస్‌మిల్లులు, పరిశ్రమలు, అంగన్‌వాడీ, ఆశా, ఎమ్‌డిఎమ్ ఇలా అన్ని రంగాల కార్మికులతో సమావేశాలు ఏర్పాటు చేసి మహాసభ ఆవశ్యకతను తెలియజేస్తున్నారు.విజయనగరం జిల్లా రాజాంలోని రైస్‌మిల్లు కళాసి వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ, సాలూరు మండలాల్లో ప్రచార కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీ యూనియన్ మక్కువ మండల నాయకులు ఎల్. దాలమ్మ, సాలూరు మండల నాయకులు పుష్ప, కుమారి పాల్గొని మాట్లాడారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై.నాయుడు, ఎం.శ్రీను పాల్గొని మాట్లాడారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని గొరడ సంతలో సిఐటియు నాయకులు ప్రచారం నిర్వహించారు. బలిజిపేటలో అంగన్‌వాడీలతో కలిసి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, ఉపాధ్యక్షులు రెడ్డివేణు కరపత్రం విడుదల చేశారు.

విజయనగరం : ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో జరగనున్న అఖిలభారత సిఐటియు మహాసభలో కార్పొరేట్ విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించి భవిష్యత్తులో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని తెలిపారు. లేబర్ కోడ్స్ రద్దయ్యే వరకు సిఐటియు పోరాడుతుందని తెలిపారు.



గొరడ సంతలో ప్రచారం

ఆటో, రిక్షా వర్కర్ల ర్యాలీ

ప్రజాశక్తి - కృష్ణా జిల్లా యంత్రాంగం

సిఐటియు 18వ అఖిలభారత మహాసభను విజయవంతం చేయాలని శనివారం కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో ర్యాలీ, విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. 0కృష్ణా జిల్లా మోపిదేవిలో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ఆటో స్టాండ్ నుండి బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. ఒక చేతితో అరుణ పతాకాలు పట్టుకొని, మరో చేతితో కరపత్రాలు పంపిణీ చేస్తూ సిఐటియు మహాసభ ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ర్యాలీలో ప్రధానంగా ఆటో కార్మికులు, రిక్షా వాలాలు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు. అనంతరం మహాసభ కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం చేశారు.



కృష్ణాజిల్లా మోపిదేవిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో, రిక్షా కార్మికులు



రాయచోటి పట్టణంలో నిర్వహిస్తున్న స్కూటర్ ర్యాలీ

అన్నమయ్య జిల్లాలో స్కూటర్ ర్యాలీ

సిఐటియు అన్నమయ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా రాయచోటి, రాజంపేటలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు డి.భాగ్యలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమై జగదాంబ సెంటర్, మదనపల్లి రోడ్, శివాలయం, చెక్ పోస్ట్, బంగ్లా, తానా మీదుగా మాసాపేట వేంపల్లి క్రాస్ చేరుకొని అక్కడ నుండి తిరిగి బంగ్లా సర్కిల్ వద్దకు చేరుకుంది. అనంతరం అక్కడ సభ నిర్వహించారు. అంగన్‌వాడీలు ఎర్రజెండాలు చేత బట్టి చేసిన కోలాట ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది.కార్యక్రమంలో సిఐటియు అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.వి.రమణ, నాగేశ్వరగౌడ్, అంగన్‌వాడీలు, మున్సిపల్, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

హోరెత్తిన ప్రచారం

ప్రజాశక్తి - పశ్చిమగోదావరి యంత్రాంగం

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో శనివారం సిఐటియు ప్రచార కార్యక్రమాలు హోరెత్తాయి. మోటారు సైకిల్ ర్యాలీలు, కరపత్రాలు, వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్మికవర్గం సుదీర్ఘకాలం పోరాడి సాధించుకున్న చట్టాలను లేబర్ కోడ్‌ల పేరిట మార్చి కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులు హరించిందని, విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభ వేదికగా ఆ కోడ్‌లకు వ్యతిరేకంగా సమర శంఖారావం పూరిస్తామని కార్మికులు స్పష్టం చేశారు.

పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో మోటారు సైకిల్ ర్యాలీని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి పట్టణంలోని ప్రధాన కూడళ్ల మీదుగా సాగిన ర్యాలీ అందరినీ ఆకర్షించింది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి వాసుదేవరావు నాయకత్వాన సాగిన ర్యాలీలో మెడికల్ రిప్‌లు, మున్సిపల్, రైస్‌మిల్లు, బజార్ జట్ల కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎపిఎంఎస్‌ఆర్‌యు భీమవరం బ్రాంచి కమిటీ ఆధ్వర్యాన సిఐటియు మహాసభకు విరాళంగా రూ.50 వేలు అందించారు. ఈ నేపథ్యంలో గోపీమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్య పోరాటాలే శరణ్యమన్నారు. విశాఖలో జనవరి నాలుగున జరుగుతున్న బహిరంగ సభలో వేలాది మంది పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

తణుకులో నాలుగున జరిగే బహిరంగసభను జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాన్ని మాజీ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికుల శ్రమను గుర్తించని పాలకులు నేడు అధికారంలో ఉండడం బాధాకరమన్నారు. ఇరగవరం, వీరవాసరంల్లో బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరించారు.

భీమడోలు మండలం పూళ్లలో బహిరంగ సభ పోస్టర్లను అంగన్‌వాడీలతో కలిసి సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ లింగరాజు ఆవిష్కరించారు. నిడమర్రు మండలం నిడమర్రు, బువనపల్లి గ్రామాల్లో కార్మికవాడల్లో నేతలు విస్తృత ప్రచారం నిర్వహించారు. కొయ్యలగూడెంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిడిపిఒ కార్యాలయం వద్ద సిఐటియు జెండావిష్కరణ నిర్వహించారు.

సిఐటియు ఏలూరు నగర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన ఏలూరులో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యాలయం నుండి ర్యాలీని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ రవి ప్రారంభించారు.



భీమవరంలో మోటారు సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి



2కె రన్‌ను ప్రారంభిస్తున్న అచ్యుతాపురం ఎస్ఐ వెంకటరావు

సిఐటియు అఖిల భారత మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ శనివారం అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో 2కె రన్ నిర్వహించారు. దీనిని స్థానిక ఎస్ఐ వెంకటరావు ప్రారంభించారు. వందమందికి పైగా యువత ఉత్సాహంగా పాల్గొనగా, విజేతలకు బహుమతులు అందజేశారు. సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన చిట్టివలస, తగరపువలసలో రెడ్ షర్ట్ వాలంటీర్లు కవాతు నిర్వహించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68